గురువారం 19-1-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50 సంపుటి: 15 సంచిక: 298

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'



గిల్ హల్‌చల్...

న్యూజిలాండ్‌తో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన తొలి వన్డేలో భారత్ 12 పరుగుల తేడాతో గెలిచింది. శుబ్‌మన్ గిల్ (149 బంతుల్లో 208 ; 19 ఫోర్లు, 9 సిక్స్‌లు) 'డబుల్ సెంచరీ'తో అదరగొట్టాడు.

- వివరాలు 12లో▶



ఉక్రెయిన్‌లో కూలిన హెలికాప్టర్

కీవ్ సమీపంలో దేశ అత్యవసర విభాగ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో మంత్రి డెనిస్‌తో సహా 18 మంది మరణించారు.

- వివరాలు 6లో▶



లైంగికంగా వేధిస్తున్నాడు

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌శరణ్ సింగ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని మహిళా రెజ్లర్ల ఆరోపణ.

- వివరాలు 12లో▶



జనాభాలో చైనాను దాటేశాం

జనాభాలో మనం చైనాను దాటేశామా? ప్రపంచంలోకెల్లా ఎక్కువ జనాభా ఉన్న దేశంగా అవతరించామా!!

- వివరాలు 6లో▶



పతనం అంచున పాక్

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్ ఆర్థిక సాయం కోసం ప్రపంచ దేశాల ముందు చేయిచాస్తోంది.

- వివరాలు 6లో▶



ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ బహిరంగసభకు హాజరైన జన సందోహం

భారతజాతి విముక్తి కోసమే..



ప్రశ్నించడానికి, చైతన్యం తేవడానికే బీఆర్‌ఎస్ ● దేశం దుస్థితికి కారణం కాంగ్రెస్, బీజేపీలే..: కేసీఆర్



ఖమ్మం బహిరంగసభలో అభివాదం చేస్తున్న యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, పంజాబ్, ఢిల్లీ, తెలంగాణ, కేరళ ముఖ్యమంత్రులు భగవంత్‌సింగ్‌మాన్, కేజ్రీవాల్, కేసీఆర్, పినరయి విజయన్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

- ఉజ్వలమైన భారత దేశాన్ని ఆవిష్కరిస్తాం
- ప్రభుత్వ సంస్థలను అమ్మినా మేమొచ్చాక మళ్లీ తెచ్చుకుంటాం..
- ప్రధాని మోదీ.. 2024 తర్వాత నువ్వు ఇంటికి.. మేం ఢిల్లీకి
- అధికారంలోకి వస్తే అగ్నిపథ్‌ను రద్దు చేస్తాం
- దేశమంతా దళితబంధు.. రైతులకు ఉచిత కరెంటు
- ఇంటింటికీ నల్లా నీళ్లు ఇస్తామని ప్రకటన
- ఖమ్మంలో భారీగా బీఆర్‌ఎస్ బహిరంగ సభ
- హాజరైన కేరళ, ఢిల్లీ, పంజాబ్ సీఎంలు, యూపీ మాజీ సీఎం, ఇతర జాతీయ నేతలు

2 లో

దేశంలో రాజ్యాంగ సంక్షోభం

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ సంపదను కొల్లగొడుతున్నాయి: కేరళ సీఎం విజయన్

దేశం మార్పు కోరుతోంది

కేంద్రంలో బీజేపీ సర్కారును తరిమికొట్టాల్సిందే: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

బీజేపీ దేశాన్ని అమ్మేస్తోంది

ఖమ్మం సభలో పంజాబ్ సీఎం భగవంత్‌మాన్

2024లో బీజేపీని ఓడించాలి

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపు

కేసీఆర్‌తో కలిసి కేంద్రంలో సర్కార్ ఏర్పాటు

యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ధీమా

- వివరాలు 2లో▶

బీజేపీపై విమర్శలు.. కూటమి సంకేతాలు 3 లో నరసింహుడి సేవలో సీఎంలు

“ మీది ప్రైవేటైజేషన్.. మాది నేషనలైజేషన్

ఏదైనా నష్టమొస్తే సమాజం నెత్తిన రుద్దడం. ధరలు పెంచి, సామాన్య ప్రజల మీద ట్యాక్స్‌లు వేయడం.. అదే లాభం వస్తే ప్రైవేట్ దారులకు దోచిపెట్టడం.. ఇది బీజేపీ విధానం. వారు చెప్పే నీతి. అయ్యా ప్రధాని మోదీ గారు.. మీ పాలసీ ప్రైవేటైజేషన్.. మా పాలసీ నేషనలైజేషన్.. రైళ్లు పోయినై.. విమానాలు పోయినై.. చివరకు వ్యవసాయాన్ని కూడా ప్రైవేట్ చేస్తరట. మన భూములను కార్పొరేట్ గద్దలకు ఇచ్చి.. మనమే వారి వద్ద జీతాలు తీసుకునే పరిస్థితికి తెస్తున్నారు.

- సీఎం కేసీఆర్



కంటివెలుగు షురూ 2 లో

కంటివెలుగు ప్రారంభం సందర్భంగా గిరిజన మహిళకు కంటిఅద్దాలు తొడుగుతున్న కేరళ సీఎం విజయన్

న్యూస్‌రీల్

రాష్ట్రంలో దోచింది చాలక దేశంపై పడ్డారు



తెలంగాణ సంపదనంతా దోచుకున్న కల్వకుంట్ల కుటుంబం అది చాలక ఇప్పుడు దేశంపై పడిందంటూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబంపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం ప్రధాని మోదీని తిట్టేందుకే ఖమ్మం సభ పెట్టారన్నారు. సభలో మాట్లాడిన నేతలెవరూ బీఆర్‌ఎస్ గురించి మాట్లాడలేదని, తమ భవిష్యత్ అంధకారంలో పడుతోందన్న ఆందోళనతోనే మాట్లాడారని ఎద్దేవా చేశారు.

- వివరాలు 3లో▶

కాంగ్రెస్ కీలక నేతకు రూ.500 కోట్ల ఆఫర్



కర్ణాటకలో త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు తెలంగాణ సీఎం కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కర్ణాటకలోని కీలక కాంగ్రెస్ నేతను లొంగదీసుకునేందుకు రూ.500 కోట్లు ఆఫర్ చేశారని ఆరోపించారు. ఖమ్మంలో కేసీఆర్ ఉపన్యాసం వింటే మోదీతో వైరం ఉందని నమ్మించే ప్రయత్నం చేసినట్లుందన్నారు.

- వివరాలు 3లో▶

సచివాలయం కింద 'చెరువు'



రాష్ట్ర కొత్త సచివాలయ భవనం భూగర్భంలో ఏకంగా ఓ మినీ రిజర్వాయర్‌ను నిర్మించారు. రెండున్నర లక్షల లీటర్ల సామర్థ్యంతో ఈ స్టోరేజీ ట్యాంకును సిద్ధం చేశారు. వాన నీటిని ఒడిసి పట్టేందుకు వీలుగా దీన్ని నిర్మించారు. భవనం నలువైపుల నుంచి వాన నీటిని ఇందులోకి తరలించేందుకు ప్రత్యేక పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు.

- వివరాలు 10లో▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | సూచించిన నేటి గుడ్డు & చికెన్ కరీంనగర్ జోన్ ధరలు

గుడ్ల రిటైల్ ధర ₹72 డజన్	ఫారం దగ్గర లైవ్ బర్డ్	107	బ్రాయిలర్ స్కిన్‌తో	187
	రిటైల్ లైవ్ బర్డ్	129	స్కిన్‌లెస్	213



మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు.. చివరకు కరోనాతో సాధ్యమైంది!

రూ. 2,000 కోట్లు

హైదరాబాద్‌లో హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు భారతీ ఎయిర్‌టెల్ పెట్టుబడి

- దావోస్ వేదికగా ప్రకటించిన భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్, ఎండీ రాజన్ భారతీ మిట్టల్..
- జీనోమ్ వ్యాలీలో ఫ్రాన్స్‌కు చెందిన యూరోఫిన్స్ అత్యాధునిక ప్రయోగశాల ఏర్పాటుకు ఓకే
- కేటీఆర్‌తో సమావేశం



భారతీ ఎయిర్‌టెల్ గ్రూప్ చైర్మన్‌తో కేటీఆర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: దేశంలో టెలికం రంగంలోని అగ్రగామి సంస్థ భారతీ ఎయిర్‌టెల్ హైదరాబాద్‌లో రూ. 2వేల కోట్ల భారీ పెట్టుబడితో హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. డేటా స్టోరేజ్, విశ్లేషణలో అత్యాధునిక సాంకేతికత అయిన హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను తన అనుబంధ సంస్థ అయిన 'నెక్స్ ట్రా' ద్వారా భారతీ ఎయిర్‌టెల్ నెలకొల్పనుంది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం మిగతా 10వ పేజీలో ▶

ఇక ప్రతి నెలా సర్దుబాదుడు!

ఇంధన సర్దుబాటు చార్జీల వసూలుకు ఈఆర్సీ గ్రీన్ సిగ్నల్

- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి.. వ్యవసాయానికి మినహాయింపు
- ఒక నెల ఎఫ్‌ఎస్‌ఏ చార్జీలు మూడో నెల బిల్లులో కలిపి తదుపరి నెలలో జారీ
- ప్రతి యూనిట్ విద్యుత్‌పై గరిష్టంగా 30 పైసల వరకు వసూలుకు అనుమతి
- టీఎస్‌ఈఆర్సీ మూడో సవరణ నిబంధనలు–2023 ప్రకటన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుల నుంచి ప్రతి నెలా ఇంధన సర్దుబాటు చార్జీలు(ఎఫ్‌ఎస్‌ఏ) వసూలు చేసేందుకు లేదా వారికి తిరిగి చెల్లించేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) అనుమతిచ్చింది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ మూడో సవరణ నిబంధనలు–2023ను బుధవారం ప్రకటించింది. ఇంధన/ విద్యుత్ కొనుగోలు వ్యయం సర్దుబాటు చార్జీల భారాన్ని ఆటోమేటిక్‌గా విద్యుత్ బిల్లులకు బదిలీ చేసేందుకు ..కేంద్ర ప్రభుత్వం 2021 అక్టోబర్ 22న ఎలక్ట్రిసిటీ (టైమ్లీ రికవరీ ఆఫ్ కాస్ట్స్ డ్యూ టు చేంజ్ ఇన్ లా) రూల్స్ 2021ను అమల్లోకి తెచ్చింది. బొగ్గు, ఇతర ఇంధనాల ధరల పెరుగుదలతో పెరిగిపోతున్న విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని ఎప్పటికప్పుడు వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో వసూలు చేసేందుకు కేంద్రం ఈ నిబంధనలను తీసుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలో సైతం మిగతా 10వ పేజీలో ▶

ఈశాన్యాన ఎన్నికల నగారా

త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో ఓట్ల పండుగ



ఈశాన్యాన ఎన్నికల నగారా మోగింది. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. త్రిపురలో ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయల్లో 27న పోలింగ్ జరగనుంది. మార్చి 2న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటాయి. జనవరి 31న నోటిఫికేషన్ రానుంది. ఈ మూడు ఈశాన్య రాష్ట్రాలూ బీజేపీ చేతిలోనే ఉన్నాయి. పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డనుండగా, తృణమూల్ కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది.

- వివరాలు 6లో▶

గుజరాత్ మోడల్‌తో మిషన్-90!

రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా బీజేపీ వ్యూహరచన

- పోలింగ్‌బూత్ స్థాయి నుంచి సంస్థాగత పటిష్టతే లక్ష్యం
- అసెంబ్లీ విజయానికి అదొక్కటే గీటురాయి అని ఉద్బోధ
- 28న రాష్ట్రానికి అమిత్ షా... 2 లోక్‌సభ స్థానాల్లో పర్యటన?



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో 90 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా 'మిషన్–90'పై బీజేపీ అధినాయకత్వం దృష్టి కేంద్రీకరించింది. దీనికోసం తెలంగాణలోనూ 'గుజరాత్ మోడల్'ని తు.చ. తప్పకుండా అమలుచేసి పూర్తిస్థాయిలో సంస్థాగతంగా బలోపేతం చేయాలని రాష్ట్రపార్టీని ఆదేశించింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు కీలకంగా మారిన నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌స్థాయిల్లో పార్టీని పటిష్టం చేయడం ఒక్కటే విజయానికి బాటలు వేస్తుందని స్పష్టంచేసింది. దీనికి సంబంధించిన కచ్చితమైన కార్యాచరణను అమలుచేయాలని, బూత్ కమిటీల ఏర్పాటు, పూర్తిస్థాయిలో వనరుల వినియోగంపై తమ ఆదేశాలు అమలు చేయాలని చెప్పింది. ఎన్నికల దృష్ట్యా 'ఓటర్ రీచౌట్ ప్రోగ్రామ్'ను వెంటనే మొదలుపెట్టి, ఎన్నికలు ముగిసేదాకా విడవకుండా కొనసాగించాలని ఆదేశించింది. కిందిస్థాయిలో (బూత్‌స్థాయిలో) క్రమం తప్పకుండా ప్రజలతో సంబంధాలు కొనసాగించాలని పేర్కొంది. దీంతోపాటు కేంద్రంలో మోదీ ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, మిగతా 3వ పేజీలో ▶

ఇలా ముందుకు...

తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఏదో సాధించేశామని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలి. ప్రాధాన్యతా రంగాలు మొదలుకుని.. వివిధ శాఖల వారీగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, నిర్దేశిత లక్ష్యాలు, ఫలితాల సాధనలో వెనకడుగు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడం వంటి వాటిపై గ్రామస్థాయిలో, మరీ ముఖ్యంగా ప్రతీ పోలింగ్‌బూత్‌స్థాయిలో కార్యక్రమాలకు రూపకల్పన చేస్తారు.

గుజరాత్‌లో ప్రధానంగా ఉన్న అభివృద్ధి సూచికలు

● అతి తక్కువ నిరుద్యోగం ● అధిక రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) ● సబర్మతి నదిని వనరులుగా మలచుకోవడం ● మహిళలకు అత్యంత భద్రత ● ఆరోగ్యవంతులైన పిల్లలు

ప్రత్యేక చట్టమూ లేదు..

2014 నుంచి సేవలందిస్తున్నా ప్రత్యేక చట్టం, ఠాణా హోదా లేని షీ–టీమ్స్



ఎనిమిదేళ్లుగా ఎనలేని సేవలందిస్తున్న 'షీ–టీమ్స్'కు సంబంధించి ప్రత్యేక చట్టం, ఠాణా హోదా లేకపోవడంతో బాధితులకు పూర్తిగా న్యాయం జరగట్లేదు. 'తమిళనాడు ప్రొహిబిషన్ ఆఫ్ ఈవ్ టీజింగ్ యాక్ట్' తరహాలో అధికారులు ముసాయిదాను రూపొందించి 2014లో ప్రభుత్వానికి పంపారు. ఇప్పటికీ ఈ ఫైలు న్యాయశాఖ వద్ద పెండింగ్‌లోనే ఉంది.

- వివరాలు 5లో▶



ఖమ్మం సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. వేదికపై నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నామా నాగేశ్వరరావు, కె.కేశవరావు, పువ్వాడ అజయ్‌కుమార్, హరీశ్‌రావు, అఖిలేశ్‌యాదవ్, భగవంత్‌సింగ్ మాన్, కేజ్రీవాల్, డి.రాజా, పువ్వాడ నాగేశ్వరరావు, కూనంనేని, తమ్మినేని, సత్యవతి రాథోడ్, సబితారెడ్డి, కవిత, జగదీశ్‌రెడ్డి, వినోద్‌కుమార్, రేగా కాంతారావు

భారత జాతి విముక్తి కోసమే బీఆర్ఎస్!

దేశం దుస్థితికి కారణం కాంగ్రెస్, బీజేపీలే.. ఖమ్మం బీఆర్ఎస్ సభలో సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: భారతదేశ దుస్థితికి, ఇప్పుడు జరుగుతున్న దుర్మార్గాలకు కేంద్రాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలే కారణమని.. భారత జాతిని విముక్తం చేయడం కోసమే బీఆర్ఎస్ పుట్టిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. దేశంలో విస్తృతమైన వ్యవసాయ భూమి, 70 వేల టీఎంసీల నీళ్లు, అవసరానికి మించిన కరెంటు ఉత్పత్తి ఉన్నా.. వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితిలో ఉందని మండిపడ్డారు. 'భయ్యా హమ్‌నే కర్ దియా.. ఉన్హోనే రోక్ దియా..' అంటూ కాంగ్రెస్ ఉంటే బీజేపీని తిట్టడం, బీజేపీ ఉంటే కాంగ్రెస్‌ను తిట్టడమే సరిపోయిందన్నారు. మనకు కావాల్సింది ఇది కాదని.. ఈ చైతన్యం తేవడానికి, ప్రశ్నించడానికే బీఆర్ఎస్ వస్తోందని ప్రకటించారు. బీఆర్ఎస్ ఏర్పాటైన తర్వాత తొలిసారిగా ఖమ్మంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ అరగంటకుపైగా ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రాజకీయాల్లో ఎందరో గెలిచారు. ఎందరో ఓడారు. ఇది పెద్ద విషయం కాదు. కానీ ఈరోజు మన దేశం, సమాజం లక్ష్యం ఏమిటి? దేశం దారి తప్పిందా? తన లక్ష్యాన్ని కోల్పోయిందా? దారి తప్పిందా? ఏం జరుగుతోంది ఈ దేశంలో..? అనే ప్రశ్నలు నా అంతరాత్మను అనేక రోజులుగా కలచి వేస్తున్నాయి. దయచేసి మనమందరం సీరియస్‌గా ఆలోచించాల్సిన విషయం ఒక్కటే. ఎవరినీ అడుక్కునే అవసరం లేని.. ప్రపంచ బ్యాంకు అప్పు అవసరం లేని.. ఏ అమెరికా కాళ్లు మొక్కాల్సిన అవసరం లేని.. ఏ విదేశీయుల సాయం తీసుకోవాల్సిన అవసరం లేని సహజ సంపద మన దేశ ప్రజల సొత్తు. లక్షల కోట్ల ఆస్తి ఉంది. అదంతా ఏమవుతోంది? ఏదీలేక భిక్షమెత్తుకుంటే ఫర్వాలేదు. ఉండి కూడా ఎందుకు యాచకులం కావాలి?

అన్నీ ఉన్నా.. దిగుమతులా?

అమెరికా విస్తీర్ణంలో మనకంటే రెండున్నర రెట్లు పెద్దగా ఉంటుంది. కానీ వాళ్లకున్న వ్యవసాయ భూమి 29 శాతమే. చైనా మనకంటే ఒకటిన్నర రెట్లు పెద్దది. వాళ్లకున్న వ్యవసాయ భూమి 16 శాతమే. అదే భారతదేశంలో సగం భూమి అంటే.. 41 కోట్ల ఎకరాలు సాగుకు అనుకూలమైన భూమి ఉంది. అపారమైన జల సంపద ఉంది. ఏటా వానలతో 1.4 లక్షల టీఎంసీల నీళ్లు చేరుతాయి. సగం ఆవిరైపోయినా 70- 75 వేల టీఎంసీల నీళ్లు ఉంటాయి. పంటలు పండటానికి అవసరమైన సూర్యరశ్మి ఉంటుంది. సముద్ర తీరప్రాంతాల్లో ఉండే హ్యూమిడ్ (తేమతో కూడిన) వాతావరణం.. సముద్ర తీరం లేని తెలంగాణ, మధ్యప్రదేశ్, యూపీ, ఢిల్లీ వంటి ల్యాండ్ లాక్‌డ్ భూములు.. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్ లాంటి శీతల రాష్ట్రాలు.. మూడు రకాల అద్భుతమైన ఆగ్రో క్లైమేటిక్ జోన్లు ఉన్నాయి. ఇండియాలో యాపిల్ కూడా పండుతుంది.. మామిడి కూడా పండుతుంది. కష్టించి పనిచేసే 139 కోట్ల జనాభా ఉంది. ఇన్ని ఉన్న దేశంలో మెక్‌డోనాల్డ్ పిజ్జాలు, మెక్‌డొనాల్డ్ బర్గర్లా మనం తినేది. సాగునీటితో అద్భుతమైన పంటలు పండించి, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ పెట్టి, కోట్ల మందికి ఉద్యోగాలు కల్పించి, బెస్ట్ ఫుడ్‌చైన్ ఆఫ్ వరల్డ్‌గా ఇండియా ఉండాల్సి ఉంది. కానీ కెనడా నుంచి కందిపప్పు తెచ్చుకుంటున్నాం.. లక్ష కోట్ల విలువైన పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాం.. ఇంత కన్నా సిగ్గుచేటు ఇంకేమైనా ఉంటుందా?

అమ్మేయ్.. వాపస్ తెస్తాం..

ఎల్ఐసీకి రూ.48 లక్షల కోట్ల ఆస్తులు, లక్షలాది మంది ఏజెంట్లు, ఉద్యోగులు ఉన్నారు. అప్పనంగా అడ్డికి పావుసేరుగా దానిని షావుకార్లకు అమ్ముదామని చూస్తున్నావు. నువ్వు అమ్మినా గ్యారెంటీగా మళ్లీ ఎల్ఐసీని వాపస్ చేసుకుంటాం. పబ్లిక్ సెక్టార్‌లోనే కొనసాగిస్తాం. మోదీ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్ముతా అంటున్నారు. మేం మళ్లీ విశాఖ ఉక్కును పబ్లిక్ సెక్టార్‌లోకి తెస్తాం. మోదీ ఇవాళ అమ్ముతా, అమ్ముతా అంటున్నావ్. అమ్మేయ్.. ఫర్వాలేదు. 2024 తర్వాత నువ్వు ఇంటికి.. మేము ఢిల్లీకి..

కొన్నిరోజుల్లోనే బీఆర్ఎస్ పాలసీ

కేజ్రీవాల్, భగవంత్‌సింగ్‌మాన్, అఖిలేశ్ యాదవ్, విజయన్, రాజా, ఇతర నేతలు మాకు సంఘీభావాన్ని, ఎంతో బలాన్ని ఇచ్చారు. కొన్నిరోజుల్లోనే బీఆర్ఎస్ పాలసీని ప్రజల ముందు పెడతాం. మా పాలసీపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, మాజీ సుప్రీంకోర్టు జడ్జీలు 100 మంది దాకా పనిచేస్తున్నారు. ఫైనల్ డ్రాఫ్టింగ్ జరుగుతోంది. చర్చకు పెడతాం. సీపీఎం, సీపీఐ వంటి ప్రగతిశీల పార్టీలతో దేశవ్యాప్తంగా కలసి పనిచేస్తాం. అంతిమ విజయం మనదే.. న్యాయం, ధర్మం గెలుస్తుంది.

ఎవరిదీ పాపం?

సెంట్రల్ వాటర్ కమిషన్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారమే.. దేశంలో 75వేల టీఎంసీల నీళ్లుంటే.. వాడుకుంటున్నది నికరంగా 19 వేల టీఎంసీలే. మరోవైపు కోట్లాది మందికి ఈ రోజుకూ విషపు మంచినీళ్లే గతి. దీనికి ఎవరు బాధ్యులు? ఎవరిదీ పాపం? స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో వేసిన కొన్ని ప్రణాళికలు, కట్టిన కొన్ని ప్రాజెక్టులు తప్ప తర్వాత అతీగతీ లేదు. కృష్ణా జలాల వివాదంపై బ్రిజేశ్ ట్రిబ్యునల్ వేసి 20 ఏళ్లు గడుస్తున్నా ఏమీ తేలలేదు. ఆ జడ్జి ముసలివాడయ్యారు. నలుగురు తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెడతారు. ఆయన ఎప్పుడు హరీ అంటారో ఎవరికీ తెలియదు. ఆయన తీర్పు చెప్పేది ఎప్పుడు? తర్వాత క్లియర్ చేసేదెప్పుడు? డిజైన్లు ఎప్పుడు, నిధులు సమకూరేదెప్పుడు, ప్రాజెక్టులు కట్టేదెప్పుడు.. ప్రజలకు సాగునీరు, తాగునీరు వచ్చేది ఇంకెప్పుడు? దీనికేమన్నా అంతర్జాతీయ రాజనీతి కావాలా? ప్రపంచ బ్యాంకు దగ్గర చిప్ప పట్టుకోవాలా? కాదుకదా.. నదుల్లో నీరు సముద్రం పాలవుతుంటే నోర్లెళ్లబెట్టుకుని కూర్చుని కహానీలు, కథలు చెప్పి.. ప్రజలను గోల్‌మాల్ చేస్తున్నారు.

నీటి యుద్ధాలు ఆగాలి

సట్లేజ్ దాని ఉప నదులపై పంజాబ్, హరియాణా రోజూ తన్నుకుంటూ ఉంటాయి. మహానది నీళ్ల కోసం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ యుద్ధం, నర్మద జలాల కోసం గుజరాత్, మధ్యప్రదేశ్ మధ్య కొట్లాట, కావేరీ జలాల కోసం తమిళనాడు, కర్ణాటక గొడవ.. గోదావరి, కృష్ణాల మీద మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రా పంచాయితీ.. ఇవి ఇలా కొనసాగుతూనే ఉండాలా? పాలన చేతగాక, చిత్తశుద్ధి లేక డొల్ల మాటలు, కల్లబొల్లి కబుర్లు చెప్పే పాలకులే ఉండాలా?

ఆ డబ్బా రేకుల మాటలు విందామా?

కరెంట్ ఇవ్వలేరు.. మంచినీరు ఇవ్వలేరు. వారి డబ్బా రేకుల మాటలు విందామా? దేశంలో కోస్గి, గండకి నదులతో సగం బీహార్ వరదలతో, సగం కరువుతో అల్లాడుతున్నాయి. అక్కడ ప్రాజెక్టు కడితే బ్రహ్మాండంగా కరెంట్ వచ్చేది. ఇలాంటివి పట్టించుకోకుండా.. ఈ దేశంలో ప్రజలను మోసగించడానికి, గోల్‌మాల్ చేయడానికి ప్రధాని మోదీ కబుర్లు చెప్తారు. బీజేపీ తమ వైఫల్యాలు, అసమర్థతను, చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి మత విద్వేషాలను రేపుతోంది. మతం మత్తులో యువతను చెడగొట్టే ప్రయత్నం చేస్తోంది. మత విద్వేషం దేశాన్ని దహించి వేస్తుంటే ఎందుకు సహించాలి?

దేశమంతా ఉచిత కరెంటు ఇస్తాం

దేశంలో అందుబాటులో ఉన్న కరెంటు 4.10 లక్షల మెగావాట్లు. దేశంలో ఏ రోజు కూడా 2.10 లక్షలకు మెగావాట్లకు మించి వాడలేదు. అయినా ఒక్క తెలంగాణలో తప్ప అన్ని రాష్ట్రాల్లో కరెంట్ కోతలే. బీఆర్ఎస్ వంటి భావజాలం ఉన్న పార్టీలు అధికారంలోకి వస్తే.. మన తెలంగాణలా రెండేళ్లలో వెలుగు జిలుగులతో భారతదేశం వెలిగిపోతుంది. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని అడిగితే దాని మీద 96 కథలు చెప్పారు. ఇదేనా దేశాన్ని పాలించే తీరు. మొత్తం దేశమంతటా తెలంగాణ తరహాలో ఉచిత కరెంట్ ఇవ్వాలి. దీనికి అయ్యే ఖర్చు లక్షా 45 వేల కోట్లు మాత్రమే. రేపు బీఆర్ఎస్ గవర్నమెంట్, లేదా ప్రతిపాదించే గవర్నమెంట్ వస్తే దేశం మొత్తానికి ఉచిత కరెంట్ సరఫరా చేస్తాం.

దేశమంతా దళితబంధు ఇవ్వాలి

లాభం ఉన్నవారు పేదలను ఆదుకోవడం అనాదిగా ఉన్న సంప్రదాయం. ధనవంతులు ధర్మశాలలు కట్టించడం సంప్రదాయం. కానీ పేదలను షావుకార్లకు అప్పగించి చావగొడతరా? దళిత బిడ్డలు ఎవరికోసం వివక్ష అనుభవించాలి? అందుకే తెలంగాణలో దళితబంధు పథకం పుట్టింది. అంబేడ్కర్, కాన్షీరామ్‌లు చూపిన బాటలో దళిత జాతి పైకి వచ్చి తీరాలి. తెలంగాణ దళితబంధు వంటి పథకాన్ని ఏటా 25 లక్షల కుటుంబాల చొప్పున దేశమంతటా అమలు చేయాలి. మీరు చేయకపోతే మేం వచ్చాక చేసి చూపెడతాం.

మహిళలపై వివక్ష పోవాలి

ఏ సమాజంలో మహిళలను అన్ని రంగాల్లోకి ఆహ్వానించారో అక్కడ అభివృద్ధి జరుగుతోంది. ఎంత తెలివున్నా నువ్వు వంటింట్లోనే ఉండు, మేం బలాదూర్ తిరుగుతామనే పద్ధతి దేశం ఉంది. ఈ లింగ వివక్ష పోవాలి. మహిళల పాత్రను అన్ని రంగాల్లో పెంపొందించాలి. వారికి చట్టసభల్లో రిజర్వేషన్‌ను కూడా బీఆర్ఎస్ ప్రతిపాదిస్తోంది.

అసమర్థ పాలనను తొలగిద్దాం

కేంద్రంలో విపక్షాల ప్రభుత్వం రాగానే మిషన్ భగీరథ తరహాలో దేశమంతా ప్రతి ఇంటికి శుద్ధమైన మంచినీళ్లు ఇస్తాం. సైన్యంలో నియామకం అంటే ఒక పద్ధతి ఉండాలి. దానిలో కూడా వేలు పెట్టి తెలివి తక్కువ విధానం తెచ్చారు. విపక్షాల ప్రభుత్వం ఈ అగ్నిపథ్‌ను రద్దు చేస్తుంది. పాత పద్ధతిలోనే నియామకాలు కొనసాగిస్తాం. రైతులు, మహిళలు, కార్మికులు, దళిత బిడ్డలు అందరం ఒక్కటైతే అసమర్థ పాలనను తొలగించడం కష్టమేం కాదు. ఉజ్వలమైన భారతదేశం ఆవిష్కరించడానికే బీఆర్ఎస్ ఆవిర్భవించింది..'' అని కేసీఆర్ పేర్కొన్నారు.

మనకెందుకు భారీ ప్రాజెక్టుల్లేవు?

జింబాబ్వే అనే చిన్న దేశంలో జాంబేజీ నది మీద 6,533 టీఎంసీల భారీ రిజర్వాయర్ ఉంది. రష్యాలో అంగారా నది మీద 5,968 టీఎంసీలతో.. ఘనాలోని ఓల్టా నది మీద 5,085 టీఎంసీలతో.. కెనడాలో మనికుగాన్ నది మీద 4,944 టీఎంసీలతో భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈజిప్టులో నైలునది మీద ప్రాజెక్టు, చైనాలో యాంగ్జి నది మీద, అమెరికాలో కొలరాడో మీద భారీ రిజర్వాయర్లు ఉన్నాయి. మరి మన దేశానికి అలాంటిది ఏది? ఇంత సువిశాల దేశం, 139 కోట్ల జనాభా, కరువులు, కాటకాలు చూసినం, వరదలు చూస్తున్నం.. ఒక్కటైనా పెద్ద ప్రాజెక్టు కట్టి నీళ్లు వాడుకోలేమా? నదుల నీళ్లు మళ్లించుకుని ప్రజల దాహం తీర్చుకోవద్దా? మనం సన్యాసుల్లా ఉండాలా? దేశం ఆలోచించాలి. ఇది ప్రశ్నించడానికి, చైతన్యం తేవడానికి పుట్టిందే బీఆర్ఎస్. తెలంగాణ తరహాలో దేశవ్యాప్త ఉద్యమం తెచ్చి అయినా సరే.. కేంద్రం మెడలు వంచాలి. పోరాటం జరగాలి. లేకపోతే మనం ముందుకు పోలేం.

రెండో విడత కంటి వెలుగు షురూ

రాష్ట్రంలో రెండో విడత 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని, ఖమ్మం సమీకృత కలెక్టరేట్‌ను.. కేరళ, ఢిల్లీ, పంజాబ్ సీఎంలు పినరయి విజయన్, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌మాన్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాలతో కలిసి సీఎం కేసీఆర్ బుధవారం ప్రారంభించారు. తొలుత నేతలంతా యాదాద్రి నుంచి రెండు హెలికాప్టర్లలో ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం వద్ద నిర్మించిన కొత్త కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల మధ్య కలెక్టరేట్‌ను ప్రారంభించారు. తర్వాత కలెక్టర్ వీపీ గౌతమ్‌ను చాంబర్‌లోని సీట్లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత ఖమ్మంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తర్వాత కేసీఆర్, ఇతర సీఎంలు, నేతలు కలిసి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటికే ఎంపిక చేసి, కంటి పరీక్షలు పూర్తయిన ఆరుగురు లబ్ధిదారులకు.. ఆరుగురు అతిథుల చేతుల మీదుగా కంటి అద్దాలను అందజేశారు.


ప్రజాసమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన భట్టి విక్రమార్కను జాతీయ నేతలకు పరిచయం చేస్తున్న సీఎం కేసీఆర్


శభాష్ అజయ్!


సభావేదికపై సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'శభాష్ అజయ్.. ఆవిర్భావ సభ సక్సెస్ చేశారు. ఖమ్మం చరిత్రలోనే ఇలాంటి సభ ఎన్నడూ జరగలేదు. కమ్యూనిస్టు నాయకులు, మిగతా నేతలు అందరూ సభ అద్భుతంగా జరిగిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా 'ఏమిటీ జనం?' అంటూ ఆశ్చర్యపోయారు..' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్.. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను అభినందించారు. సభావేదిక పైనే కాకుండా సభ ముగించుకుని వెళ్లిన తర్వాత కూడా సీఎం ప్రత్యేకంగా మంత్రికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. హెలికాప్టర్ నుంచి ముఖ్యమంత్రులు దారి పొడవునా ఉన్న జనాన్ని చూసి 'ఇంతమంది జనమా?' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారని కేసీఆర్ చెప్పారు. భవిష్యత్ ఉందంటూ కొనియాడారు. ఖమ్మంలో బీఆర్ఎస్ తొలి సభ ప్రకటన నాటి నుంచి మంత్రి అజయ్ సభను విజయవంతం చేసేందుకు సర్వశక్తులొడ్డారు. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి భారీగా జన సమీకరణకు కసరత్తు చేశారు. అంతేకాకుండా ఒక్క ఖమ్మం నియోజకవర్గం నుంచే వెయ్యి మంది వలంటీర్లను ఏర్పాటు చేసి సభ ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా ముగిసేలా చూశారు.

దేశంలో రాజ్యాంగ సంక్షోభం

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ జాతీయ సంపదను కొల్లగొడుతున్నాయి
- సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా మోదీ పాలన: పినరయి విజయన్
- కేసీఆర్ పోరాటానికి తమ మద్దతు ఉంటుందని వెల్లడి


ప్రసంగిస్తున్న కేరళ సీఎం పినరయి విజయన్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు జాతీయ సంపదను కొల్లగొట్టి, పరిపాలనను అస్తవ్యస్తం చేస్తున్నాయని కేరళ సీఎం పినరయి విజయన్ మండిపడ్డారు. జాతీయ విధానానికి స్వస్తి పలికి ప్రైవేట్ శక్తులను పెంచి పోషిస్తున్నాయని.. దేశంలో రాజ్యాంగ సంక్షోభం నెలకొందని పేర్కొన్నారు. ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సి ఉందని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఏర్పాటుతో భావసారూప్యత కలిగిన పార్టీలు ఒక్కటయ్యే అవకాశం వచ్చిందని.. ఈ సభ జాతికి దిశానిర్దేశం చేస్తుందని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. బుధవారం ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో విజయన్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అద్భుతంగా ఉన్నాయి. సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం అద్భుతంగా ఉంది. కంటి వెలుగు పథకం చరిత్రలో నిలిచిపోతుంది. ఖమ్మంలో బీఆర్ఎస్ సభ నిర్వహించి సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొత్త పోరాటానికి తెరలేపారు. ఆయనకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. దేశ సమగ్రత, హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది

బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. దేశంలో రాజ్యాంగ సంక్షోభం నెలకొంది. రాష్ట్రాల అభిప్రాయాలతో సంబంధం లేకుండా కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా మోదీ పాలన సాగుతోంది. గవర్నర్ల వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది. రాష్ట్రాలకు రావాల్సిన నిధులు ఇవ్వకపోగా.. గవర్నర్ల ద్వారా రాష్ట్రాలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తోంది. చర్చలు జరగకుండానే చట్టసభల్లో బిల్లులను బలవంతంగా పాస్ చేస్తోంది. సంస్కరణల పేరుతో అనైతిక విధానాలను ఆచరిస్తోంది. న్యాయవ్యవస్థలను నాశనం చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియంపై కూడా రాజకీయాలు చేస్తూ రాజ్యాంగ నిబంధనలను హరించివేస్తోంది. దేశ బడ్జెట్‌లో సామాన్యులకు కేటాయించడానికి నిధులు లేవంటూ.. కార్పొరేట్ శక్తులకు మాత్రం దోచిపెడుతోంది. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచి సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఇబ్బంది పెడుతోంది. ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి.

బీజేపీకి సరైన బుద్ధి చెప్పాలి

విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. దేశాన్ని కులం, మతం పేరుతో నిలువునా చీలుస్తోంది. సామ్యవాద, ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్‌ను విభజించేందుకు కుట్ర జరుగుతోంది. దేశ సంస్కృతిని నాశనం చేస్తూ గాంధీజీని హిందూత్వవాదిగా చూపిస్తూ దేశవ్యాప్తంగా హిందూత్వాన్ని అంటగట్టే ప్రయత్నం చేస్తోంది. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగుతోంది. ఒకే దేశం, ఒకే భాష, ఒకే పరిపాలన, ఒకే ఎన్నిక పేరుతో రాష్ట్రాల్లో పాలనను కూల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్వాతంత్య్ర స్ఫూర్తికి విరుద్ధంగా మాతృభాషను చంపే ప్రయత్నంలో భాగంగానే రాష్ట్రాలపై హిందీ భాషను బలవంతంగా రుద్దాలని చూస్తున్న బీజేపీకి సరైన బుద్ధి చెప్పాలి..'' అని పినరయి విజయన్ పిలుపునిచ్చారు.

దేశం మార్పు కోరుతోంది

కేంద్రంలో బీజేపీ సర్కారును తరిమికొట్టాల్సిందే: ఖమ్మం సభలో కేజ్రీవాల్

- గవర్నర్లను అడ్డుపెట్టుకుని రాష్ట్రాలను ఇబ్బందిపెడుతున్నారు
- నిత్యం ఎవరిమీద సీబీఐ, ఈడీ దాడులు చేయించాలని చూస్తుంటే దేశం బాగుపడేదెప్పుడు?
- కంటి వెలుగు అద్భుతం.. ఢిల్లీ, పంజాబ్‌ల్లోనూ అమలు చేస్తామన్న ఢిల్లీ సీఎం


సభలో మాట్లాడుతున్న అరవింద్ కేజ్రీవాల్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: దేశం మార్పు కోరుతోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని తరిమికొట్టాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను గవర్నర్లు ఇబ్బందిపెడుతున్నారని, వారిని ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి ఆడిస్తున్నారని ఆరోపించారు. తాను ఇతర సీఎంలు, నేతలు కలసి రాజకీయాలు మాట్లాడుకోలేదని.. దేశ అభివృద్ధి కోసమే చర్చించామని తెలిపారు. ఖమ్మం సభలో కేజ్రీవాల్ చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

''తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్ గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బంది పెడుతున్నారు.. వారందరికీ ఢిల్లీ నుంచి ఫోన్ వస్తుంది. దానికి అనుగుణంగా గవర్నర్లు రాజకీయాలు చేస్తున్నారు. ఎవరి మీద సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేయించాలి, ఏ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని 24 గంటలూ ఆలోచిస్తుంటే దేశం ఎప్పుడు బాగుపడుతుంది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతుంటే కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి చింత లేదు. ఎవరి ఎమ్మెల్యేలను కొనాలి, ఎవరి ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఆలోచనే తప్ప ఏమీ పట్టడం లేదు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు అయినా మన దేశం ఇంకా పేద దేశంగానే ఉంది. మనకంటే వెనుక స్వాతంత్య్రం వచ్చిన సింగపూర్, జపాన్ వేగంగా అభివృద్ధి చెందాయి.

ఒకరి నుంచి మరొకరు నేర్చుకోవాలి

ఈ రోజు సీఎంలు అందరం కలిసి రాజకీయాలు చర్చించలేదు. దేశాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించాం. పరస్పర ఘర్షణ వైఖరి కాకుండా ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటే దేశం చాలా అభివృద్ధి చెందుతుంది. ఢిల్లీలో మేం చేపట్టిన మొహల్లా క్లినిక్‌లను చూసేందుకు సీఎం కేసీఆర్ గల్లీల్లో తిరుగుతూ.. మా డాక్టర్లు, నర్సులతో మాట్లాడారు. తెలంగాణలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఢిల్లీ ప్రభుత్వ స్కూళ్లలో అభివృద్ధిని చూసి.. ఆ రాష్ట్రంలోనూ చేపట్టి నన్ను ఆహ్వానించారు. ఢిల్లీలో ప్రైవేటు స్కూళ్లు వదిలి ప్రభుత్వ స్కూళ్లలో చేరుతున్నారు. 99.7 శాతం ఫలితాలు వచ్చాయి. కేరళలో స్కూళ్లు, హాస్పిటళ్లు బాగున్నాయి. దేశవ్యాప్తంగా అలా ఎందుకు లేవు?

కేసీఆర్ పెద్దన్నలాంటి వారు

తెలంగాణలో ప్రవేశపెట్టిన కంటి వెలుగు గొప్ప కార్యక్రమం. నాలుగు కోట్ల మంది పేద, ధనిక వర్గాలకు కంటి పరీక్షలు చేసి మందులు, ఆపరేషన్లు, కళ్ల జోళ్లు ఉచితంగా అందించటం అభినందనీయం. తెలంగాణ నుంచి చాలా నేర్చుకున్నా.. కంటి వెలుగు కార్యక్రమాన్ని ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లోనూ అమలు చేస్తాం. సమీకృత కలెక్టరేట్ల కాన్సెప్ట్ అద్భుతం. కేసీఆర్ ఈ విషయంలో పెద్దన్నలాంటి వారు. తెలంగాణలో చేపట్టిన మంచి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు..'' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

కేసీఆర్‌తో కలిసి | కేంద్రంలో సర్కార్ ఏర్పాటు

- యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ధీమా
- బీజేపీ.. బ్రహ్మజన్ పార్టీ అని విమర్శలు
- పని తక్కువ.. ప్రచారం ఎక్కువ అని ధ్వజం


మాట్లాడుతున్న అఖిలేశ్‌యాదవ్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇంకా 400 రోజులే మిగిలి ఉన్నాయి. రోజులు లెక్కపెడుతోందంటే ఆ ప్రభుత్వం ఇక ఉండదని అర్థమవుతోంది. బీజేపీ బ్రహ్మజన్ పార్టీ. పని తక్కువ.. ప్రచారం ఎక్కువ' అని యూపీ మాజీ సీఎం సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం పని ఎక్కువ చేసి.. తక్కువ ప్రచారం చేసుకుంటోందన్నారు. కేంద్రంలో కేసీఆర్‌తో కలిసి కొత్త సర్కార్ ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. బుధవారం ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ సభలో ఆయన ప్రసంగించారు. 'బీజేపీ ప్రభుత్వం దేశంలోని విపక్ష ప్రభుత్వాలన్నింటినీ ఇబ్బందిపెడుతోంది. ఇక్కడ బీఆర్ఎస్ సర్కార్‌ను కూడా ఇబ్బందుల పాలుచేస్తోంది. నాయకులను ఆందోళనకు గురిచేస్తూ కుట్రలకు పాల్పడుతూ ఒత్తిడికి గురిచేస్తోంది. న్యాయవ్యవస్థలు, దర్యాప్తు సంస్థలను నిర్వీర్యం చేస్తోంది. ఖమ్మం బహిరంగ సభ దేశానికి దిశానిర్దేశం చూపుతుంది. తెలంగాణ ప్రజలు ఉద్యమాలతో చరిత్ర సృష్టించారు. దేశ యువత నిరుద్యోగంతో ఇబ్బందులుపడుతుండగా, రైతులు నష్టాల పాలవుతున్నారు. గుజరాత్ నుంచి యూపీకి వచ్చి ప్రధానమంత్రి అయిన మోదీ.. యూపీకి ఏమీ చేయలేదు. ఇక్కడి ప్రజలను మోసం చేశారు. గంగానది ప్రక్షాళన ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. తెలంగాణలో బీజేపీని తరిమికొట్టండి. యూపీలో కూడా ఆ పార్టీని వెళ్లగొడతాం. సీఎం కేసీఆర్ అమలుచేసే ఇంటింటికీ తాగునీరు, పంటలకు సాగునీరు వంటి మంచి పథకాలను కేంద్రం కాపీ కొడుతోంది. బీజేపీ చెప్పింది చేయకపోగా అభివృద్ధిని వెనకకు తీసుకెళ్తోంది. దేశాన్ని బీజేపీ నుంచి రక్షించే కొత్త ప్రభుత్వం కోసం మేమంతా కలిసి పనిచేస్తాం. సీఎం కేసీఆర్.. భగవాన్ విష్ణు నర్సింహస్వామి ఆలయా (యాదాద్రి)న్ని అద్భుతంగా నిర్మించారు. ఖమ్మం బహిరంగ సభలో ఎక్కడ చూసినా జనమే కనిపిస్తున్నారు. తెలంగాణలో ఎక్కడ చూసినా కేసీఆర్‌కు బ్రహ్మరథం పడుతున్నారు' అని అఖిలేశ్ యాదవ్ చెప్పారు.

2024లో బీజేపీని ఓడించాలి

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపు

- మోదీ వెనుక అంబానీ, అదానీ ఉండి నడిపిస్తున్నారు
- రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్, తాగునీరు ఇస్తున్నారంటూ కేసీఆర్‌కు కితాబు


సభలో ప్రసంగిస్తున్న డి.రాజా

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: బీజేపీ, ఆర్ఎస్ఎస్ రెండూ కలిసి భారత రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపడ్డారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభలో ఆయన ప్రసంగించారు. 'తెలంగాణ సాయుధ పోరాట యోధులకు నివాళులర్పిస్తున్నా.. తెలంగాణలో సుపరిపాలన అందుతోంది. సీఎం కేసీఆర్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్, తాగునీరు అందుతున్నాయి. రైతుబంధు, దళితబంధు పథకాలు దేశానికే ఆదర్శం. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి దేశ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి. మోదీ వెనుక అంబానీ, అదానీ ఉండి నడిపిస్తున్నారు. రిపబ్లిక్ దేశంగా ఉన్న దేశాన్ని మార్చి ఒకే మతం, ఒకే పన్ను, ఒకే ఎన్నిక పేరుతో విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. భారత్‌ను హిందూ దేశంగా మార్చి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారు. మోదీ పేదలు, రైతుల పక్షాన లేకుండా.. అదానీ, అంబానీ, టాటా బిర్లాల జపం చేస్తున్నారు. బీజేపీ గవర్నర్ వ్యవస్థను చేతిలో పెట్టుకొని కేరళ, తమిళనాడు, తెలంగాణ, పంజాబ్‌ను ఇబ్బంది పెడుతోంది. 2024లో అందరు కలిసి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా ఐక్య పోరాటాలు చేయాలి. ఐక్య పోరాటాలకు ఖమ్మం సభ నాంది కావాలి. బీజేపీని ఓడించడమే అందరి ముందున్న కర్తవ్యం' అని డి.రాజా చెప్పారు.

బీజేపీ దేశాన్ని అమ్మేస్తోంది

ఖమ్మం సభలో పంజాబ్ సీఎం భగవంత్‌మాన్



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని, నిత్యావసర వస్తువులు సామాన్యులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ భారతీయ అబద్ధాల పార్టీగా మారిపోయిందని పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ విమర్శించారు. గుట్టలు, నదులు, ఫ్యాక్టరీలు, ఎయిర్‌పోర్ట్‌లు, రైల్వే, ఎల్ఐసీ ఇలా దేశం మొత్తాన్ని బీజేపీ ప్రభుత్వం అమ్మేస్తోందని మండిపడ్డారు. ఖమ్మం సభలో భగవంత్‌మాన్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''మోదీ ప్రధాని అయినప్పటి నుంచీ కూడా ఎర్రకోట మీద పంద్రాగస్టు ప్రసంగంలో నిరుద్యోగం, ఉగ్రవాదంపై చింతిస్తున్నానని చెప్తూనే ఉన్నారు. ఇంకా ఎప్పుడు పరిష్కరిస్తారు? ఇప్పటికైనా ప్రధాని ప్రసంగాన్ని మార్చాలి. నేను దేశాన్ని ప్రేమిస్తాను. బొకేలో రంగురంగుల పూలు ఉన్నట్టే.. దేశం రంగు రంగుల పూల సమాహారం. కానీ ఒకే పువ్వు ఉండాలని కొందరు చూస్తున్నారు. బీజేపీ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. రాష్ట్రాల్లో బీజేపీ గెలవదు. ఆ పార్టీది లోక్‌తంత్ర కాదు.. లూటీ తంత్రం. మీడియాను గుప్పిట్లో పెట్టుకుని అన్నీ తమ కోసమే అన్నట్టు వ్యవహరిస్తోంది.

పంజాబ్‌లో కంటి వెలుగు

ఢిల్లీ తరహాలోనే పంజాబ్‌లో మొహల్లా క్లినిక్‌లు పెట్టాం. కంటి వెలుగు పథకం బాగుంది. ఇంత పెద్ద సభకు వచ్చిన జనాన్ని చూసేందుకు పెద్ద కళ్లజోడు అద్దాలు ఉంటే ఇంకా బాగా చూసి ఆనందించేవాడిని. ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని పంజాబ్‌లో చేపడతాం. ఎమ్మెల్యేలను తక్కువ ధరకు అమ్మే పార్టీగా కాంగ్రెస్ మారిపోయింది. గతంలో ఢిల్లీ స్కూళ్ల గురించి బీజేపీ సర్కార్ విమర్శలు చేసింది. ఆ తర్వాత ట్రంప్ సతీమణి మన దేశంలో స్కూళ్లను చూడాలనుకుంటే.. కేజ్రీవాల్ అభివృద్ధి చేసిన స్కూళ్లనే కేంద్రం చూపించింది. దేశం కోసం బ్రిటీష్ వాళ్లతో పోరాడి ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ గుర్తుగా ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం నినదించాలి. తెలంగాణ కోసం పోరాడి సాధించుకున్న కేసీఆర్‌కు అభినందనలు..'' అని భగవంత్‌మాన్ పేర్కొన్నారు.

నరసింహుడి సేవలో సీఎంలు

- యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లిన వీఐపీలు
- పూర్ణ కుంభంతో ఘనస్వాగతం.. గర్భాలయంలో లక్ష పుష్పార్చన
- ప్రెసిడెన్షియల్ సూట్‌లోనే ఉండిపోయిన వామపక్షాల నేతలు

సాక్షి, యాదాద్రి: ఇద్దరు సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్, ఇతర వీఐపీలు బుధవారం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. వారంతా సీఎం కేసీఆర్‌తో కలసి ఉదయం 11.11 గంటలకు హైదరాబాద్ నుంచి రెండు హెలికాప్టర్లలో యాదగిరిగుట్టకు చేరుకున్నారు. సీఎంలు, నేతలకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తూర్పున ఉన్న త్రితల రాజగోపురం నుంచి ఆలయంలోకి ప్రవేశించిన వారు.. తొలుత క్షేత్ర పాలకుడు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభ ప్రదక్షిణ చేసి గర్భాలయంలో స్వయంభూ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపంలో వారందరికీ వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ముఖ్య అతిథులకు దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నర్సింహమూర్తి కలసి శ్రీస్వామివారి విగ్రహాలు, చిత్రపటాలను అందించి, శాలువాతో సత్కరించారు. అద్దాల మండపంలో దేవస్థానం అధికారులు, ఆచార్యులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తర్వాత కొండపై ఉన్న శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామిని సీఎంలు, నేతలు దర్శించుకున్నారు. స్ఫటిక లింగానికి అభిషేకం చేశారు.



ఆలయ విశిష్టతను కేజ్రీవాల్, అఖిలేశ్ యాదవ్, భగవంత్‌సింగ్ మాన్‌లకు వివరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఆలయ విశిష్టతను వివరించిన సీఎం కేసీఆర్: దర్శనం అనంతరం యాదాద్రి స్థల పురాణం, క్షేత్ర ప్రాశస్త్యం, నూతనంగా నిర్మించిన ఆలయ రీతులను సీఎంలు, జాతీయ నాయకులకు సీఎం కేసీఆర్ వివరించారు. యాదాద్రి పాత ఆలయం, పునఃనిర్మాణం తర్వాత తీసిన ఫొటోలతో కూడిన గ్యాలరీని చూపించారు. ఈ సందర్భంగా ఆలయం అద్భుతమని సీఎంలు, ఇతర నేతలు కొనియాడారు. ఆలయ విజిటర్స్ బుక్ లో తమ అభిప్రాయాలను నమోదు చేశారు.

రెండు హెలికాప్టర్లలో..
హైదరాబాద్ నుంచి రెండు హెలికాప్టర్లలో సీఎంలు, మంత్రులు, నాయకులు యాదాద్రికి వచ్చారు. సీఎం కేసీఆర్ వచ్చిన చాపర్‌లో కేరళ సీఎం పినరయి విజయన్ ఉండగా, రెండో చాపర్‌లో ఢిల్లీ, పంజాబ్ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌మాన్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఉన్నారు. యాదాద్రి మార్గంలో ఉన్న నృసింహసాగర్ (బస్వాపూర్ ప్రాజెక్టు)ను సీఎంలకు, నాయకులకు చూపించారు.

దర్శనానికి దూరంగా కేరళ సీఎం

సీఎం కేసీఆర్‌తోపాటు యాదాద్రికి హెలికాప్టర్‌లో వచ్చిన కేరళ సీఎం పినరయి విజయన్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఆలయానికి వెళ్లలేదు. ఇద్దరూ ప్రెసిడెన్షియల్ సూట్‌లోనే ఉండిపోయారు. కేసీఆర్, ఇతర నేతలు నరసింహుడిని దర్శించుకున్న అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి అంతా కలసి హెలికాప్టర్లలో ఖమ్మం వెళ్లారు.



బీజేపీపై విమర్శలు.. ‘కూటమి’ సంకేతాలు

ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభ సాగిన తీరు

- విపక్షాలు ఏకం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిన కేసీఆర్
- బీజేపీ, ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని ప్రసంగం
- తెలంగాణ మోడల్‌కు విస్తృత ప్రచారం కల్పించే ప్రయత్నం

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి ఆవిర్భావం తర్వాత ఖమ్మం వేదికగా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన బుధవారం జరిగిన బహిరంగ సభ.. కేంద్రంలోని అధికార బీజేపీ లక్ష్యంగా సాగింది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పనితీరును ‘మూర్ఖుల అసమర్థ పాలన’గా పేర్కొన్న కేసీఆర్, విపక్షాలు ఏకం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మోదీ ప్రభుత్వం తప్పులను ‘విపక్షాల ప్రభుత్వం’ సరిదిద్దుతుందని ప్రకటించడం ద్వారా రాబోయే రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటులో తాను కీలకపాత్ర పోషిస్తాననే విషయం స్పష్టం చేశారు. సీపీఎం, సీపీఐ వంటి క్రియాశీల, ప్రగతిశీల పార్టీలతో దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ కలిసి పనిచేస్తుందనడం ద్వారా ‘ప్రత్యామ్నాయ కూటమి’ దిశగా కసరత్తు జరుగుతోందనే సంకేతాలు ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్సేతర పార్టీలను కలుపుకొని ముందుకు వెళ్లాలనే కేసీఆర్ ప్రతిపాదనకు సభకు హాజరైన ముఖ్యమంత్రులు, ఇతర పార్టీల నేతలు సానుకూలంగా స్పందించారు. బీఆర్‌ఎస్ జాతీయ పాలసీ, విధానాలపై ఇప్పటివరకు కసరత్తు జరుగుతోందని చెప్తూ వచ్చిన కేసీఆర్.. ఖమ్మం సభలో పలు అంశాలను



ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించిన కేసీఆర్, బీఆర్‌ఎస్ జాతీయ పాలసీని స్థూలంగా వివరించారు. బీఆర్‌ఎస్ జాతీయ విధానంపై కసరత్తు జరుగుతోందని చెప్తూనే వివిధ రంగాల్లో బీఆర్‌ఎస్ చేపట్టనున్న సంస్కరణలను వివరించారు. మరోవైపు తెలంగాణ మోడల్‌ను దేశానికి పరిచయం చేస్తామనే విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు.

తెలంగాణ మోడల్ పరిచయం...
రెండు రోజులుగా తెలంగాణ పర్యటనలో ఉన్న ముగ్గురు ముఖ్యమంత్రులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పాలన విధానాలు, ప్రభుత్వ పథకాలను పరిచయం చేసేందుకు కేసీఆర్ ప్రాధాన్యతనిచ్చారు. యాదాద్రి పర్యటన ద్వారా సీఎంలు.. హిందుత్వం బీజేపీ సొత్తు కాదని చాటిచెప్పే ప్రయత్నం చేశారు. ఖమ్మం కలెక్టరేట్ సముదాయం, కంటి వెలుగు రెండో విడత ప్రారంభ కార్యక్రమాల్లో ముగ్గురు సీఎంలను భాగస్వాములను చేయడం ద్వారా తెలంగాణ మోడల్‌కు విస్తృత ప్రచారం కల్పించే ప్రయత్నం చేశారు.

కేంద్రం విధానాల వల్లే బీఆర్‌ఎస్‌కు దగ్గర
నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలను ప్రశ్నిస్తున్నందునే తాము బీఆర్‌ఎస్‌కు దగ్గరవుతున్నట్లు ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలు చెప్పారు. ఖమ్మం సభకు హాజరైన ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, భగవంత్ మాన్, పినరయి విజయన్‌తో పాటు యూపీ మాజీ సీఎం అఖిలేశ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా.. బీజేపీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. గవర్నర్ల వ్యవస్థను బీజేపీ దుర్వినియోగం చేస్తున్న తీరును ఎండగట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను ఎమ్మెల్యేల కొనుగోలు ద్వారా కూలదోస్తోందంటూ.. ఢిల్లీ, తెలంగాణ ఉదంతాలను ప్రస్తావించారు.

దేశ వ్యాప్తంగా విపక్ష ఐక్యతా సభలు

తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తిలో భారీ బహిరంగ సభల నిర్వహణను ఒక వ్యూహంగా అమలు చేసిన కేసీఆర్.. బీఆర్‌ఎస్ విస్తరణలోనూ అదే తరహా కార్యాచరణ ఉండాలనే భావనతో ఉన్నట్లు ఖమ్మం సభ ద్వారా తేటతెల్లమైంది. ఖమ్మం నూతన కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజనం తర్వాత ముగ్గురు ముఖ్యమంత్రులతో పాటు అఖిలేశ్‌తో జరిగిన భేటీలో.. ఆయా రాష్ట్రాల్లో విపక్ష ఐక్యతా సభల పేరిట భారీ బహిరంగ సభల నిర్వహణపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆప్, కమ్యూనిస్టు పార్టీలు, సమాజ్‌వాదీ పార్టీలు నిర్వహించే బహిరంగ సభల్లో తమ భాగస్వామ్యం ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. బీఆర్‌ఎస్, ఆప్, సమాజ్‌వాదీ, ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పాటు ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటులో కలిసి వచ్చే పార్టీలు, శక్తులపై ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం. కూటమి ఏర్పాటుపై తొందరపాటు ప్రకటన చేయకుండా, బీజేపీ వైఫల్యాలను ఉమ్మడిగా ఎండగట్టడంపైనే ప్రస్తుతానికి దృష్టి కేంద్రీకరించాలనే అభిప్రాయం ఈ భేటీలో వ్యక్తమైనట్లు తెలిసింది. త్వరలో ఏపీలో కూడా బహిరంగ సభ నిర్వహించే యోచనలో ఉన్న కేసీఆర్ ఆ తర్వాత ఉత్తరాది రాష్ట్రాల్లో కలిసి వచ్చే పార్టీలతో కలిసి భారీ సభలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ కీలక నేతకు రూ.500 కోట్ల ఆఫర్

కర్ణాటకలో కాంగ్రెస్ ఓటమికి కేసీఆర్ కుట్ర

- ఫామ్‌హౌస్‌లో బేరసారాలు.. ఆధారాలతో సహా నిరూపిస్తాం
- మోదీతో వైరం ఉన్నట్లు నమ్మించే యత్నాలు
- ఫిబ్రవరి చివరలో కేసీఆర్ అసెంబ్లీని రద్దు చేసినా చేస్తారు
- మీడియా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కర్ణాటక కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కీలక నేతను లొంగదీసుకునేందుకు రూ. 500 కోట్లు ఆఫర్ చేశారన్నారు. బుధవారం సాయంత్రం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ 130 సీట్లు గెలుస్తుందని, బళ్లారి నుంచి రాయచూరు వరకు 25–30 స్థానాల్లో స్వల్ప తేడాతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని నివేదికలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఆ 30 సీట్లలో కాంగ్రెస్ పార్టీ పరాజయం కోసం పనిచేయాలని కర్ణాటకకు చెందిన ఓ కీలక నేతకు కేసీఆర్ రూ.500 కోట్లు ఆఫర్ ఇచ్చింది నిజం కాదా? ఆయనతో ఫామ్ హౌస్‌లో బేరసారాలు సాగించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఇది ఆరోపణ కాదని, ఆధారాలతో సహా నిరూపించేందుకు సిద్ధమని చెప్పారు.

కర్ణాటకలో తెలంగాణ ఇంటెలిజెన్స్ వర్గాలు
ప్రభాకర్ రావు నేతృత్వంలో పనిచేస్తున్న ఇంటెలిజెన్స్ అధికారులను కర్ణాటక రాష్ట్రంలో నియమించారని, వారి నుంచి కాంగ్రెస్ మద్దతుదారులు, ఓటు వేసే వాళ్ల వివరాలను సేకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నీ తెలిసే జేడీఎస్ నేత కుమార స్వామి ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ సమావేశానికి రాలేదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను ఓడించేందుకు కేసీఆర్ ఎవరి దగ్గర సుపారీ తీసుకున్నారో ప్రజలకు తెలియాలన్నారు.

మోదీతో వైరం ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం ఇది..
ఖమ్మంలో కేసీఆర్ ఉపన్యాసం వింటే మోదీతో వైరం ఉందని నమ్మించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీగా నమోదైన తర్వాతనే జరిగిన గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు ప్రచారం చేయలేదని, యూపీ ఉప ఎన్నికలు, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ ఎందుకు ప్రచారం చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వ్యూహాత్మకంగానే డిసెంబర్‌లో జరపాల్సిన శీతాకాల సమావేశాలు జరపలేదని, ఫిబ్రవరి చివరిలో ప్రభుత్వాన్ని రద్దు చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని వ్యాఖ్యానించారు.

రూ. 100 లక్షల కోట్లు అప్పు చేసిన మోదీతో కాంగ్రెస్‌ను పోలుస్తారా?
1947 నుంచి 2014 వరకు దేశాన్ని పాలించిన ప్రధానులందరు రూ.56 లక్షల కోట్ల అప్పులు చేస్తే... ఎనిమిదేళ్లలో ప్రధాని మోదీ రూ.100 లక్షల కోట్లు అప్పు చేశారని రేవంత్ ఆరోపించారు. అలాంటి మోదీతో కాంగ్రెస్‌ను పోల్చడం కేసీఆర్ దుర్మార్గానికి పరాకాష్టగా అభివర్ణించారు. ప్రభుత్వ సంస్థలను అమ్ముకుంటున్న మోదీకి పార్లమెంట్‌లో మద్దతు ఇచ్చింది కేసీఆరేనని అన్నారు. మన దేశం చైనా మార్కెట్ అయిందంటున్న కేసీఆర్.. సెక్రటేరియట్ దగ్గర ఏర్పాటు చేయబోయే అంబేడ్కర్ విగ్రహం కోసం మంత్రుల బృందం చైనా వెళ్లిన విషయమై ఏం సమాధానం చెపుతారని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

మేధావులు.. మౌనం వీడాలి

యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్



డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లుతో యూపీ మాజీ సీఎం అఖిలేశ్

సాక్షి,హైదరాబాద్: దేశంలోని మేధావులంతా మౌనం వీడి లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జనంలోకి రావాలని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు బుధవారం అఖిలేశ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అఖిలేశ్ మాట్లాడుతూ..చైతన్యవంతమైన తెలంగాణ నుంచే దేశానికి దిశానిర్దేశనం చేసేలా మేధావుల పాత్ర ఉండాలని, ఈ దిశగా కార్యాచరణ సిద్ధం చేయాలని అఖిలేశ్ వర్రె వెంకటేశ్వర్లుకు సూచించారు.

వార్ రూమ్ కేసులో ప్రధాన నిందితుడిగా మల్లు రవి

- జరిగిన దర్యాప్తు.. వెలుగులోకి వచ్చిన అంశాలతో నిర్ణయం
- వార్‌రూమ్‌కు తానే ఇన్‌చార్జ్ అని స్పష్టం చేసిన మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్ కేసులో ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవి ప్రధాన నిందితుడిగా మారనున్నారు. ఇప్పటివరకు జరిగిన విచారణ, నిందితుల విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి అభియోగపత్రాలు దాఖలు చేసే సమయంలో ఇదే అంశాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లనున్నారు. మరోపక్క ఈ కేసులో నోటీసులు అందుకున్న మల్లు రవి బుధవారం విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మల్లు రవిని దాదాపు రెండు గంటలపాటు విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని స్పష్టం చేసి పంపారు. వార్‌రూమ్ ఎపిసోడ్ మొదలైన నాటి నుంచి మల్లు రవి తెరపైకి వస్తున్నారు. వార్‌రూమ్‌పై దాడి, సోదాలు జరిగిన సమయంలోనూ అక్కడే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలుకు సైబర్ క్రైమ్ పోలీసులు నోటీసులు జారీ చేసినప్పుడూ రవి స్పందించారు. వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా ఉన్న తన నుంచి ముందు వాంగ్మూలం నమోదు చేయమంటూ పోలీసులకు లేఖ రాశారు. సునీల్ కనుగోలు విచారణ తర్వాత కేసులో మల్లు రవిని నిందితుడిగా చేర్చిన అధికారులు, ఈ నెల 12న విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. సంక్రాంతి పండుగ తర్వాత వస్తానంటూ సమయం కోరిన మల్లు రవి బుధవారం విచారణకు హాజరయ్యారు. తానే వార్‌రూమ్ ఇన్‌చార్జ్ అంటూ అంగీకరించిన ఆయన, అక్కడి వాళ్లు పోస్టు చేసే ప్రతి అంశంతోనూ తనకు సంబంధం ఉండదని పేర్కొన్నారని తెలిసింది. తాము కేవలం కాన్సెప్ట్ మాత్రమే చెప్తామని, అక్కడి వాళ్లు దానికి అనుగుణంగా వీడియోలు, మీమ్స్ తయారు చేసి పోస్టు చేస్తారని వివరణ ఇచ్చారని సమాచారం. విచారణకు వెళ్లే ముందు మీడియాతో మాట్లాడిన రవి పోలీసులు ఏ అంశంపై విచారణ చేస్తారనే సమాచారం తనకు తెలియదని, వారు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చి సహకరిస్తానని అన్నారు. వార్ రూమ్ నుంచి మా పార్టీకి సంబంధించి విలువైన సమాచారాన్ని పోలీసులు తీసుకొచ్చారని ఆరోపించారు. పోలీసుల విచారణ ముగిసిన తరవాత ఆ సమాచారం తిరిగి ఇవ్వాలని కోరతానన్నారు. రెండు గంటలపాటు విచారణ ముగిసిన తర్వాత తిరిగి వచ్చిన ఆయన మరోసారి మీడియాతో మాట్లాడారు. అవసరమైతే పోలీసులు మళ్లీ విచారణకు పిలుస్తామని చెప్పారని, వార్ రూమ్‌లో జరుగుతున్న వ్యవహారాలన్నింటికి తానే ఇన్‌చార్జ్ అని పునరుద్ఘాటించారు. అక్కడి నుంచి పోస్ట్ అవుతున్న వీడియోలకు తానే బాధ్యుడినని అంగీకరించారు. ఆ పోస్టుల్లో తప్పు లేదని, సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలోనే చేస్తున్నామే తప్ప ఎవరినీ కించపరచాలన్న ఉద్దేశం లేదన్నారు. సునీల్ కనుగోలుకు తమ వార్ రూమ్‌తో ఎలాంటి సంబంధం లేదని తన వాంగ్మూలంలో స్పష్టం చేసినట్లు మల్లు రవి పేర్కొన్నారు.





ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 27 వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో నందమూరి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. బుధవారం ఉదయం ఎన్టీఆర్ ఘాట్‌కు విచ్చేసిన నారా భువనేశ్వరి, నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, సుహాసిని, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ తదితరులు ఎన్టీఆర్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ కుమారుడిగా పుట్టడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.
ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో...: తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ సజీవంగా ఉంటారని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, మెగా వైద్య శిబిరంతో పాటుగా బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి సంచార క్యాన్సర్ నిర్ధారణ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాట్రగడ్డ ప్రసూన, టీటీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, బీసీసెల్ అధ్యక్షుడు శ్రీపతి సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ మోడల్‌తో మిషన్–90!

▶ మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి గురించి వివరించి, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా పాజిటివ్ ఓటుబ్యాంక్‌ను సాధించాలని సూచించింది. జాతీయ కార్యవర్గ భేటీ దిశానిర్దేశం నేపథ్యంలో ఈ నెల 24న మహబూబ్‌నగర్‌లో జరగనున్న పార్టీ కార్యవర్గసమావేశంలో కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నారు. మంగళవారం ఢిల్లీలో ముగిసిన జాతీయ కార్యవర్గభేటీలో ఈ ఏడాది 9 రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై అధినాయకత్వం ఆయా రాష్ట్ర పార్టీలకు దిశానిర్దేశం చేసింది. కర్ణాటక, మధ్యప్రదేశ్‌లో అధికారాన్ని నిలబెట్టుకోవడంతోపాటు తెలంగాణలోఎట్టిపరిస్థితుల్లోనూ అధికారంలోకి రావడం , కాంగ్రెస్‌పాలిత రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లను చేజిక్కించుకోవడం, నాలుగు ఈశాన్యరాష్ట్రాల్లో విజయపరంపరను కొనసాగించాలనే సందేశాన్నిచ్చింది. ఈ ఏడాది జరిగే అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు బాటలు వేస్తుందని స్పష్టంచేసింది. కాగా, రెండురోజుల భేటీలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్ర సాగించిన తీరును వివరించారు. కేసీఆర్ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలపై తాము సాగిస్తున్న పోరాటాన్ని, బీఆర్‌ఎస్‌ను ఎండగడుతున్న తీరు గురించి తెలియజేశారు. మంగళవారం వివిధ తీర్మానాలపై మాట్లాడే అవకాశం తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకరరెడ్డి, ఈటల రాజేందర్, డా.జి.వివేక్ వెంకటస్వామికి లభించడంతో ఈ భేటీలో తెలంగాణ నేతలకు సముచితస్థానం లభించినట్టుగా చెబుతున్నారు.

20 నుంచి ఫిబ్రవరి 5 వరకు వీధి సభలు

ఈ నెల 28న బీజేపీ అగ్రనేత, కేంద్రహోం మంత్రి అమిత్‌షా రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ లోక్‌సభతోపాటు మరో ఎంపీ నియోజకవర్గ పరిధిలో ఆయన పర్యటించనున్నట్టు సమాచారం. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల పరిధిలో పార్టీపరంగా జరుగుతున్న కార్యక్రమాలు, బూత్ కమిటీలతోపాటు ఇతర కమిటీల నియామకం తదితర అంశాలను సమీక్షించే అవకాశాలున్నాయి. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 5 వరకు గ్రామస్థాయిలో పది వేల వీధి సభలు, ఫిబ్రవరి 5 నుంచి 20 దాకా పదివేల శక్తికేంద్రాల్లో (3, 4 పోలింగ్‌బూత్‌లు కలిపి ఓ శక్తికేంద్రం) సమావేశాలు, ఫిబ్రవరి 15 నుంచి మార్చి 5 వరకు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో సభలు నిర్వహించనున్నారు. ఏప్రిల్‌లో నిర్వహించే బహిరంగ సభలో కేసీఆర్ సర్కార్‌పై అమిత్ షా లేదా జేపీ నడ్డా ద్వారా చార్జిషీట్ విడుదల చేయించేలా వ్యూహరచన చేస్తున్నారు.

రాష్ట్రంలో దోచింది చాలక దేశంపై పడ్డారు

సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధ్వజం

- దేశాన్ని, సైనికులను అవమానపరిచేలా కేసీఆర్ వ్యాఖ్యలంటూ ఫైర్
- దేశాన్ని పాకిస్తాన్, చైనాలతో పోల్చడం అలవాటుగా మారిందని విమర్శలు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో భూములు, ఇసుక, గ్రానైట్, లిక్కర్, సున్నపురాయి సహా తెలంగాణ సంపదనంతా దోచుకున్న కల్వకుంట్ల కుటుంబం అది చాలక ఇప్పుడు దేశంపై పడిందంటూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబంపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ‘తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కల్వకుంట్ల కుటుంబం ఖూనీ చేసింది. ప్రజలను బానిసలుగా చేసుకుంది. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. విచ్చలవిడి దోపిడీ చేస్తోంది. తెలంగాణను దోచుకున్న దోపిడీదారులు ఇప్పుడు నీతులు చెబుతున్నారు’ అంటూ మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఖమ్మం సభలో ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. మేకిన్ ఇండియాను జోకిన్ ఇండియా అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. కేవలం ప్రధాని మోదీని తిట్టేందుకు ఖమ్మం సభ పెట్టారన్నారు. సభలో మాట్లాడిన నేతలెవరూ బీఆర్‌ఎస్ గురించి మాట్లాడలేదని, కేవలం తమ భవిష్యత్ అంధకారంలో పడుతోందన్న ఆందోళనతోనే మాట్లాడారని చెప్పారు.

దేశాన్ని అవమానించొద్దు...
ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ‘రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీపై రాజకీయ విమర్శలు చేయండి. అంతే తప్పించి దేశాన్ని, దేశ సైనికులను, సమగ్రతను అవమానపరిచేలా మాట్లాడటం సరికాదు. దేశాన్ని పాకిస్తాన్, చైనా, శ్రీలంకలతో పోల్చడం కల్వకుంట్ల కుటుంబానికి అలవాటుగా మారింది. ఈ ధోరణిని మార్చుకోవాలి’ అని కిషన్‌రెడ్డి సూచించారు. ప్రధాని మోదీ హయాంలో తెలంగాణ సహా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రా ల్లో పరిశ్రమలు వచ్చాయని, వాణిజ్యం, సేవల రంగంలో అద్భు త పురోగతి సాధించిందని తెలిపారు. జల వివాదాలను కేంద్రం పరిష్కరించలేదంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ‘వివాదాల పరిష్కారం కోసం సమావేశాలు పెడితే చర్చలకు రారు. సమస్య పరిష్కారం కావాలన్న చిత్తశుద్ధి ఉండదు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుంటే పరిష్కారం కాదా?’ అని ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఎయిరిండియా నష్టాల్లో కూరుకుపోయిందని, అప్పుడు ఉద్యోగులు భయంతో బతుకగా, ఇప్పుడే సంస్థ ఉద్యోగులు గుండెల మీద చేయి వేసుకొని నిద్రపోతున్నారని తెలిపారు.

రాష్ట్రం దివాలా..ఆర్థిక పరిస్థితి అధోగతి..
ఇక తెలంగాణలో ప్రస్తుతం ఒకటో తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రం దివాలా తీసిందని, ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు దళితబంధు, గిరిజనబంధులు, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదు కానీ మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయన్నారు. రెండేళ్లలో వెలుగు జిలుగుల భారతం చేస్తామన్న మాటలపై స్పందిస్తూ, రాష్ట్రంలో కేసీఆర్ ఫాంహౌజ్‌లో తప్ప ఎక్కడా వెలుగులు లేవని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.





మంచి ఆలోచన, మంచి మాట, మంచి పని...
ఈ మూడింటి నుంచి నువ్వు ఎప్పటికీ వైదొలగకు!
– జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, జనవరి, 19

తలబొప్పి పలికించిన తత్త్వం

తలబొప్పి కడితే కానీ తత్త్వం బోధపడదంటే ఇదే. పాలు పోసి పెంచిన తీవ్రవాద సర్పం తన మెడకే చుట్టుకొంటూ, అస్తవ్యస్త విధానాలతో ఆర్థికంగా నట్టేట మునిగాక పాకిస్తాన్ తెలివి తెచ్చుకుంటున్నట్టుంది. నిరుడు పగ్గాలు పట్టిన ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నోట హఠాత్తుగా ఊడిపడ్డ భారత్‌తో శాంతి చర్చల మాట చూస్తే అలాగే అనిపిస్తోంది. రెండురోజుల పర్యటనకు వెళ్ళిన ఆయన దుబాయ్ వార్తాఛానల్ 'అల్ అరేబియా'తో సోమవారం మాట్లాడుతూ భారత్‌తో మూడు యుద్ధాలతో గుణపాఠాలు నేర్చామనీ, నిజాయతీగా శాంతి చర్చలు జరపాలనీ, ఉభయులకూ మిత్రదేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్యవర్తిగా వ్యవహరించాలనీ అన్నారు. కానీ, ఆ మర్నాడే పాక్ ప్రధాని కార్యాలయం హడావిడిగా వివరణనిచ్చింది. కశ్మీర్‌లో 'చట్టవిరుద్ధ చర్యల'పై భారత్ వెనక్కి తగ్గితేనే చర్చలంటూ మెలికపెట్టింది. తప్పంతా తమదేనని అనిపించుకోవడం ఇష్టం లేని శక్తిమంతమైన సైనిక వర్గాలు ఒత్తిడి తేవడంతో పాక్ పాలకులు అలా స్వరం సవరించుకోవాల్సి వచ్చింది. కానీ అసలంటూ చర్చల ప్రస్తావన రావడం విశేషమే.

భారత్‌తో శాంతి నెలకొంటేనే పాక్ ఆర్థికవ్యవస్థకు లాభమని షెహబాజ్, ఆయన సోదరుడైన మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌లు తరచూ చెబుతుంటారు. కానీ, భారత్‌తో చేసిన మూడు యుద్ధాలతో బుద్ధి వచ్చిందనీ, వాటి వల్ల కష్టాలు, కన్నీళ్ళు, నిరుద్యోగం, పేదరికమే దక్కాయనీ ఒక పాకిస్తానీ పాలకుడు అనడం ఇదే తొలిసారి. అందుకే, షెహబాజ్ తాజా మాటలు తరచూ చేసే శుష్క ప్రకటనల కన్నా భిన్నమైనవి, ప్రాధాన్యమున్నవి. అందులోనూ ఆర్థిక కష్టాల్లో 300 కోట్ల డాలర్ల మేర భుజం కాస్తున్న 'సోదర' దేశం యూఏఈని శాంతిసంధాతగా రమ్మనడమూ కీలకమే. నిజానికి, దాయాదుల మధ్య తెర వెనుక చర్చల ప్రక్రియకు మధ్యవర్తి పాత్ర తమ దేశమే పోషించిందని యూఏఈ ఉన్నత దౌత్యాధికారి 2021లో బయటపెట్టారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ మద్దతునిచ్చాయన్నారు. మళ్ళీ ఆ సోదర దేశాన్నే పాక్ సాయం కోరింది.

నిజాయతీ ఎంత ఉందో కానీ, ఇన్నాళ్ళకు పాక్ పాలకులు సరైన దోవలో ఆలోచిస్తున్నారు. డాలర్ నిల్వలు పడిపోతూ, శ్రీలంక బాటలో పాక్ కూడా దివాళా తీసే ప్రమాదపుటంచున ఉంది. ఈ నేపథ్యంలోనే 'అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం చెలరేగితే, ఏం జరిగిందో చెప్పడానికైనా ఎవరూ మిగలర'న్న ఆకస్మిక జ్ఞానం వారికి కలిగిందనుకోవాలి. నిజానికి, పాక్ చర్చల ఆకాంక్ష, కశ్మీర్ సమస్య పరిష్కారం, చివరకు భారత్‌తో శాంతిస్థాపన ఆలోచనలు కొత్తవేమీ కావు. జనరల్ పర్వేజ్ ముషారఫ్ పాలనలోనే ఈ కథ కంచి దాకా వెళ్ళినట్టే వెళ్ళి, ఆఖరి క్షణంలో అడ్డం తిరిగింది. అప్పట్లో ఇక్కడ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై ప్రతిపక్ష బీజేపీ ఒత్తిడి, అక్కడ ముషారఫ్‌ను బలహీనపరిచిన దేశీయ సమస్యలు కలసి బంగారం లాంటి అవకాశాన్ని చేజార్చాయి. ఆ మధ్య ఇమ్రాన్ ఖాన్ – సైన్యాధ్యక్షుడు జనరల్ బజ్వా ద్వయం కూడా ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని పునఃప్రారంభించాలని ప్రయత్నించింది. కానీ, పాక్ పాలక వర్గాలు పడనివ్వలేదు.

దేశ ఆర్థిక సమస్యలు, తీవ్రవాద 'తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్తాన్' (టీటీపీ) తలనొప్పి, పశ్చిమ ఆసియా భౌగోళిక రాజకీయాల్లో మార్పులు – ఇలా అనేకం శాంతి గీతాలాపనకు కారణం. పశ్చిమాసియాలో కీలకమైనవీ, పాక్‌కు 'సోదర' దేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా తాజా పరిస్థితుల్లో భారత్‌కు దగ్గరయ్యాయి. దీంతో, పాక్ రూటు మార్చక తప్పట్లేదు. పైగా, భారత్‌తో శాంతి నెలకొంటే వాయవ్యాన తలనొప్పిగా మారిన తాలిబన్లపై దృష్టి పెట్టవచ్చు. ఈ ఏడాదే పాక్‌లో ఎన్నికలు జరగనున్నందున ఈ శాంతి వచనాలు ఊహించదగ్గవే. అధికారం కోరే ప్రతి పార్టీ ఓటర్లకు గాలం వేస్తూ, ఎన్నికల మేనిఫెస్టోలో భారత్‌తో శాంతిస్థాపన అంశాన్ని చేర్చడం షరా మామూలే. గత ఎన్నికల్లో ప్రధాని పీఠానికి పోటీపడ్డ ముగ్గురూ ఆ వాగ్దానమే చేశారు. ఇప్పుడు ఎన్నికల వేళ షెహబాజ్ అదే పల్లవి అందుకున్నట్టున్నారు.

కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని రద్దు చేస్తూ 2019 ఆగస్ట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని భారత్ పునఃసమీక్షించే అవకాశం లేదు. అది మినహాయించి, జమ్ము–కశ్మీర్‌ల రాష్ట్ర హోదా పునరుద్ధరణ లాంటివి కోరుతూ చర్చలంటే కథ కొంత ముందుకు నడుస్తుంది. అదే సమయంలో యూఏఈ సహా ఉభయ మిత్రులూ, తెర వెనుక శక్తిమంతులూ ఎందరున్నా... అంతర్గత అంశమైన కశ్మీర్‌పై అంతర్జాతీయ జోక్యం మనకు సమ్మతం కానే కాదు. అది గుర్తెరిగి ప్రవర్తిస్తేనే తాజా ప్రతిపాదనకు సార్థకత. పీఎంఓ ప్రకటన అటుంచి, చర్చలకు కట్టుబడి ఉన్నామని షెహబాజ్ బృందం చేతల్లో చూపాలి.

పాక్‌తో గత అనుభవాల దృష్ట్యా ఆ దేశం నేర్చుకున్నట్టు చెబుతున్న గుణపాఠాల పట్ల భారత్‌కు అనుమానాలు సహజమే. అయితే, అనాలోచితంగా శాంతి ప్రతిపాదనకు అడ్డం కొట్టాల్సిన పని లేదు. దౌత్య, వాణిజ్యపరంగా ముందుగా చేయాల్సినవీ చాలానే ఉన్నాయి. 2019 ఆగస్ట్ పరిణామాల తర్వాత ఇరుదేశాల రాజధానుల్లోనూ హైకమిషనర్లు లేరు. కింది సిబ్బందే బండి నడుపుతున్నారు. పరస్పర విశ్వాసం పాదుగొల్పే చర్యల్లో భాగంగా రెండుచోట్లా హైకమిషనర్ల నియామకం జరగాలి. వీసాలపై షరతుల్ని సడలించాలి. సాంస్కృతిక, క్రీడా సంరంభాలను పునరుద్ధరించాలి. ముఖ్యంగా తీవ్రవాదానికి కొమ్ము కాయబోమని పాక్ నమ్మకం కలిగించాలి. శాంతి పథంలో సాగాలంటే అది అతి ముఖ్యం. అందుకు పాక్ రెండడుగులు ముందుకు వేస్తే, నాలుగడుగులు వేయడానికి శాంతికాముక భారతావని సదా సిద్ధంగానే ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.9.55 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ ప.12.34 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** రా.8.06 నుండి 9.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.21 నుండి 11.04 వరకు తదుపరి ప.2.45 నుండి 3.32 వరకు, **అమృతఘడియలు:** తె.5.10 నుండి 6.43 వరకు (తెల్లవారితే శుక్రవారం).



సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం: 5.44
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ప్రపంచాన్ని నియంత్రించే వేదిక

విశ్లేషణ



డాక్టర్ దొంతి నరసింహారెడ్డి

దేశ సరిహద్దులను చెరిపి ప్రపంచ పాలన సాధించే దిశగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అడుగులు వేస్తున్నది. ప్రపంచీకరణను ఇంకా లోతుల్లోకి తీసుకెళ్లేలా కొత్త వ్యూహాలను రచిస్తున్నది. పర్యావరణం పట్ల శ్రద్ధ ఉన్నట్లు కనిపిస్తుంది కానీ తమ సభ్యులు ఆధిపత్యం కోల్పోని విధంగా 'పరిష్కారాలు' తెర మీదకు తేవడం ఈ సంస్థ ప్రత్యేకత. ప్రపంచంలో జరిగే కార్పొరేట్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగే నిరసనల మీద 'డబ్ల్యూఈఎఫ్' ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నది. ప్రజా ఉద్యమాలను నిర్వీర్యం చేయడంలో దీని పాత్ర ఉందని నమ్ముతున్నారు. అనేక రూపాలలో ప్రపంచ ఆలోచనలను, పరిశోధనలను, వ్యక్తులను, వ్యవస్థలను నియంత్రించే రీతిలో ఈ సంస్థ పని చేస్తున్నది.

గత నాలుగు దశాబ్దాలుగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాల్లో వేలాది మంది అగ్రశ్రేణి కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు, బ్యాంకర్లు, ఫైనాన్షియర్లు, దేశాధినేతలు, ఆర్థిక, వాణిజ్య మంత్రులు, ధనిక దేశాల విధాన నిర్ణేతలు పాల్గొంటున్నారు. అన్ని ప్రధాన అంతర్జాతీయ సంస్థల అధిపతులు కూడా అక్కడికి వెళ్తుంటారు. ఇంతమంది నాయకులు, ప్రముఖులు అక్కడ పోషించే పాత్ర ఏమిటో తెలియదు. ప్రజాధనం ఎంత ఖర్చు అవుతుందో చెప్పరు. ఈ సంవత్సరం కనీసం ముగ్గురు ముఖ్యమంత్రులు దావోస్(స్విట్జర్లాండ్) పోతున్నారు– మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక. తెలంగాణా నుంచి దావోస్ ప్రతి సమావేశంలో పాల్గొనే మంత్రి గారు వెళ్తున్నారు.

ఈ సమావేశాలు నిర్వహించే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఒక ప్రైవేటు సంస్థ. దీని ఆలోచనలు, వ్యూహాలు తెలుసుకోవడం అవసరం. సాధారణంగా ప్రపంచంలో రెండు పెట్టుబడిదారీ నమూనాలు ఉన్నాయి. మొదటిది: చాలా పాశ్చాత్య సంస్థలు స్వీకరించిన 'షేర్ హోల్డర్ క్యాపిటలిజం'. దీని ప్రకారం ఒక కార్పొరేషన్ ప్రాథమిక లక్ష్యం దాని లాభాలను గరిష్ఠంగా పెంచడం, తద్వారా వాటాదారులకు లాభాలు పంచడం. రెండవ నమూనా: 'స్టేట్ క్యాపిటలిజం'. ఇందులో దేశ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించే బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుంది. ప్రభుత్వమే పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. చైనా, ఇంకా కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ తరహా వ్యవస్థ ఇటీవల ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఈ రెండింటికి భిన్నంగా, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అధినేత క్లాస్ శ్వాబ్ ప్రతిపాదించిన మూడవ తరహా 'స్టేక్ హోల్డర్ పెట్టుబడిదారీ విధానం'లో ప్రైవేట్ కంపెనీలకు సమాజం, పర్యావరణం పట్ల బాధ్యత ఉంటుంది. ఇది ఒక విధంగా మన దేశంలో అమలవుతున్న సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) లాంటిది. ఇది మంచిదేగా అనిపిస్తుంది. అసలు విషయం ఏమిటంటే, దేశ సరిహద్దులను చెరిపి ప్రపంచ పాలన సాధించే దిశగా ఈ సంస్థ అడుగులు వేస్తున్నది. వైఫల్యం చెందినప్పటికీ ప్రపంచీకరణను ఇంకా లోతుల్లోకి తీసుకెళ్లేలా కొత్త వ్యూహాలను రచిస్తూ, ప్రపంచ పరిపాలన మీద దృష్టి పెడుతున్నది. పర్యావరణం పట్ల శ్రద్ధ ఉన్నట్లు కనిపిస్తుంది కానీ ఏ సమస్యలో అయినా 'డబ్ల్యూఈఎఫ్' సభ్యులు తమ ఆధిపత్యం కోల్పోని విధంగా 'పరిష్కారాలు' తెర మీదకు తేవడం ఈ సంస్థ ప్రత్యేకత.

ఈ ఆలోచనలతో క్లాస్ శ్వాబ్ రాసిన పుస్తకం: 'ది గ్రేట్ రీసెట్'. దీనిలో భాగస్వామ్య పెట్టుబడిదారీ విధానంతో పాటు తనదైన మార్క్సిజం బ్రాండ్‌తో ప్రపంచాన్ని పూర్తిగా పునర్నిర్మించాలని పిలుపు ఇచ్చాడు. దశాబ్దాలుగా ఒక క్లబ్ మీటింగ్ తరహాలో ఇక్కడ వార్షిక సమావేశాలు జరుగుతున్నాయి. నయా ఉదారవాదం పునాదిగా



కార్పొరేట్ వాణిజ్య ఒప్పందాల వ్యాప్తి, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తులను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విలీనం చేయడం ఇక్కడి ప్రక్రియలో భాగం. ప్రపంచ వాణిజ్య మార్కెట్లకు దన్నుగా 'గ్లోబల్ గవర్నెన్స్'ను ప్రోత్సహించడానికి ఈ సమావేశాలను వాడుకుంటున్నారు. వాస్తవానికి, ఈ ఆర్థిక వేదిక ప్రధాన ఉద్దేశ్యం ప్రపంచీకరణ ద్వారా ఉన్నత వర్గాల, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలను కాపాడటమే. 1990లో నెల్సన్ మండేలా జైలు నుండి విడుదలైనప్పుడు గనులు, బ్యాంకులు, గుత్తాధిపత్య పరిశ్రమలను ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ జాతీయం చేస్తుందని ప్రకటించారు. కాగా, అధ్యక్షుడైన వెంటనే 1992 జనవరిలో 'డబ్ల్యూఈఎఫ్' సమావేశాలకు హాజరై తన అభిప్రాయాలను మార్చుకుని 'పెట్టుబడిదారీ విధానం, ప్రపంచీకరణ'ను స్వీకరించారు. చైనా, వియత్నాం, కంబోడియా వంటి కమ్యూనిస్ట్ దేశాలు కూడా ఈ సమావేశాల్లో పాల్గొంటే తమ దేశానికి పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నాయి.

1997లో అమెరికా రాజకీయ శాస్త్రవేత్త శామ్యూల్ హంటింగ్టన్ 'దావోస్ మగవాడు' (దావోస్ మ్యాన్) అనే పదాన్ని సృష్టించారు. 'దేశ సరిహద్దులను కనుమరుగవుతున్న అవరోధాలుగా, జాతీయ ప్రభుత్వాలను గతానికి అవశేషాలుగా చూస్తూ– అటువంటి ప్రభుత్వాలకు ఉండే ఏకైక ఉపయోగకరమైన పని ఉన్నత వర్గాల పుడమి స్థాయి కార్యకలాపాలను సులభతరం చేయడమే అని నమ్మేవారు' అంటూ ఈ పదాన్ని ఆయన విశ్లేషించారు.

ఏటా దావోస్ సమావేశాలకు హాజరయ్యేవాళ్ళు తమ పరపతి, వనరులు పెంచుకోవడానికీ, ఇతరులతో కలిసి తమ ఆధిపత్యానికి అడ్డంకులు తొలగించుకోవడానికీ ఈ వేదికను ఉపయోగించుకుంటున్నారు. ఒకానొక సమావేశంలో, బోరిస్ బెరెజోవ్‌స్కీ నేతృత్వంలోని ఏడుగురు రష్యన్ నేతలు బోరిస్ యెల్ట్సిన్ తిరిగి ఎన్నిక కావడానికి నిధులు సమకూర్చాలనీ, 'తమ దేశ భవిష్యత్తును పునర్నిర్మించడానికి' కలిసి పనిచేయాలనీ నిర్ణయించుకున్నారు. ఈ కూటమి అనుకున్నది సాధించింది. ఇది వారందరినీ ఇంకా ధనవంతులను చేసింది.

2009 సంవత్సరంలో అంతర్జాతీయ బ్యాంకులు, ప్రపంచ ఆర్థిక సంస్థలపై ప్రజలకు విశ్వాసం తగ్గినప్పటికీ, ప్రైవేటు ఆర్థిక సంస్థల ప్రయోజనాలను పరిరక్షించడానికి కట్టుబడి దావోస్ పని చేసింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఫౌండేషన్ బోర్డు (దాని అత్యున్నత పాలక సంస్థ)లో ప్రపంచ కుబేరులు ఉన్నారు. 2002లో ఏర్పాటైన మరొక పాలక మండలి 'ఇంటర్నేషనల్ బిజినెస్ కౌన్సిల్'ను 100 మంది ప్రముఖులతో ఏర్పాటు చేశారు. వ్యూహాత్మక సలహాలు ఇస్తూ, వార్షిక సమావేశ ఎజెండా తయారీకి ఈ మండలి ఉపయోగపడుతుంది. ఇందులో ముఖేష్ అంబానీ కూడా ఉన్నారు. 2015 నాటికి 'డబ్ల్యూఈఎఫ్' వార్షిక వ్యూహాత్మక భాగస్వామి హోదా పొందాలంటే దాదాపు 7 లక్షల డాలర్ల రుసుము కట్టాలి. ఇందులో వ్యూహాత్మక భాగస్వామి సభ్యులుగా బ్యాంక్ ఆఫ్ అమెరికా, బార్క్లేస్, బ్లాక్ రాక్, బీపీ, చెవ్రాన్, సిటీ, కోకాకోలా, క్రెడిట్ సూయిజ్, డ్యూష్ బ్యాంక్, డౌ కెమికల్, ఫేస్‌బుక్, జీఈ, గోల్డ్‌మాన్ శాక్స్, గూగుల్, హెచ్ఎస్‌బీసీ, జేపీ మోర్గాన్ ఛేజ్, మోర్గాన్ స్టాన్లీ, పెప్సికో, సీమెన్స్, టోటల్, యూబీఎస్ లాంటి సంస్థలు ఉన్నాయి.

ప్రపంచంలో జరిగే కార్పొరేట్, ఆర్థిక శక్తి ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగే నిరసనలు, ప్రతిఘటన ఉద్యమాల మీద 'డబ్ల్యూఈఎఫ్' ఆసక్తి చూపిస్తున్నది. 1999లో ప్రపంచ వాణిజ్య సంస్థకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున జరిగిన నిరసనల నేపథ్యంలో ఈ ఆసక్తి స్పష్టమైంది. అప్పటి నిరసనల వల్ల సియాటెల్ నగరంలో కీలక వాణిజ్య చర్చలకు అంతరాయం ఏర్పడింది. ఈ నిరసనలను పెరుగుతున్న 'ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమం'గా 'డబ్ల్యూఈఎఫ్' అభివర్ణించింది. ప్రజా ఉద్యమాలను నిర్వీర్యం చేయడంలో, లేదా నిరంకుశంగా అణిచివేయడంలో దీని పాత్ర ఉందని నమ్ముతున్నారు. 2001 జనవరిలో దావోస్ సమావేశాలకు అంతరాయం కలగకుండా అసాధారణ భద్రతా చర్యలు తీసుకున్నారు. దావోస్ పట్టణం చుట్టూ కాంక్రీట్ బ్లాక్‌లు అమర్చి, కంచెకు అవతలి వైపునే వేలాది పోలీసులు నిరసనకారులను నిలువరించారు. అదే సమయంలో, దావోస్‌కు ప్రతి వేదికగా బ్రెజిల్‌లోని పోర్టో అలెగ్రేలో ఏర్పడిన వరల్డ్ సోషల్ ఫోరమ్ కాలక్రమేణా బలహీనపడగా, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ బలపడింది. అన్ని దేశాల ఒప్పందం మేరకు ఏర్పాటైన ప్రపంచ వాణిజ్య సంస్థ ఇటీవలి సంవత్సరాలలో బలహీనపడగా, ఒక ప్రైవేటు సంస్థ అయిన 'డబ్ల్యూఈఎఫ్' బలపడుతున్నది. తన దగ్గర ఉన్న కోట్లాది సొమ్ముతో అనేక రూపాలలో ప్రపంచ ఆలోచనలను, పరిశోధనలను, వ్యక్తులను, వ్యవస్థలను నియంత్రించే రీతిలో ఈ సంస్థ పని చేస్తున్నది. కరోనా మహమ్మారి గురించిన వివిధ దేశాల ప్రభుత్వాల స్పందనను, విధానాలను శాసించే స్థితికి కూడా ఈ సంస్థ చేరిందని వ్యాఖ్యానించేవారూ ఉన్నారు.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

బుద్ధిమాంద్యం



చైనా నుంచి మన దిగుమతులు, ఆ దేశంతో పోలిస్తే మన వాణిజ్యలోటు రెండూ కూడా అధికంగా ఉన్నాయి. అయినప్పటికీ మనలోని బుద్ధిహీనులు చైనా వస్తువులను బహిష్కరించాలని అంటూనే ఉంటారు. – అజయ్ కామత్, వైద్యుడు

తొలి ప్రాధాన్యం



ముస్లిములకు కనుక లౌకిక లేదా ఇస్లామిక్ ప్రభుత్వానికి ఓటు వేసే ఛాయిస్ ఉంటే వారు ఇస్లామిక్ ప్రభుత్వానికి ఓటు వేసి, వీలైతే లౌకిక దేశానికి పారిపోతారు.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికవాది

చెదరని చిరునవ్వు



నేనిప్పుడు కాబూల్‌లోని బోస్ట్ రెస్టారెంట్‌లో ఉన్నాను. (ఫొటో అటాచ్ చేస్తూ). ఈ హోటల్‌ను ఒక మహిళ నడుపుతున్నారు. ఇక్కడి సిబ్బంది అంతా మహిళలే. ఇదంతా తాలిబన్‌లు అఫ్గానిస్తాన్‌ను ఆక్రమించక ముందు. ఫొటోలో నా వెనుక గోడపై అఫ్గాన్ ప్రాచీన ధీర వనితల చిరునవ్వు చిత్రాలు ఉన్నాయి. అప్పుడు, ఇప్పుడు మాత్రమే కాదు, ఎప్పుడూ కూడా అఫ్గాన్ మహిళల్ని ఎవ్వరూ ఆపలేరు. – సారా వహేది, హ్యూమనిస్టు

ఇష్టమైన వ్యాపకం



ఈ మధ్య నేను చదివిన అత్యుత్తమ వ్యాసంలోని రెండు వాక్యాలివి. "పుస్తకాలను అమ్మాలంటే పుస్తకాలను ప్రేమించాలి. సంగీతాన్ని విక్రయించాలనుకుంటే మీరు సంగీత ప్రియులై ఉండాలి". యు.ఎస్.లోని అతి పెద్ద పుస్తక విక్రయ కేంద్రం 'బార్నెస్ అండ్ నోబుల్' విజయగాథపై వచ్చిన వ్యాసం అది. – తారా ఖండేల్వాల్, 'బౌండ్ ఇండియా'

ఇద్దరు దేశాధినేతలు



ఫ్రెంచి అధ్యక్షుడు మెక్రాన్‌కు డెన్మార్క్ ప్రధాని చెప్పిన స్వాగత విధానం నుంచి మనం నేర్చుకోవలసిన పాఠాలు. 1. సామాన్య పౌరుల్లా రోడ్ల మీద సైకిల్‌పై ప్రయాణిస్తూ మాట్లాడుకోవడం 2. భద్రతా సిబ్బంది లేని సన్నిహిత సంభాషణ 3. నిరాడంబర అధికారిక కార్యక్రమాలు.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

తల్లిదండ్రులకు క్లాసు



ఎల్‌కేజీ, యూకేజీ చదివే పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు నిజం చెప్పాలంటే పీడకలల్లాంటివి. వాటివల్ల పిల్లలు పెద్దగా ఏమీ నేర్చుకోలేరు. పిల్లలు ఏం చేస్తున్నారో టీచర్లు శ్రద్ధ పెట్టలేరు. తల్లిదండ్రులు పక్కన కూర్చుని టీచర్ ఏం చెప్తున్నారో చెబుతూనే ఉండాలి.

– ఐశ్వర్య ముద్గిల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇదేనా సమానత్వం?



మొదటి భర్త జెఫ్ బెజోస్ నుండి 38 బిలియన్ డాలర్లు సంపాదించిన తర్వాత మెకెంజీ నాల్గవ సంపన్న మహిళ అయింది. ఆమె 2021లో తిరిగి వివాహం చేసుకుని రెండవ భర్త డాన్ జ్యువెట్‌తో కూడా విడిపోయింది. రెండుసార్లు విడాకులు తీసుకోవడం తప్పని అనడం లేదు కానీ.. అదే పురుషులు కనుక విడాకుల కోసం దావా వేసే ధైర్యం చేసినా చాలు వారిపై స్త్రీలోలుడు అనే ముద్ర వేసేస్తారు!

– అర్నాజ్ హాథీరామ్, 'వాయిస్ ఫర్ మెన్'

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

వర్కర్స్‌ను పట్టించుకోరా?


దేశంలో బాలికల విద్యాభివృద్ధికి, బాల కార్మికులను నిర్మూలించుటకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)లను 18 సంవత్సరాల క్రితం రాష్ట్రంలో నెలకొల్పారు. ఈ విద్యాలయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెసిడెన్షియల్‌గా నడుస్తున్నాయి. కేజీబీవీలు స్థాపించిన నాటి నుండి నేటి వరకు ప్రాథమిక విద్యలో బాలికల విద్యాభివృద్ధి మెరుగుపడి కొన్ని సత్ఫలితాలిస్తోంది.

కానీ నేడు అధికార ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా ఈ విద్యాలయాల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థినులకు సేవలందించే పేద గ్రామిక మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేజీబీవీల నిర్వహణలో నాన్ టీచింగ్ వర్కర్స్ పాత్ర ముఖ్యమైనదిగా భావించాల్సి ఉంటుంది. ఎందుకంటే బాలికలకు అన్ని రకాల ఆహార పదార్థాలను మూడు పూటలా తయారుచేసి అందించి వారి రక్షణ కొరకు నిరంతర కృషి చేస్తున్నది ఆ వర్కర్సే. బాలికల సంరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న వర్కర్స్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి అలసత్వం వహిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనైనా తమ జీవితాలు బాగుపడతాయని ఆశిస్తుంటే, కేసీఆర్ ప్రభుత్వం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్‌కూ కనీస వేతనాలు అమలు చెయ్యాలనీ, ఉద్యోగ భద్రత కల్పించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలనీ గత ఏడు సంవత్సరాలుగా ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. దేశాభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతున్నదని ప్రభుత్వం ప్రకటించుకుంటున్నప్పటికీ, కేజీబీవీలలో వర్కర్స్‌కు కనీస వేతనాలను అమలు చేయకపోవడం, సమస్యలు పరిష్కరించకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? రాష్ట్ర సీఎం దేశ రాజకీయాల్లో అడుగు పెడుతున్న సమయంలో ఇంట గెలిచి రచ్చ గెలవాలనే నానుడిని దృష్టిలో పెట్టుకుని అయినా... తక్షణమే కేజీబీవీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– గంట నాగయ్య, నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్

లోకకవి మన వేమన!

సందర్భం




పి. విజయబాబు

వానకు తడవని వారూ, ఒక్క వేమన పద్యం కూడా వినని తెలుగువారూ ఉండరని లోకోక్తి. అలతి పదాలతో సమాజంలోని రుగ్మతలను తూర్పార బట్టిన మనో వైజ్ఞానికుడు వేమన. సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన సంఘసంస్కర్త, విప్లవకారుడు వేమన. 1839లో తొలిసారిగా బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు పుస్తక రూపంలో వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత అనేకమంది ఆయనపై పరిశోధన చేశారు. ప్రముఖ పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ వారి సహకారంతో వేమన జీవిత చరిత్రను 14 భాషలలోకి అనువదించడానికి కారకులయ్యారు. ఆంగ్ల, ఐరోపా భాషల్లోకీ; అన్ని ద్రవిడ భాషల్లోకీ వేమన పద్యాలు అనువాదమయ్యాయి. సి.ఇ. గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు వేమన సాహిత్యానికి ముగ్ధులై ఆయనను లోక కవిగా కీర్తించారు.

వేమన 1602–1730 మధ్య కాలానికి చెందిన వాడనీ కొండవీటి రెడ్డి రాజవంశానికి చెందిన వాడనీ అంటారు. జనబాహుళ్యంలో ఉన్న వివరాల ప్రకారం, వేమన అసలు పేరు బెధమ కోమటి చినవేమారెడ్డి. ఈయన అన్న పేరు బెధమ కోమటి పెదవేమారెడ్డి. వేమన జన్మించిన ప్రాంతంపై అనేక రకాల అభిప్రాయాలు ఉన్నప్పటికీ చివ రిగా ఆయన అనంతపురం జిల్లా కదిరి సమీపంలో ఉన్న కటారు పల్లె ప్రాంతానికి చెందిన వారని నిర్ధారించారు. అందుకే ఆ ప్రాంతంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా వేమన జయంతి ఉత్సవాలను జరపడానికి నిర్ణయించుకుంది.

వేమన భోగలాలసుడుగా తిరుగుతూ ఒకా నొక దశకు వచ్చేటప్పటికి ఓ సాధువు ద్వారా ఆత్మ జ్ఞానం పొంది అన్నింటినీ త్యజించి యోగిలా మారిపోయాడని అంటారు. సంసార బాధలనుండి ఉపశమనం పొందడానికి తనను ఆశ్రయించే అభాగ్యులకు తన పద్యాల ద్వారా తత్వాన్ని బోధించడం మొదలు



పెట్టాడు. తన మాటల ద్వారా తనలో జ్ఞానజ్యోతిని మొట్ట మొదటగా వెలిగించిన తన ప్రేయసి విశ్వద పేరును, తనకు కష్ట కాలంలో అండగా నిలిచిన మిత్రుడు అభిరాముడి పేరును తన పద్యాలకు మకుటంలో చేర్చి వారికి శాశ్వత కీర్తిని ప్రసాదించాడు వేమన అనేది కొందరి అభిప్రాయం. అయితే అసలు ఇవన్నీ కూడా ప్రక్షిప్తాలనీ... వేమన చిన్న నాటి నుంచే జ్ఞానశీలి అనీ, తదనంతరం స్నేహి తుల ప్రభావం వల్ల దారితప్పి, ఆపై పరివర్తన వచ్చి యోగిగా మారాడనీ అంటారు. ఆయన పద్య మకుటానికి 'సృష్టి కర్తకు ప్రియమైన వేమా వినుము' అని పండితులు మరో అర్థాన్ని చెప్పారు. బ్రౌన్ ఈ అర్థాన్నే తీసుకొని వేమన పద్యాలను ఇంగ్లిష్‌లోకి అనువదించారు.

వేమన పద్యాలలో ఎక్కువగా లోక నీతులు, సామాజిక రీతులు, సామాజిక చైతన్యానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉంటాయి. ఆయన కవిత్వంలో స్పృశించని అంశమే లేదు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు; మతం పేరిట జరుగుతున్న అరాచకాలు, దోపిడీలు, విగ్రహారాధనలోని మౌఢ్యం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు... ఒకటేమిటి? కనిపించిన ప్రతి సామాజిక రుగ్మత మీద వేమన తనకలం ఝుళిపించాడు.

సామాన్య నీతులను ప్రజల హృదయాలకు హత్తుకునేట్లు వారికి పరిచితమైన భాషలో స్పష్టమైన రీతిలో సూటిగా, తేటగా శక్తిమంతంగా వ్యక్తీకరించారు. వేమన పద్యా లన్నీ ఆటవెలది చందస్సులోనే చెప్పాడు. కవిత్రయం అంటే తిక్కన, వేమన, గురజాడ అంటాడు శ్రీశ్రీ. 'వేమన కవిత్వం గాయానికి మందు రాసినట్లు కాక, ఆ గాయం చేసిన కత్తికే ముందు మందు పూసినట్లుంటుంది' అంటారు రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ. తన పద్యాలలో సామ్యవాద సిద్ధాంతాన్ని ఎప్పుడో ఎలిగెత్తి చాటిన సామ్యవాద ప్రజా కవి వేమన.

వ్యాసకర్త అధికార భాషా సంఘం అధ్యక్షులు, ఏపీ
(నేడు వేమన జయంతి ఉత్సవాల సందర్భంగా)

సానుకూల మానసిక స్థితి

మనం ఏ పని చేయాలనుకున్నా అందుకు సానుకూలమైన మానసిక స్థితి తప్పనిసరిగా ఉండాలి. పెద్ద పెద్ద విషయాలకే కాదు, రోజువారీ పనులకు కూడా... అంటే వంట చేయటం, బయటకు పని ఉంటే వెళ్ళటం వంటి వాటికి కూడా మానసిక సంసిద్ధత ఉండాలి. లేకపోతే, అరకొర మనసుతో ఏ పని చేసినా ఆ పని పూర్తయినా; పూర్ణమైన తృప్తినీ, ఫలితాన్నీ ఇవ్వదు. చేయబోతున్న పనికి సానుకూలమైన మానసిక స్థితిని పెంపొందించుకున్న తర్వాతే ఆ పని ప్రారంభించటం వల్ల మంచి ఫలితాలు పొందగలం. దేవాలయాల్లో గర్భగుడి... ముఖద్వారం నుంచీ కొంత దూరం ఉంటుంది. దేవాలయంలో ప్రవేశించి దేవుని సమీపానికి నడిచే వ్యవధిలో ఇతర ఆలోచనలన్నింటినీ క్రమంగా పరిహరించుకుంటూ దైవంపై మనసు కేంద్రీకృతం చేయటానికి సంసిద్ధులమవ్వాలి. అప్పుడే పరిపూర్ణమైన మనసుతో దైవ దర్శనం చేసుకుని, దైవ చింతనలో గడపటానికి సాధ్య మవుతుంది.



పుస్తకం చేతిలో పట్టుకుని, పరధ్యానంగా ఎటో చూస్తున్న విద్యార్థిపై 'ఎందుకా మనసు పెట్టని చదువు? సమయం వృథా మనసు లగ్నం చేసి చదువు', అని కేకలేస్తుంటాం. మనసులేని ఏ పనీ రాణించదు.

మనసును మంచి విషయాలపై సంసిద్ధం చేయటానికి ప్రతిరోజూ, చెవులతో మంచి విషయాలనే వినాలి. కళ్ళతో మంచి విషయాలే చూడాలి. ఇతరులకు మేలు చేసే రీతిలోనే జీవించాలి అని ప్రార్థించాలని ఉపనిషత్తులు చెపుతున్నాయి.

తాను ఎందుకు, ఎవరికీ ఉపయోగపడనని రాత్రింబగళ్ళు భావించే వ్యక్తి నుంచి ఎలాంటి మేలూ జరగదు. నా జీవితం వేదనామయం. నేనేమీ చేయలేననే మాటనే నిరంతరం జపిస్తుంటే ఎందుకు పనికిరాని వారుగానే మిగులుతారు. నేను దేనినైనా సాధిస్తాను అని భావిస్తే అలానే సాధించగలుగుతారు. మనసును సంసిద్ధం చేయవలసిన పద్ధతి ఇదే.

ఉన్నతమైన జీవితం గడపాలంటే శరీరాన్ని, ఇంద్రియాలను, మనసును తదనుగుణంగా మలచుకోవలసి ఉంటుంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

టీచర్ల బదిలీల షెడ్యూల్ మరింత ఆలస్యం

- వచ్చే వారంలో వెలువడే అవకాశం
- సాఫ్ట్‌వేర్ అప్‌గ్రెడేషన్, టీచర్ల సంఘాల డిమాండ్ల పరిశీలనే కారణం!
- పాఠశాల విద్య డైరెక్టర్‌తో నేతల భేటీ
- నేడు మంత్రి సబితతో అధికారుల సమావేశం



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ విడుదలకు మరింత సమయం పట్టేలా ఉంది. ఈ ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాల నుంచి వివిధ రకాల డిమాండ్లు వస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే వారంలో షెడ్యూల్ ఇవ్వాలనే యోచనలో అధికారులున్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలతో పాఠశాల విద్య డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులు బుధవారం భేటీ అయ్యారు. వివిధ సంఘాలతో విడివిడిగా జరిగిన ఈ భేటీలో అనేక అంశాలు తెరమీదకొచ్చాయి. గతంలో జరిగిన పొరపాట్లు, వాటివల్ల తలెత్తిన సమస్యలను సంఘాల నేతలు అధికారుల దృష్టికి తెచ్చారు. వాటన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఉన్నతాధికారులు తెలిపారు. బదిలీలు, పదోన్నతుల్లో ఎలాంటి సమస్యలు రాకుండా, పారదర్శకంగా చేపట్టాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయం కావడంతో ఉపాధ్యాయ వర్గాలు సంతృప్తి చెందేలా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో అధికారులు అన్ని సంఘాల నేతల మనోగతాన్ని తెలుసుకుంటున్నారు. కాగా గురువారం మంత్రి వద్ద దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

'కనీసం రెండేళ్లు' నిబంధన సడలించాలి..

బదిలీలకు కనీసం రెండేళ్ళు సంబంధిత స్కూల్‌లో పనిచేసి ఉండాలనే నిబంధనను సడలించాలని పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేనతో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లాల్లో స్పౌజ్ బదిలీలను షెడ్యూల్ విడుదలకు ముందే పూర్తి చేయాలని, జిల్లాల్లోని అన్ని ఖాళీలను బదిలీలకు చూపించాలని, బదిలీలకు కటాఫ్ తేదీ డిసెంబర్ 31 లేదా జనవరి 31 గా నిర్ణయించాలని కోరారు.

స్పౌజ్ బదిలీలపై బ్యాన్ ఎత్తివేయాలి..

జాక్టో సంఘం నేతలు కూడా పలు డిమాండ్లు లేవనెత్తారు. 13 జిల్లాల్లో స్పౌజ్ కేసుల విషయంలో విధించిన బ్యాన్ ఎత్తివేయాలని కోరారు. బదిలీలకు కనీస సర్వీసును రెండేళ్ల నుంచి జీరో సర్వీసుకు తగ్గించాలని, రిటైర్మెంట్ వయసును 61 ఏళ్లకు పెంచినందున, మూడేళ్ల సర్వీసు మిగిలి ఉన్న వారిని బదిలీల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక చట్టమూ లేదు... ఠాణా హోదా రాదు!

2014 నుంచి సేవలందిస్తున్న షీ టీమ్స్

పోకిరీల భరతం పట్టడంలో తలెత్తుతున్న ఇబ్బందులు

- పక్కా ఆధారాలు ఉంటే తప్ప ఆకతాయిలకు వర్తించని ఐపీసీ, ఇతర చట్టాలు
- కేవలం కౌన్సెలింగ్‌తోనే సరిపెట్టాల్సిన పరిస్థితి
- బాధితులకు పూర్తిస్థాయిలో లభించని న్యాయం
- తమిళనాడు తరహా చట్టం కోసం పోలీసులు ముసాయిదా సమర్పించినా నేటికీ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లోనే..




సాక్షి, హైదరాబాద్

యువతులు, మహిళలను వేధించే పోకిరీలకు చెక్ చెప్పడానికి రాష్ట్ర ప్రభుత్వం 2014లో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన షీ–టీమ్స్ గత ఎనిమిదేళ్లుగా ఎనలేని సేవలు అందిస్తున్నా నేటికీ వాటికి ప్రత్యేక చట్టం, కనీసం పోలీసుస్టేషన్ హోదా లేకపోవడంతో బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగట్లేదు. నేరాల తీవ్రత ఎక్కువగా ఉండి, పక్కా ఆధారాలు ఉంటే తప్ప ఆకతాయిలపై ఐపీసీతోపాటు ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేయడం సాధ్యం కావట్లేదు. గతేడాది రాజధానిలోని మూడు కమిషనరేట్లలో ఉన్న షీ–టీమ్స్‌కు అందిన ఫిర్యాదులు, పట్టుబడ్డ పోకిరీల సంఖ్య 2,322గా నమోదైనప్పటికీ వాటిలో 395 మాత్రమే ఎఫ్ఐఆర్‌లుగా నమోదయ్యాయి. మిగిలిన వాటిలో కొన్ని పెట్టీ కేసులు కాగా, మరో 1,798 మందికి కౌన్సెలింగ్‌తో సరిపెట్టాల్సి వచ్చింది. ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతూ రెండోసారి చిక్కిన ఓ వ్యక్తితోపాటు తీవ్రస్థాయిలో రెచ్చిపోయిన వారిపైనే కేసులు నమోదు చేయగలిగారు.

ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు ఈవ్ టీజర్లను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ప్రత్యేక చట్టం అవసరమని భావించారు. ఇందుకోసం వివిధ

ప్రత్యేక చట్టం కోసం...

రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసి చివరకు తమిళనాడులో అమలవుతున్న 'తమిళనాడు ప్రొహిబిషన్ ఆఫ్ ఈవ్ టీజింగ్ యాక్ట్' ఉపయుక్తంగా ఉందని తేల్చారు. అక్కడి చట్టంలోని అంశాలతోపాటు ఇతర అంశాలను చేరుస్తూ ఓ ముసాయిదాను రూపొందించి 2014లోనే ప్రభుత్వానికి పంపారు. అయితే ఈ ఫైలు న్యాయశాఖ వద్ద పెండింగ్‌లో ఉండిపోయింది.



పోలీసుస్టేషన్ల మెట్లెక్కాల్సిందే...

షీ–టీమ్స్ ఏర్పడి ఇన్నాళ్లైనా ఇప్పటికీ వాటికి పోలీసుస్టేషన్ హోదా ఇచ్చే అంశంపై ప్రభుత్వం దృష్టి పెట్టట్లేదు. తమ బాధలు, సమస్యలు పోలీసుస్టేషన్‌లో చెప్పుకోలేక చాలామంది అతివలు షీ–టీమ్స్‌ను ఆశ్రయిస్తున్నా కేసు నమోదు తప్పనిసరైతే ఆ పనిని ఠాణా హోదా లేని షీటీమ్స్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా బాధితురాలు నివసించే పరిధిలో ఉండే మహిళా ఠాణా, సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్... ఇలా ఏదో ఒక చోటకు బాధితురాలిని తీసుకెళ్లి షీ–టీమ్స్ కేసులు నమోదు చేయిస్తున్నాయి. అయితే అక్కడ అధికారులకు నిత్యం వస్తున్న అనేక కేసుల్లో ఇదీ ఒకటిగా మారిపోతోంది. దీంతో షీ–టీమ్స్‌పై ఉన్న నమ్మకం, ధైర్యంతో వచ్చిన బాధితురాళ్లకు నిరాశ తప్పట్లేదు. షీ–టీమ్స్‌కే ఠాణా హోదా ఇచ్చి అవసరమైన సిబ్బందిని కేటాయిస్తే వాటి లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

'షీ–టీమ్స్' ముసాయిదా చట్టంలోని కొన్ని అంశాలు

- బహిరంగ ప్రదేశాలతోపాటు పని చేసే ప్రాంతాలు, మాల్స్... ఇలా ఎక్కడైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతూ చిక్కిన పోకిరీలపై నేరం నిరూపణ అయితే ఏడాది జైలు లేదా రూ. 10 వేల జరిమానా లేదా రెండూ.
- ఈవ్ టీజింగ్ చేయడానికి పోకిరీలు వాహనాలను వినియోగిస్తే వాటిని స్వాధీనం చేసుకొనే వీలు.
- దేవాలయాలు, విద్యాసంస్థలు తదితర చోట్ల జరిగే ఈవ్ టీజింగ్‌లను నిరోధించాల్సిన బాధ్యత వాటి నిర్వాహకులదే. అలాంటి సమాచారాన్ని తక్షణం సంబంధిత పోలీసులకు చేరవేయాల్సిందే. దీనికి భిన్నంగా వ్యవహరిస్తే ఆ నేరానికి యాజమాన్యాలనూ బాధ్యుల్ని చేయవచ్చు. వారికి న్యాయస్థానం జరిమానా విధించే అవకాశం.

రియల్ ఎస్టేట్ సంస్థలపై ఐటీ దాడులు

సాక్షి, హైదరాబాద్: గడిచిన నాలుగైదు నెలలుగా వరసబెట్టి ఆదాయపు పన్ను శాఖ అధికారులు చేస్తున్న దాడులు రియల్ ఎస్టేట్ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. తాజాగా బుధవారం నగరంలోని పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దాదాపు 30కి పైగా బృందాలు బుధవారం తెల్లవారుజాము నుంచే రియల్ ఎస్టేట్ సంస్థలు ఆదిత్య హోం, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో విల్లాలు నిర్మిస్తున్న ఉర్జిత్ కన్‌స్ట్రక్షన్స్, సీఎస్‌కే బిల్డర్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించాయి. ఐదారు సంవత్సరాలుగా వారు చూపెడుతున్న లెక్కలకు, చెల్లిస్తున్న ఆదాయ పన్నుకు పొంతనలేని కారణంగానే ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. అదే విధంగా గురువారం కూడా కొన్ని సంస్థల్లో సోదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. బంజారాహిల్స్‌లోని శ్రీఆదిత్య హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కోటారెడ్డి, ఆయన కుమారుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న ఆదిత్యరెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో గల లోధా బెల్లెజలో నివాసం ఉండే ఉర్జిత్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్స్ శ్రీనివాసరెడ్డి, వీరప్రకాష్ నివాసాల్లో బుధవారం ఉదయం రెండు వాహనాల్లో వచ్చిన ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, కొండాపూర్, పంజాగుట్ట ప్రాంతాల్లోని కార్యాలయాలు, నివాసాల్లో కూడా ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. మరో బిల్డర్ మాధవరెడ్డి ఇంట్లో, సీఎస్‌కే కార్యాలయంలోనూ ఐటీ అధికారులు దాడులు కొనసాగించారు. ఈ సంస్థలన్నీ ఐటీ రిటర్న్స్‌లో పలు అవకతవకలకు పాల్పడినట్లు ఆదాయ పన్ను శాఖ అధికారులు గుర్తించారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొట్టినట్లు నిర్ధారణ కావడంతోనే ఆ శాఖ అధికారులు ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఈ దాడుల సందర్భంగా పలు కీలక పత్రాలు, డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నారు.

పరువు హత్య కేసు కొట్టివేత

- తీర్పు వెలువరించిన భువనగిరి సెషన్స్ కోర్టు
- సరైన సాక్ష్యాధారాలు లేవన్న న్యాయమూర్తి
- 2017లో హత్యకు గురైన ప్రేమికులు


స్వాతి (ఫైల్)


నరేశ్ (ఫైల్)

భువనగిరి/ఆత్మకూరు(ఎం): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల పరువు హత్య కేసును యాదాద్రి భువనగిరి జిల్లా సెషన్స్ కోర్టు కొట్టివేసింది. సరైన సాక్ష్యాధారాలు లేనందున జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు కేసును కొట్టివేస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో దోషులను శిక్షించాలని అప్పట్లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళన నిర్వహించాయి. ఆందోళనకారులపై కూడా కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఈ కేసు విషయంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, అరుణోదయ సాంస్కృతిక మండలి వ్యవస్థాపకురాలు విమలక్క భువనగిరి కోర్టుకు హాజరయ్యారు కూడా. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన చెందిన అంబోజు నరేశ్ ఇదే మండలానికి చెందిన తుమ్మల స్వాతి ప్రేమించుకున్నారు. కులాలు వేరుకావడంతో స్వాతి తండ్రి తుమ్మల శ్రీనివాస్ రెడ్డి వారి వివాహాన్ని వ్యతిరేకించారు. నరేశ్ తల్లిదండ్రులు ముంబైలో ఉండటంతో వారి వద్దకు ప్రేమ జంట వెళ్లిపోయింది. 2017 మార్చి 25న నరేశ్, స్వాతిలు ముంబైలో రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్వాతి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరికీ పెళ్లి జరిపిస్తానని నమ్మించి భువనగిరికి రప్పించాడు. మే 1వ తేదీన భువనగిరికి వచ్చిన తర్వాత స్వాతిని ఇంటికి తీసుకెళ్లారు. అదే రోజు నుంచి నరేశ్ అచూకీ తెలియలేదు. దీంతో నరేశ్ కనిపించడం లేదని తండ్రి వెంకటయ్య భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మే 16న స్వాతి ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. నరేశ్ ఆచూకీ కోసం అతని తల్లిదండ్రులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీంతో కోర్టు జూన్ 1 నాటికి నరేశ్‌ను కోర్టులో హాజరుపర్చాలని పోలీసులను ఆదేశించింది. ఇదే సమయంలో పోలీసుల దర్యాప్తులో నరేశ్‌ను తానే మే 2వ తేదీన హత్య చేసినట్లు స్వాతి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి అంగీకరించాడు. నరేశ్‌ను చంపి మృతదేహాన్ని కాల్చేసి, బూడిదను వలిగొండ మండలం సంగెం గ్రామం వద్ద మూసీ నదిలో కలిపినట్లు ఒప్పుకున్నాడు. శ్రీనివాస్‌రెడ్డితోపాటు అతనికి సహకరించిన బంధువు సత్తిరెడ్డిపై పోలీసులు పరువు హత్య కింద కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. ఐదేళ్ల 8 నెలలపాటు సాగిన కేసు విచారణలో కోర్టు 33 మంది సాక్షులను విచారించింది. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ వాదనలు ఈ నెల 9వ తేదీన పూర్తి కాగా, కేసును కొట్టివేస్తూ కోర్టు బుధవారం తుది తీర్పు వెలువరించింది.

న్యాయం కోసం పైకోర్టుకు వెళ్తా..



సరైన సాక్ష్యాలు లేవని నా కుమారుడి హత్య కేసును కోర్టు కొట్టి వేసింది. నాకు ఇక్కడ న్యాయం జరుగలేదు. న్యాయం కోసం పైకోర్టుకు వెళ్తా. చేతికొచ్చిన 25 ఏళ్ల కొడుకును పొట్టనబెట్టుకుంద్రు. నా భార్య పిచ్చిదైంది. పిల్లలు ముంబైకి పోయింద్రంటే నచ్చ జెప్పి రామన్నపేట సీఐ ముందు వారి బిడ్డను వారికి అప్పగించా. అదేవిధంగా నా కుమారుడిని కూడా నాకు అప్పగిస్తే బాగుండేది. మాకు అన్యాయం జరిగింది.

– అంబోజు వెంకటయ్య, నరేశ్ తండ్రి

మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని తీర్మానం


తిప్పన్నపేట గ్రామసభలో పాల్గొన్న రైతులు

జగిత్యాల రూరల్: జగిత్యాల బల్దియా జారీ చేసిన ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌పై బుధవారం కూడా ఆందోళనలు కొనసాగాయి. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ రైతులు పంచాయతీ కార్యాలయం ఎదుట సమావేశమై ఆందోళన నిర్వహించారు. తమ గ్రామాన్ని మాస్టర్‌ప్లాన్ నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం తీర్మాన ప్రతిని జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. మరోవైపు.. మోతె, ధరూర్, తిప్పన్నపేట, నర్సింగాపూర్, హస్నాబాద్, అంబారిపేట, తిమ్మాపూర్ గ్రామాలను మాస్టర్‌ప్లాన్ నుంచి తొలగించాలని కోరుతూ మోతె సర్పంచ్ భర్త సురకంటి రాజేశ్వర్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు పోస్టు చేశారు.

ట్రిపుల్‌ఆర్‌కు భూములివ్వం..

ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టం చేసిన రైతులు

జోగిపేట (అందోల్): సంగారెడ్డి జిల్లాలో 25.188 కి.మీ. రీజనల్ రింగ్ రోడ్ (ట్రిపుల్‌ఆర్) ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్‌లోని ఎంఎస్ గార్డెన్‌లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, పర్యావరణ శాఖ ఇంజనీర్ గీత సఫారి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. జిల్లాలోని కొండాపూర్, సంగారెడ్డి, చౌటకూరు, హత్నూర, సదాశివపేట మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. 19 గ్రామాలకు చెందిన 489 మంది రైతులు, భూ యజమానులు ట్రిపుల్‌ఆర్ ఏర్పాటుకు భూములు ఇచ్చే ప్రసక్తేలేదని, తమకు రోడ్డే అవసరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ సుమారు 4 గంటలపాటు అభిప్రాయ సేకరణ జరిగింది. 50 మందికిపైగా రైతులు తాము భూములివ్వమని, ట్రిపుల్‌ఆర్‌ను రద్దు చేయాలని కార్యక్రమాన్ని బహిష్కరించారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. జోగిపేట, మెదక్, నారాయణఖేడ్ ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. 19 గ్రామాలకు చెందిన 43 మంది రైతులు తమ అభిప్రాయాలను తెలిపారని అధికారులు పేర్కొన్నారు.

కలెక్టర్‌పై లోకాయుక్తలో కేసు

కామారెడ్డి టౌన్: రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కామారెడ్డి కలెక్టర్ జితేష్ పాటిల్‌తోపాటు కామారెడ్డి బల్దియా కమిషనర్ దేవేందర్‌లపై బుధవారం లోకాయుక్తలో కేసు నమోదు చేసినట్లు హైకోర్టు న్యాయవాది కట్టంగూర్ బుచ్చిరెడ్డి తెలిపారు. కామారెడ్డి బల్దియాలో మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతులు ఈనెల 5న ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చారు. రైతుల వద్దకు వచ్చి వినతి పత్రం తీసుకోవాలని కోరినా కలెక్టర్ స్పందించలేదు. వినతిపత్రం తీసుకోకపోవడమే కాకుండా మాట్లాడడానికి కనీసం ఐదు నిమిషాల సమయం కూడా ఇవ్వకుండా రైతులను అగౌరవ పరిచేలా వ్యవహరించిన కలెక్టర్‌పై రైతు జేఏసీ ఆధ్వర్యంలో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌పై బుధవారం లోకాయుక్తలో కేసు ఫైల్ చేసినట్లు హైకోర్టు న్యాయవాది బుచ్చిరెడ్డి తెలిపారు. అలాగే రైతులను సంప్రదించకుండా, వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించినందుకు మున్సిపల్ కమిషనర్‌పైనా కేసు పెట్టామని పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు బండి సంజయ్ కుమారుడు

దుండిగల్: తోటి విద్యార్థిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదైన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమారుడు బుధవారం వ్యక్తిగత న్యాయవాదితో కలిసి దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. విచారణ నిమిత్తం తాము ఎప్పుడు స్టేషన్‌కు పిలిచినా రావాల్సి ఉంటుందని సీఐ రమణారెడ్డి పేర్కొనగా దానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. కాగా దాడికి గురైన విద్యార్థిని త్వరలోనే విచారించి వాంగ్మూలం తీసుకుంటామని చెప్పారు. బండి సంజయ్ కుమారుడు స్టేషన్ బెయిల్ తీసుకున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని సీఐ 'సాక్షి'కి తెలిపారు.

మున్సిపాలిటీ కార్యాలయం, సత్తుపల్లి
కొటేషన్ నోటీసు
Roc No.E/SPL/02/2023 తేది: 18.01.2023
దిగువ తెలిపిన పని కోసం కమిషనర్, సత్తుపల్లి మున్సిపాలిటీ వారు కొటేషన్లు కోరుతున్నారు. 1) కంటి వెలుగు ప్రోగ్రామ్ క్రింద షామియానా, టేబుల్స్ మరియు చెయిర్స్ సరఫరా మరియు డెలివరీ కొటేషన్లు కోరుటకు ముగింపు తేది: 21-01-2023న సా.4.00 గం. వరకు. ఏవేని విచారణల కోసం సంప్రదించండి K. సుజాత, కమిషనర్, సత్తుపల్లి మున్సిపాలిటీ, సెల్ నం.8008801220, 9030613631, మెయిల్: npsathupalli@gmail.com/ npsathupalli2@gmail.com
సం/- కమిషనర్, సత్తుపల్లి మున్సిపాలిటీ, ఖమ్మం జిల్లా, T.S
DIPR RO No.11520-PP/CL/Advt/1/2022-23, Dt: 18-01-2023

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, రీజినల్ ఆఫీసర్ కార్యాలయం, రీజినల్ ఆఫీస్, PR, నల్గొండ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-proc T.N. No. PR/107, 113, 114, 120, 217 to 220, 225 to 230, 232, 234, 236 to 245 (3rd Call) 111 (4th Call) 251, 252, (2nd Call) 281/2022-23 తేది: 17.01.2023
పనుల సంఖ్య (31) సూపరింటెండింగ్ ఇంజినీర్, PR నల్గొండ పరిధిలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు మండలంలోని VT PWD రోడ్డు నుండి జానకీపురం వరకు R/F & BT రెన్యూవల్ మరియు ఇతర సివిల్ పనుల కోసం టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం E.C.V. రూ. 12452.88 లక్షలు. టెండర్ డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేదీలు:19.01.2023 నుండి 28.01.2023 వరకు. ప్రతి NIT/బిడ్ ప్రచురణ తేదీ నుండి (7) స్పష్టమైన పనిదినముల సమయం ఉంటుంది. తదుపరి వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే www.eprocurement.gov.in చూడవచ్చును.
DIPR RO No.3190-DP/CL/Advt/1/2022-23, Dt: 18.01.2023 సం/- రీజినల్ ఆఫీసర్, రీజినల్ ఆఫీస్, PR, నల్గొండ

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం
ఇమెయిల్: knrcmnr@rediffmail.com
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No.E1/DB/MCK/8201/130/MCK/2022-23 తేది: 18.01.2023
పట్టణ ప్రగతి మరియు సఫాయి మిత్ర సురక్షా ఛాలెంజ్ గిఫ్ట్ క్రింద రూ.732.24 లక్షల అంచనా వ్యయంతో 16 నం.ల అత్యవసర అభివృద్ధి పనులు మరియు ఎలక్ట్రికల్ పనులు మొదలైనవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 19.01.2023 సా.04.00 గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 31.01.2023 సా.04.00 గం. తదుపరి వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును.
సం/- కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్
DIPR RO No.11524-PP/CL/Advt/1/2022-23, Dt: 18.01.2023

తెలంగాణ ప్రభుత్వము
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
కార్యనిర్వాహక ఇంజనీర్, నీటి పారుదల విభాగం.6, ఐ.సి.2, కె.సి.క్యాంప్., హుజూరాబాద్-505498.
ఇరిగేషన్ విభాగం.6, హుజూరాబాద్ పరిధిలో (2) పనులకు టెండర్లు ఆహ్వానించడమైనది.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నం. మరియు తేది. 07/2022-23, తేది: 29-12-2022 (2వ పిలుపు), 08/2022-23, తేది: 18-01-2023 (1వ పిలుపు) (07/2022-23, తేది: 29-12-2022 SC/ST/VADDERA/SAGARA వర్గాలకు కేటాయించబడినది)., డివిజన్ పేరు: ఇరిగేషన్ డివిజన్ నం. 6 హుజూరాబాద్ పరిధిలోని (2) పనులకు, మొత్తం అంచనా విలువ లక్షలలో (ECV) రూ. 4.80 లక్షలు., టెండర్లు స్వీకరించు చివరి తేది మరియు సమయం తేది: 20-01-2023 మ. 03.00 నుండి తేది: 27-01-2023 మ. 03.00 గంటల వరకు. గమనిక: మిగతావివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.in. శ్రీ బి. శశి భూషణ్, బి.ఈ., కార్యనిర్వాహక ఇంజనీర్, ఇరిగేషన్ డివిజన్-6, కె.సి.క్యాంప్, హుజూరాబాద్
సం/-ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్ డివిజన్ నం.6, ఐ.సి.2 కె.సి క్యాంప్, హుజూరాబాద్, కరీంనగర్
DIPR RO.No.11527-PP/CL/Advt/1/2022-23, Dt: 18/01/2023

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, కరీంనగర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.490 to 502/SE/Tenders/2022/23 తేది : 16.01.2023
పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలలో మొత్తం పనుల సంఖ్య (13), MRR-FDR పనులు (8 నం.లు) మరియు ఇతర పనులు (5 పనులు). మొత్తం అంచనా వ్యయం : రూ.3745.37 లక్షలు. బిడ్ లభ్యత ప్రారంభ తేది : 19.01.2023. తదుపరి వివరాలను 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tenders.telangana.gov.in లో 19.01.2023 నుండి పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, కరీంనగర్
DIPR RO No.3188-DP/CL/Advt/1/2022-23, Dt: 18.01.2023

తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
3వ అంతస్తు, DM & HS క్యాంపస్, సుల్తాన్‌బజార్, కోఠి, హైదరాబాద్-95
ఫోన్ నం.040-40032888, ఇ-మెయిల్: tsmsidc.ce@gmail.com
Tender Notice No.26/TSMSIDC/Tech/2022-23, తేది:18.01.2023
దిగువ తెలిపిన పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి: (1) DH కామారెడ్డిలోని పాత TB బ్లాక్‌లో అదనపు ఫ్లోర్ (షెడ్‌తో 3వ అంతస్తు) మరియు అదనపు వార్డుల నిర్మాణం (2వ పిలుపు). (2) గాంధీ హాస్పిటల్, సికింద్రాబాద్‌లో శానిటేషన్ సిస్టమ్ పటిష్టపరచుట (3వ పిలుపు). (3) GMC నల్గొండకు అదనపు లెక్చర్ గ్యాలరీ & మౌలిక వసతుల నిర్మాణం (3వ పిలుపు). (4) MCH మెదక్. (5) MCH సూర్యాపేట. (6) DH మహబూబాబాద్. (7) MCH జగిత్యాల వద్ద DEIC బిల్డింగ్స్ యొక్క ఎస్టాబ్లిష్‌మెంట్. (8) గాంధీ మెడికల్ కాలేజి, సికింద్రాబాద్ వద్ద 4 నం.ల లిఫ్ట్‌లు నెలకొల్పుట (3వ పిలుపు). ఇతర వివరాలను మా వెబ్‌సైట్ http://www.tsmsidc.telangana.gov.in మరియు https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
DIPR Ro No.11563-PP/CL/Advt/1/2022-23, Dt:18.01.2023 సం/- మేనేజింగ్ డైరెక్టర్

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ : : పెద్దపల్లి జిల్లా
ఇమెయిల్ : ramagundamcorp@gmail.com
ఆసక్తి వ్యక్తీకరణ (ప్రకటన)
Lr.No.12/Non-SOR Items/RMC/2022-23 తేది : 17.01.2023
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో TKHH క్రింద చేపట్టిన అవెన్యూ మీడియన్ ప్లాంటేషన్‌కు నీటిని ఏర్పాటు చేయడానికి వాటర్ ట్యాంకర్‌తో పాటు ట్రాక్టర్ తయారీ మరియు సరఫరా పని నిర్వహించడానికి ఎస్టిమేట్స్ తయారీ కోసం NON-SOR ఐటమ్ రేట్స్ (కొన్ని పనుల ఐటమ్స్ రేట్లు షెడ్యూలులో లేవు) కోసం ఈ కార్యాలయం రేట్ కొటేషన్లు కోరుచున్నది. రేట్ కొటేషన్లతో పాటు ఆసక్తి వ్యక్తీకరణను అన్ని సంబంధిత డాక్యుమెంట్లతో పాటు క్లోజ్డ్ కవర్లో పెట్టి ద కమిషనర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, బస్టాండ్ సమీపాన, పెట్రోల్ బంక్ ప్రక్కన, గోదావరిఖని వారి చిరునామాకు 20.01.2023న 16:00 గం.కు లేదా అలోగా రిజిస్టర్డ్ పోస్ట్ విత్ అక్నాలెడ్జ్‌మెంట్ ద్వారా (RPAD) ద్వారా లేదా ఈ కార్యాలయం కౌంటర్ వద్ద దాఖలు చేయవలెను. తదుపరి వివరాలు ఈ కార్యాలయం వెబ్‌సైట్ చిరునామా https://ramagundamcorporation.telangana.gov.in లో కూడా లభిస్తాయి మరియు ఏవేని స్పష్టీకరణల కోసం కార్యాలయ పనివేళలలో సంప్రదించండి: ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సంప్రదించు నం. 9491054543 సం/- కమిషనర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No. 11510-PP/CL/Advt/1/2022-23, Dt: 18.01.2023

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీరాజ్
(గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం యొక్క సంస్థ)
రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030
NIRDPR
గ్రామీణాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలలో శిక్షణ మరియు పరిశోధన కోసం దేశంలోనే అత్యున్నత సంస్థ NIRDPR. NIRDPR విభాగమైన సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఇన్నోవేషన్స్ అండ్ అప్రాప్రియేట్ టెక్నాలజీస్ ఫర్ స్కిల్స్ అండ్ జాబ్స్ (CIAT&SJ) కాంట్రాక్టు ప్రాతిపదికన దిగువ తెలిపిన ఉద్యోగాల కోసం తగిన అభ్యర్థుల సేవలను పొందాలని ప్రతిపాదిస్తోంది.

క్ర. సం.	ఉద్యోగం పేరు	ఉద్యోగాల సంఖ్య	రెమ్యునరేషన్
1	యంగ్ ప్రొఫెషనల్ (అగ్రికల్చర్)	1	రూ.35,000/- నెలకు
2	జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)	1	రూ.55,000/- నెలకు
3	టెక్నికల్ అసోసియేట్	1	రూ.55,000/- నెలకు

జాబ్ ప్రొఫైల్, ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు మరియు ఇతర వివరాలకు దర్శించండి: http://career.nirdpr.in/
ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేది: 03/02/2023
Advt.No.58/2022
File No : NIRDPR/Admin /Section-I/2022-22
Comp.no.14821
సం/-
అసిస్టెంట్ డైరెక్టర్
అడ్మినిస్ట్రేషన్ (సెక్షన్-I)



క్లుప్తంగా...

అసెంబ్లీలో లంచం డబ్బు

కట్టలను సభలో ప్రదర్శించిన ఆప్ ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: ఒక కాంట్రాక్టర్ లంచం ఆశజూపి తన నోరు మూయించజూశారని ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే మొహిందర్ గోయల్ ఆరోపించారు. ఆ డబ్బు ఇదేనంటూ బుధవారం ఢిల్లీ అసెంబ్లీలో కరెన్సీ కట్టలను చూపించారు. ''ఓ ప్రభుత్వాస్పత్రికి సంబంధించి కొత్త కాంట్రాక్టర్ వచ్చాక 80 శాతం పాత కాంట్రాక్ట్ సిబ్బందిని తీసేసి లంచాలు తీసుకుని కొత్తవారిని నియమిస్తున్నాడు. దీనిపై నోరు మెదపకుండా ఉండేందుకు నాకు లంచం ఇవ్వబోయాడు. ఇది 2022 ఫిబ్రవరిలో జరిగింది. వెంటనే ఢిల్లీ పోలీసులకు, ఏసీబీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు'' అని ఆరోపించారు. ''నాకు వారి నుంచి ప్రాణ హాని ఉంది. కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్‌చేశారు. ఇది ఉన్నతస్థాయి కుట్ర అని ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తీవ్రమైన అంశమని స్పీకర్ రాంనివాస్ అన్నారు. ఇది నిజమే అయితే లంచమిచ్చేటపుడే రెడ్ హ్యాండెడ్‌గా ఎందుకు పట్టుకోలేదని బీజేపీ సభ్యులు ప్రశ్నించారు.

హిమాచల్‌లోకి జోడో యాత్ర

సిమ్లా: షెడ్యూల్లో లేనప్పటికీ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర బుధవారం హిమాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించింది. కాంగ్రా వద్ద సీఎం సుఖ్వీందర్ సుఖు తదితరులు యాత్రకు ఘన స్వాగతం పలికారు. మానవత్వం, శక్తిసామర్థ్యాల్లో హిమాచల్‌వాసులు పర్వతసమానులని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. రాష్ట్రంలో 18 కిలోమీటర్ల కొనసాగిన అనంతరం యాత్ర మళ్లీ పంజాబ్‌లోకి ప్రవేశించింది.

బీజేపీలోకి మన్‌ప్రీత్ బాదల్

న్యూఢిల్లీ: పంజాబ్‌లో కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నేత, పంజాబ్ మాజీ రాష్ట్ర ఆర్థిక మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ బుధవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 'అంతర్గత కుమ్ములాటలు, ఫ్యాక్షనిజంతో నిండిన కాంగ్రెస్‌లో ఉండలేను. మోదీ సర్కార్ హయాంలో దేశం ప్రపంచంలో దౌత్యపరంగా, ఆర్థికంగా ఎంతో పురోగమించింది' అని బీజేపీలో చేరాక బాదల్ వ్యాఖ్యానించారు. తన రాజీనామా లేఖను రాహుల్ గాంధీకి పంపించారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్ తమ్ముడి కుమారుడైన మన్‌ప్రీత్ బాదల్ తన పీపుల్స్ పార్టీ ఆఫ్ పంజాబ్‌ను కాంగ్రెస్‌లో కలిపేస్తూ ఏడేళ్ల క్రితం ఆ పార్టీలో చేరారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈయన గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఆయన పార్టీని వీడటంపై కాంగ్రెస్ స్పందించింది. 'పార్టీపై కమ్మిన మేఘాలు(బాదల్) తొలగిపోయాయి' అంటూ వ్యాఖ్యానించింది. అధికార దాహంతోనే ఆయన బీజేపీలో చేరారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.



జనాభాలో చైనాను దాటేశాం

డిసెంబర్ 31 నాటికే మన జనాభా 141.7 కోట్లు

చైనా జనాభా 141.2 కోట్లు: డబ్ల్యూపీఆర్ నివేదిక

న్యూఢిల్లీ: మరో మూడు నెలల తర్వాత జరుగుతుందనుకున్నది కొన్నాళ్ల క్రితమే జరిగిపోయిందా? జనాభాలో మనం చైనాను దాటేశామా? ప్రపంచంలోకెల్లా అత్యంత ఎక్కువ జనాభా ఉన్న దేశంగా అవతరించామా!! అవుననే అంటోంది వరల్డ్ పాపులేషన్ రివ్యూ (డబ్ల్యూపీఆర్) నివేదిక. గతేడాది చివరి నాటికే భారత జనాభా చైనా కంటే కనీసం 50 లక్షలు ఎక్కువని చెబుతోంది. 2022 డిసెంబర్ 31 నాటికి తమ జనాభా 141.2 కోట్లని చైనా మంగళవారం అధికారికంగా ప్రకటించడం తెలిసిందే. అదే రోజున భారత్ జనాభా 141.7 కోట్లకు చేరిందని డబ్ల్యూపీఆర్ అంచనా వేసింది. తాజాగా బుధవారం నాటికి 142.3 కోట్లకు ఎగబాకిందని చెప్పుకొచ్చింది. మాక్రోట్రెండ్స్ అనే మరో సంస్థ అంచనాల ప్రకారం బుధవారం నాటికి భారత జనాభా 142.8 కోట్లు. మన జనాభాలో 50 శాతానికి పైగా 30 ఏళ్లలోపు వయసువారే. కనుక దేశ జనాభా పెరుగుదల 2050 దాకా కొనసాగుతూనే ఉంటుందని భావిస్తున్నారు. 1961 తర్వాత తొలిసారిగా 2022లో తమ జనాభాలో తొలిసారిగా 8.5 లక్షల మేరకు తగ్గుదల నమోదైనట్టు చైనా మంగళవారం ప్రకటించడం తెలిసిందే. ఈ ధోరణి ఇలాగే కొనసాగి 2050 కల్లా ఆ దేశ జనాభా 131 కోట్లకు పరిమితం అవుతుందని అంచనా. ఆ సమయానికి భారత జనాభా 166 కోట్లకు పెరుగుతుందని భావిస్తున్నారు. పదేళ్లకోసారి జరిగే ఆనవాయితీ మేరకు మన దేశంలో 2020లో జరగాల్సిన జనాభా గణన కరోనా కారణంగా వాయిదా పడటం తెలిసిందే. దాంతో మన జనాభాపై అధికారికంగా తాజా గణాంకాలు అందుబాటులో లేవు.

పతనం అంచున పాక్

ప్రపంచదేశాల ముందు చేయి చాస్తున్న వైనం

- ఆర్థిక సాయం కోసం వివిధ దేశాలు, ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు
- 3,300 కోట్ల డాలర్ల రుణం లభిస్తే సంక్షోభం నుంచి బయటపడే ఛాన్స్
- భారత్‌తోనూ స్నేహసంబంధాల కోసం తహతహలాడుతున్న పాక్ ప్రధాని షరీఫ్



"భారత్‌తో మూడు యుద్ధాలు చేశాం. సాధించింది ఏమీ లేదు. దేశంలో మరింత విధ్వంసం జరిగింది. నిరుద్యోగం పేదరికం మీద పడ్డాయి. యుద్ధానికి కారణమైన కశ్మీర్ వంటి అంశాలపై భారత్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నాం"

"అణ్వాయుధాలు కలిగిన మన దేశం అన్నవస్త్రాల కోసం ప్రపంచ దేశాల ముందు దేహీ అంటూ చేయి చాపడం నిజంగా సిగ్గు చేటు. అంతర్జాతీయ సంస్థల్ని రుణాలు అడగాలన్నా ఇబ్బందిగా అనిపిస్తోంది. ఇలా ప్రపంచ దేశాలను భిక్షమడిగి దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించడం పరిష్కారం కాదు"

ఈ వ్యాఖ్యలు చేసినది ఎవరో కాదు. సాక్షాత్తూ పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్. రోజు రోజుకీ దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారి పోతూ ఉండడంతో మరో దారి లేక షరీఫ్ శాంతి మంత్రం జపిస్తున్నారు. భారత్‌తో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకుంటే ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కుతామన్న భావనలో పాక్ సర్కార్ ఉంది.

గోధుమల లారీని వెంబడించి..!

పాకిస్తాన్‌లో ప్రధాన ఆహారమైన గోధుమ పిండికి విపరీతమైన కొరత ఏర్పడింది. నిరుపేదలు గోధుమ పిండి కొనుక్కోవడానికి గంటల తరబడి దుకాణాల దగ్గర క్యూ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కరాచీలో ఒక గోధుమ పిండి లారీ వెళుతూ ఉంటే దాని వెనక ప్రజలు పరుగులు తీసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ ఒక్క వీడియో చాలు పాక్‌లో ఆహార సంక్షోభం ఏ స్థాయికి చేరుకుంటోందో చెప్పడానికి. బియ్యం, గోధుమలు, కూరగాయలు డిమాండ్‌కు తగ్గ సప్లయి కావడం లేదు. ఇరుగు పొరుగు దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలంటే డాలర్ నిల్వలు తరిగిపోతున్నాయి. కరాచీలో కేజీ గోధుమ పిండి రూ.160 ధర పలుకుతూ ఉండడంతో ప్రజలు కడుపు నింపుకోవడమెలాగ అని ఆందోళన చెందుతున్నారు. కొన్ని రెస్టారెంట్లలో ఒక భోజనం ఖరీదు ఏకంగా రూ.800కి చేరుకుంది. విద్యుత్ సంక్షోభంతో మార్కెట్లను, రెస్టారెంట్లను రాత్రి 8 గంటలకే మూసేస్తూ ఉండడంతో జనం కూడా చేసేదేమి లేక త్వరగా నిద్రపోతున్నారు. దీంతో పాక్‌లో చీకటి పడగానే విద్యుత్ వెలుగులు లేకకారు చీకట్లోకి దేశం వెళ్లిపోతోంది. పెట్రోల్ ధరలు చుక్కల్ని తాకుతున్నాయి. లీటర్ పెట్రోల్ రూ.200కి పైనే ఉండడంతో సామాన్యులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. మరోవైపు ప్రాణావసరమైన మందులకి కూడా కొరత ఏర్పడడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కరాచీలో ఇన్సులిన్ లభించకపోవడంతో మధుమేహ రోగులు నానా తంటాలు పడుతున్నారు. ఇక సైనికులకి రెండు పూటలా తిండి పెట్టే పరిస్థితి ప్రభుత్వానికి లేదు. దేశంలో టాప్‌లో ఉన్న 8 తయారీ సంస్థలు ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు లేక మూతపడ్డాయి. ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కడానికి వివిధ దేశాల్లో రాయబార కార్యాలయాలను కూడా పాక్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంతో ఆర్థిక సంక్షోభం పరాకాష్టకు చేరుకున్నట్టయింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

- పాకిస్తాన్ సెంట్రల్ బ్యాంకులో నిల్వలు నిండుకుంటున్నాయి. స్టేట్ బ్యాంకులో 420 కోట్ల డాలర్లే ఉన్నాయి. ఇవి 25 రోజుల దిగుమతి అవసరాలకు మాత్రమే సరిపోతాయి.
- విదేశీ మారక నిల్వలు 2022 జనవరిలో 1660 కోట్లు ఉంటే ఈ ఏడాది జనవరి నాటికి కాస్త 560 కోట్ల డాలర్లకి పడిపోయాయి.
- ఈ ఆర్థిక సంవత్సరం జనవరి –మార్చి మధ్య పాకిస్తాన్ 830 కోట్ల డాలర్ల విదేశీ అప్పులు తీర్చవలసి ఉంది.
- 2022–23లో జీడీపీలో 2.8% ఉన్న రక్షణ బడ్జెట్‌ను 2.2శాతానికి తగ్గించారు.
- 2022 ఆకస్మిక వరదలు 3.8 కోట్ల మందిని ప్రభావితం చేశాయి. దేశం విలవిలలాడింది.
- స్టేట్ బ్యాంకు ఆఫ్ పాకిస్తాన్ లెటర్ ఆఫ్ క్రెడిట్స్ ఇవ్వడానికి కూడా ఇష్టపడడం లేదు.
- వాణిజ్య లోటు ఒక్కసారిగా 57% పెరిగిపోయింది. అత్యవసర జాబితాలో లేని లగ్జరీ వస్తువులు 800కి పైగా రకాల వస్తువుల దిగుమతులపై నిషేధం విధించినప్పటికీ వాణిజ్య లోటు పెరిగిపోతూనే ఉంది. ప్రస్తుతం పాక్ వాణిజ్య లోటు 4.866 కోట్ల డాలర్లుగా ఉంది.

భారతే దిక్కా ..?

పాకిస్తాన్‌కు అండదండ అందించే చైనా ఈ సారి ఆ దేశాన్ని గట్టెక్కించే పరిస్థితులు కనిపించడం లేదు. పాకిస్తాన్ ప్రాంతంలో చైనా చేపట్టిన చైనా పాకిస్తాన్ ఎకానమిక్ కారిడార్ (సీపీఈసీ) ప్రాజెక్టుకు సంబంధించిన భద్రతా పరమైన ముప్పు కనిపిస్తోంది. ఇప్పటికే ఆ ప్రాజెక్టు కోసం వందల కోట్ల డాలర్లను వెచ్చించిన చైనా ఇంక ఆర్థికంగా ఆదుకుంటుందన్న నమ్మకం లేదు. యూఏఈ, సౌదీ అరేబియాలు ముస్లిం దేశాలు కావడంతో పాక్‌కు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చాయి. యూఏఈ 200 కోట్ల డాలర్ల సాయాన్ని చేయడానికి కూడా అంగీకరించింది. కరోనా విలయం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో అన్ని దేశాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ వంటి దేశాలు కూడా సాయం చేసే అవకాశాలు కనిపించడం లేదు. అందుకే భారత్‌తో బలమైన సంబంధాలు కలిగి ఉంటే ఈ సంక్షోభం నుంచి గట్టెక్కవచ్చునని పాక్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. మన దేశంతో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరిస్తే నిత్యావసరాలైన బియ్యం, గోధుమ పిండి, కూరగాయలు, మందులు వంటివి తీసుకురావడం అత్యంత సులభంగా మారుతుంది. వాఘా–అట్టారి, ఖోఖర్ పార్–మునాబావో సరిహద్దుల నుంచి నిత్యావసర సామగ్రి తరలించడం సులభతరంగా ఉంటుందని పాక్‌లో ఆర్థిక నిపుణులు ప్రభుత్వానికి హితవు పలుకుతున్నారు.

దక్షిణాసియాలో బలహీనమైన ఆర్థిక వ్యవస్థ

దక్షిణాసియాలో బలహీనమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం పాకిస్తానేనని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది ఆ దేశ వృద్ధి రేటు గతంలో వేసిన అంచనాల కంటే 2%' నెమ్మదిస్తుందని తెలిపింది. పాక్ ఆర్థిక వ్యవస్థ కారణంగా దక్షిణాసియా ప్రాంత పురోగతి రేటు కూడా తగ్గిపోతోందని పేర్కొంది. పాకిస్తాన్‌ను గత ఏడాది ముంచెత్తిన వరదలే ఈ పరిస్థితికి కారణమని విశ్లేషించింది. ఇప్పటికిప్పుడు పాకిస్తాన్‌కు 3,300 కోట్ల డాలర్లు రుణంగా వస్తే తప్ప ఆ దేశం ఈ సంక్షోభం నుంచి గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

విదేశీ మారకనిల్వలు: 560 కోట్ల డాలర్లు	డాలర్‌తో రూపాయి విలువ రూ.230	పాక్ వాణిజ్య లోటు : 4.866 కోట్ల డాలర్లు	ద్రవ్యోల్బణం రేటు : 19.9%	వరదల నష్టం : 4 వేల కోట్లు	కేజీ గోధుమ పిండి రూ.160

ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలి కన్నుమూత

పారిస్: ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా గుర్తింపుపొందిన ఫ్రాన్స్ దేశస్తురాలు లూసిలీ ర్యాండమ్(118) తుది శ్వాస విడిచారు. కోవిడ్‌ను జయించిన అత్యంత వృద్ధుల్లో ఒకరిగానూ చరిత్ర సృష్టించిన ఈమెను స్థానికులు సిస్టర్ ఆండ్రీగా పిలుస్తారు. 1904 ఫిబ్రవరి 11న దక్షిణ ఫ్రాన్స్‌లోని ఎలీస్ పట్టణంలో జన్మించిన ఈమె వృత్తిరీత్యా నర్సు. మంగళవారం టౌలూన్ పట్టణంలో ఈమె మరణించారని ఆమె తరఫు ప్రతినిధి వెల్లడించారు. 2021 జనవరిలో ఈమెకు కరోనా సోకింది. అయితే, పెద్దగా అనారోగ్య లక్షణాలేవీ కనిపించకపోవడం విశేషం. కోవిడ్‌ను జయించిన బామ్మగా ప్రాచుర్యం పొందారు. 'కష్టంగా భావించకుండా ఇష్టంగా పనిచేయడమే నా ఆరోగ్య రహస్యం. 108 ఏళ్ల వరకు నా పనులు నేనే చేసుకున్నా. రోజూ ఒక చాక్లెట్ తినడం, ఒక గ్లాస్ వైన్ తాగడం నా అలవాటు' అని ఆండ్రీ గతంలో చెప్పారు. ర్యాండమ్ మృతి తర్వాత స్పెయిన్‌లో నివసిస్తున్న 115 ఏళ్ల అమెరికన్ మరియా బ్రాన్‌యాస్ మొరేరా ప్రపంచంలో అత్యంత వృద్ధ వ్యక్తిగా రికార్డులకెక్కారు.


లూసిలీ ర్యాండమ్


బ్రాన్‌యాస్ మొరేరా

ఆటలపై చిన్న చూపుతో తీరని చేటు: మోదీ

బస్తీ (యూపీ): క్రీడలను అప్రాధాన్య అంశంగా చూడటం వల్ల చాలాకాలం పాటు మన దేశానికి తీరని నష్టం జరిగిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ''కొన్ని తరాల పాటు ఆటలను కాలక్షేప సాధనంగా భావించారు. దాంతో అవి అంత ముఖ్యమైనవి కావన్న భావన మనలో వేళ్లూనుకుపోయింది. కొంతకాలంగా ఈ వైఖరి మారుతోంది. క్రీడా రంగంలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు నిరంతర కృషి జరుగుతోంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు క్రీడలను కెరీర్‌గా ఎంచుకుంటుండటం అభినందనీయం'' అన్నారు. యూపీలోని బస్తీలో క్రీడా ప్రాంగణాన్ని ఆయన బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఫిట్‌గా ఉండేందుకు యోగా చేయాలని, చిరు ధాన్యాలను డైట్‌లో భాగం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు.

'వీసా వెయిటింగ్' తగ్గిస్తాం: అమెరికా

వాషింగ్టన్: అమెరికా వీసాల కోసం భారతీయులు వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నామని యూఎస్‌కౌన్సిలర్ అఫైర్స్ బ్యూరోలో వీసాల జారీ విభాగం ఉన్నతాధికారి జూలీ స్టఫ్ చెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ కూడా ఈ విషయంలో చొరవ తీసుకుంటున్నారన్నారు. ''గత అక్టోబర్‌లో బిజినెస్(బీ1), పర్యాటక(బీ2) వీసాల వెయిటింగ్ పీరియడ్ మూడేళ్లుంది! వీటిని తగ్గించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. కోవిడ్‌కు ముందునాటి సాధారణ స్థాయికి తేవడంపై దృష్టిసారించాం. హెచ్–1బీ, ఎల్1 వీసాల వెయిటింగ్ పీరియడ్‌ను 18 నెలల నుంచి 60 రోజులకు కుదించగలిగాం'' అని ఆమె చెప్పారు. ''ఇంటర్వ్యూతో పనిలేని సందర్భాల్లో వీసా రెన్యువల్‌కు వేచి ఉండాల్సిన పనిలేదు. ఇండియాతోపాటు జర్మనీ, థాయ్‌లాండ్‌లలోనూ భారతీయుల వీసా జారీ కోసం ఎంబసీలు, కాన్సులేట్‌లకు మరింత మంది సిబ్బందిని పంపుతున్నాం. వారాంతాల్లోనూ ఇంటర్వ్యూలు చేస్తున్నారు'' అని చెప్పారు.

ఉక్రెయిన్‌లో కుప్పకూలిన హెలికాప్టర్

అంతర్గత వ్యవహారాల మంత్రిసహా 18 మంది దుర్మరణం

బ్రోవరీ(ఉక్రెయిన్): హెలికాప్టర్ కూలిన దుర్ఘటనలో ఉక్రెయిన్ తన అంతర్గత వ్యవహారాల మంత్రిని కోల్పోయింది. బుధవారం ఉదయం రాజధాని కీవ్ సమీపంలోని బ్రోవరీ పట్టణంలో చిన్నారుల పాఠశాల ప్రాంగణంలో అత్యవసర విభాగ హెలికాప్టర్ కుప్పకూలింది. అందులో ప్రయాణిస్తున్న మంత్రి డెనిస్ మోనాస్టీర్‌స్కీ, సహాయమంత్రి హెనిన్, ఆ శాఖ కార్యదర్శిసహా తొమ్మిది మంది మరణించారు. హెలికాప్టర్ కూలడంతో ఆ ప్రాంతంలో ఉన్న మరో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. 15 మంది చిన్నారులుసహా 29 మంది గాయపడ్డారు. ఇది ప్రమాదమా, రష్యా పనా అనే దానిపై స్పష్టత లేదు. ఇది ఘోర దుర్ఘటన అని అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు.

ఈశాన్యాన ఎన్నికల నగారా

2023లో ఏడాది పొడవునా సాగనున్న అసెంబ్లీ ఎన్నికల జాతరకు ఈశాన్యాన నగారా మోగింది. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ ఎన్నికలకు బుధవారం షెడ్యూల్ రావడంతో రాజకీయ వేడి రాజుకుంది. ఈ మూడు ఈశాన్య రాష్ట్రాలూ బీజేపీ చేతిలోనే ఉండటం విశేషం! త్రిపురలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగా మిగతా రెండు రాష్ట్రాల్లో అధికార సంకీర్ణంలో మైనారిటీ భాగస్వామిగా ఉంది. 2024లో కీలకమైన లోక్‌సభ ఎన్నికలున్నందున ప్రతి అసెంబ్లీ ఎన్నికా పార్టీలన్నింటికీ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ఈ మూడు రాష్ట్రాల్లో ఎన్నికల పోరు హోరాహోరీగా సాగడం ఖాయంగా కన్పిస్తోంది. పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డనుండగా, పశ్చిమబెంగాల్ బయట పట్టు సాధించే యత్నాల్లో భాగంగా మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

మూడు రాష్ట్రాల ఎన్నికలకు షెడ్యూలు వచ్చేసింది

త్రిపురలో ఫిబ్రవరి 16న పోలింగ్ ● నాగాలాండ్, మేఘాలయల్లో 27న ● మార్చి 2న ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ: త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. త్రిపురలో ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయల్లో 27న పోలింగ్ జరగనుంది. మార్చి 2న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటాయి. జనవరి 31న నోటిఫికేషన్ రానుంది. ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ బుధవారం మీడియాకు ఈ మేరకు వెల్లడించారు. మార్చిలో పరీక్షలున్నందున ఫిబ్రవరిలోనే ఎన్నికల ప్రక్రియను ముగించాలని నిర్ణయించినట్టు వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై బీఎస్పీ అధినేత్రి మాయావతి అనుమానాలను ప్రస్తావించగా, గతంలో ఇలా ఆక్షేపించిన పలు పార్టీలు ఆ తర్వాత పలు ఎన్నికల్లో గెలిచాయని ఆయన గుర్తుచేశారు. వాతావరణం, భద్రత తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. లక్షద్వీప్ లోక్‌సభ స్థానంతో పాటు ఐదు రాష్ట్రాల్లోని ఆరు అసెంబ్లీ స్థానాలకు కూడా ఫిబ్రవరి 27నే ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో మహారాష్ట్రలో 2, అరుణాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, తమిళనాడుల్లో ఒక్కో అసెంబ్లీ స్థానం ఉన్నాయి. లక్షద్వీప్ ఎన్సీపీ ఎంపీ మొహమ్మద్ ఫైజల్ క్రిమినల్ కేసులో దోషిగా తేలి అనర్హతకు గురవడంతో ఆ స్థానం ఖాళీ అవడం తెలిసిందే. కాంగ్రెస్ ఎంపీ సంతోఖ్ సింగ్ మరణంతో పంజాబ్‌లోని జలంధర్ లోక్‌సభ స్థానం ఖాళీ అయినా లోక్‌సభ సచివాలయం నుంచి ఈసీకి అధికారికంగా సమాచారం అందలేదు. దాంతో అక్కడ ఉప ఎన్నిక జరగడం లేదు.




త్రిపుర



రాష్ట్రంలో పాతికేళ్ల వామపక్ష పాలనకు బీజేపీ ఎట్టకేలకు 2018లో తెర దించింది. మొత్తం 60 సీట్లకు గాను 33 స్థానాలు నెగ్గి అధికారంలోకి వచ్చింది. సీపీఎంను 15 సీట్లకు పరిమితం చేసింది. బీజేపీ మిత్రపక్షమైన గిరిజన పార్టీ ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) 4, కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ప్రస్తుతం 7 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బిప్లవ్ దేబ్ సీఎంగా పగ్గాలు చేపట్టారు. పేలవ పనితీరు కారణంగా 2022 మేలో ఆయన్ను తొలగించి డాక్టర్ మాణిక్ సాహాను బీజేపీ అధిష్టానం ముఖ్యమంత్రిని చేసింది. ఆయన కూడా రాష్ట్ర బీజేపీలో అసమ్మతి స్వరాలను శాంతింపజేసేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఐపీఎఫ్‌టీతోనూ బీజేపీకి ఉప్పూనిప్పుగానే ఉంది. పరిస్థితులను చక్కదిద్దేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవలే రాష్ట్రంలో పర్యటించారు. జన విశ్వాస్ యాత్రకు జెండా ఊపడం ద్వారా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మరోవైపు సీపీఎం గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జట్టుకట్టినా బీజేపీని నిలువరించలేకపోయింది. ఈసారి కూడా వాటి మధ్య పొత్తు పొడిచే అవకాశముంది. ఇక తృణమూల్ ఇక్కడ మాజీ కాంగ్రెస్ నాయకురాలు సుష్మితా దేవ్‌పైనే ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన గిరిజన నేత ప్రద్యుత్ మాణిక్యకు చెందిన తిప్రా మోథా పార్టీ గిరిజన స్థానాల్లో నిర్ణాయకం కాగలనని భావిస్తోంది. ఓ బీజేపీ ఎమ్మెల్యేతో పాటు పార్టీకి చెందిన పలువురు నాయకులు కూడా ఇందులో చేరడం విశేషం.

ప్రస్తుత బలాబలాలు	
అసెంబ్లీ స్థానాలు	60
బీజేపీ	33
ఐపీఎఫ్‌టీ	4
సీపీఎం	15
కాంగ్రెస్	1
ఖాళీలు	7

మేఘాలయ



మొత్తం 60 సీట్లకు గాను 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 21 స్థానాల్లో గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) 20, తృణమూల్ 9, యూడీపీ 8, బీజేపీ 2 సీట్లు గెలుచుకున్నాయి. ఎన్‌పీపీ, యూడీపీ, బీజేపీ కలయికతో మేఘాలయ డెమొక్రటిక్ అలయన్స్ (ఎండీఏ) పేరుతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. ఎన్‌పీపీ నేత కాన్రాడ్ సంగ్మా సీఎం అయ్యారు. అనంతరం డజను మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాజీ సీఎం ముకుల్ సంగ్మా ఎన్సీపీలో చేరడంతో అది ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది! ఎమ్మెల్యేల మూకుమ్మడి రాజీనామాలతో ప్రస్తుతం 18 అసెంబ్లీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు పలువురు ఎన్‌పీపీ ఎమ్మెల్యేలు ఇటీవల బీజేపీలో చేరడంతో అధికార సంకీర్ణంలోనూ లుకలుకలు బయల్దేరాయి! ఒక దశలో ఇకపై తాము ఒంటరిగానే పోటీ చేస్తామని సీఎం సంగ్మా ప్రకటించేదాకా వెళ్లింది! ఈసారి ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్నెస్ట్ మావ్రీ బుధవారం ప్రకటించారు. ఇలా రాష్ట్రంలో రాజకీయం కప్పల తక్కెడను తలపిస్తోంది. టీఎంసీ ఈసారి మరింత గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నారు.

ప్రస్తుత బలాబలాలు	
అసెంబ్లీ స్థానాలు	60
ఎన్‌పీపీ	20
యూడీపీ	8
టీఎంసీ	8
పీడీఎఫ్	2
బీజేపీ	2
ఎన్సీపీ	1
స్వతంత్రులు	1
ఖాళీలు	18

నాగాలాండ్



యునైటెడ్ డెమొక్రటిక్ అలయన్స్ (యూడీఏ) పేరుతో బీజేపీ, నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ), నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) సంకీర్ణ ప్రభుత్వం నడుస్తోంది. ఎన్‌డీపీపీ నేత నిఫ్యు రియో సీఎంగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో 26 సీట్లతో ఏకైక అతి పెద్ద పార్టీగా నిలిచిన ఎన్‌పీఎఫ్ కూడా సంకీర్ణంలో చేరడంతో రాష్ట్రంలో ప్రతిపక్షమనేది లేకుండా పోయింది! ఎన్‌డీపీపీ 18, బీజేపీ 12, ఎన్‌పీపీ 2 సీట్లు గెలుచుకున్నాయి. బీజేపీ ఈసారి 20 సీట్లలో పోటీ చేయాలని భావిస్తోంది.


ప్రస్తుత బలాబలాలు	
అసెంబ్లీ స్థానాలు	60
ఎన్‌డీపీపీ	41
బీజేపీ	12
ఎన్‌పీఎఫ్	4
స్వతంత్రులు	2
ఖాళీలు	1



రాష్ట్రం	పోలింగ్
నాగాలాండ్	ఫిబ్రవరి 27
మేఘాలయ	ఫిబ్రవరి 27
త్రిపుర	ఫిబ్రవరి 16

(ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి - మార్చి 2)

బీజేపీది రెండు నాల్కల వైఖరి: మమత



షిల్లాంగ్: రాష్ట్రాలకు చెల్లించాల్సిన నిధులు, ఇతరత్రా హామీలను ఎన్నికల వేళ ప్రధానంగా ప్రస్తావించే బీజేపీ ఆ తర్వాత మరోలా మాట్లాడుతుందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. మేఘాలయలోని ఉత్తర గారో హిల్స్ జిల్లాలో బుధవారం ఆమె భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ''బీజేపీకి రెండు ముఖాలుంటాయి. ఎన్నికల ముందు హామీలు గుప్పిస్తూ ఒక ముఖం మాట్లాడుతుంది. ఆ తర్వాత మరో ముఖం మరోలా మాట్లాడుతుంది. కాషాయ పార్టీ ఏలుబడిలోని రాష్ట్రాలకే కేంద్ర నిధులు దక్కుతాయి. ఇలాంటి పార్టీకి ఓటేయకండి'' అని పిలుపునిచ్చారు. అస్సాం, త్రిపురలతోపాటు మేఘాలయలోనూ పార్టీని పటిష్టంచేయడంపై మమత దృష్టిసారించారు. మేఘాలయలో 2021 నవంబర్‌లో కాంగ్రెస్‌లోని 17 మంది ఎమ్మెల్యేల్లో ఏకంగా 12 మంది టీఎంసీలో చేరడం విశేషం! గత డిసెంబర్‌లో రాష్ట్రంలో పర్యటించిన మమత.. స్థానిక మహిళలకు ఆర్థిక తోడ్పాటు కోసం ప్రత్యేక పథకాన్ని ప్రారంభించారు. ఈ కొద్దిరోజుల్లోనే 3.14 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు!



అంతరించిపోయే ప్రమాదమున్న అరుదైన కాషాయ రంగు గబ్బిలం ఇది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కంగేర్ లోయ జాతీయవనంలో ఇటీవల ఇది కనిపించిందని నేషనల్ పార్క్ డైరెక్టర్ చెప్పారు. కంగేర్ పార్క్‌లోని సున్నపురాయి గుహలు ఈ గబ్బిలాల ఆవాసానికి అనువైనవి.

సాక్షి కరీంనగర్

గురువారం । 19 । జనవరి । 2023



మధ్యాహ్న భోజనం.. రుచికరం

కరీంనగర్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో స్లాబ్ ధరలు పెంచుతూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. సన్న బియ్యం సరఫరా చేస్తోంది.

- 8లో ▸



వైభవంగా ఏకాదశి వేడుకలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. దాదాపు 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/16.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. చలి తీవ్రత కొనసాగు తుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేషనల్ కాన్ఫరెన్స్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 27, 28 తేదీల్లో జరుగనున్న 'పబ్లిక్ పాలసీస్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఇవాల్యుయేటింగ్ ఇంప్లిమెంటేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించనున్న నేషనల్ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఎస్‌యూ వీసీ మల్లేశ్ బుధవారం ఆవిష్కరించారు. అందరికీ ఉపయోగపడాలని క్వాలిటీ రీసెర్చ్ పేపర్స్ రాయాలని, చర్చ జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, రంగప్రసాద్, మనోహర్, హరికాంత్, అబ్రోలు బాకీ, తిరుపతి, నరేశ్, కృష్ణకుమార్, మనోజ్‌కుమార్, అనూష తదితరులు పాల్గొన్నారు.

పేదల సొమ్ముతో బీఆర్‌ఎస్ సభ

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



వరి నాటు వేస్తున్న ప్రవీణ్‌కుమార్

చొప్పదండి: ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ సభ పేదల సొమ్ముతో నిర్వహించారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బీఎస్పీ రాజ్యాధికార యాత్ర బుధవారం కొడిమ్యాల మండలంలో సాగింది. ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ, కేరళ, పంజాబ్ సీఎంలను పిలిచి, మీటింగ్ పెడితే ప్రజల కన్నీళ్లు ఆగవన్నారు. ధరణిని అడ్డుపెట్టుకొని, ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ కుమారుడు తోటి విద్యార్థిపై చేసిన దాడిని ఖండించారు. సంజయ్ తన కుమారుడిని వెనకేసుకొస్తున్నాడని, ఆయనకు పిల్లలను ఎలా పెంచాలో కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కొండగట్టు బస్సు ప్రమాద బాధితులను పరామర్శించారు. యాత్ర నాచుపల్లి, తుమ్మలపల్లి, శనివారంపేట, కోనాపూర్, సూరంపేట, కొడిమ్యాల గ్రామాల మీదుగా సాగింది. కార్యక్రమంలో నాయకులు చిర్ర శంకర్, నల్లాల శ్రీనివాస్, మాంకాళి తిరుపతి, మంద రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర రూ.8,190

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.8,190 పలికింది. బుధవారం మార్కెట్‌కు 51 వాహనాల్లో 570 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా వ్యాపారులు మోడల్ ధర రూ.8,150, కనిష్ఠ ధర రూ.7,500 చెల్లించారు. గన్నీ సంచుల్లో ఆరుగురు రైతులు 6 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,900, మోడల్ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.6,000కు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

రేపు జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళా

కరీంనగర్: జిల్లాస్థాయి టీఎల్ఎం మేళాను శుక్రవారం కరీంనగర్‌లోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్)తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా 16 మండలాల నుంచి 160 ఎగ్జిబిట్స్‌ను ఇందులో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

నూతన రోస్టర్ పాయింట్ల ప్రకారం బదిలీలు చేపట్టాలి

కరీంనగర్: నూతన రోస్టర్ పాయింట్ల ప్రకారం టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రాజేశ్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్కారు నూతన రోస్టర్ విధానం ప్రకటిస్తూ నోటిఫికేషన్ జారీ చేసి, ఆయా జిల్లాల కలెక్టర్లకు, విద్యాశాఖ అధికారులకు గతంలోనే పంపిందన్నారు. ఓపెన్ కేటగిరీలోని 15, 42, 67, 92 పాయింట్లను ఎస్టీలకు కేటాయిస్తూ మార్పులు చేసిందని తెలిపారు. ఈ విషయమై ఆయా జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్లు సమన్వయంతో జీవోను పరిశీలించి, ఎస్టీ ఉపాధ్యాయులకు పెంచిన 10 శాతం రిజర్వేషన్ ప్రకారం ప్రమోషన్లు వచ్చేలా చూడాలని కోరారు.



ప్రయాణికులతో నిండిపోయిన కరీంనగర్ బస్టాండ్



బస్టాండ్ ఎదుట ప్రైవేటు వాహనాల హడావుడి..



సీపీ బిల్డింగ్ వద్ద ట్రాఫిక్ జామ్

నగరం మొత్తం ట్రాఫిక్కే..

కరీంనగర్ జిల్లా కేంద్రం బుధవారం ట్రాఫిక్‌జామ్‌తో అతలాకుతలమైంది. ఒకవైపు బ్రహ్మోత్సవాల కోసం రోడ్లపై పనులు జరుగుతుండగా.. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. మరోవైపు పండుగ సెలవులు ముగియడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చారు. జిల్లా నుంచి 300 బస్సుల వరకు ఖమ్మం సభకు వెళ్లడంతో వందల సంఖ్యలో బస్టాండ్‌లో చిక్కుకుపోయారు. సందట్లో సడేమియాలాగా హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల వద్ద ప్రైవేటు వాహనాల దోపిడీ కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

48 బృందాలు.. 100 రోజులు..

- కంటి వెలుగుకు ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి శిబిరాల నిర్వహణ





ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్‌టౌన్: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో రెండో విడత కంటి వెలుగు నిర్వహణకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కంటి వెలుగు శిబిరాలు గురువారం నుంచి జిల్లాలో ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 313 గ్రామాల్లో 48 వైద్య బృందాలతో కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేయనున్నారు. క్యాంప్ నిర్వహణ ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇటీవలనే అన్ని పీహెచ్‌సీలకు పరికరాలు అందజేశారు.

7,93,857 మంది లబ్ధిదారులు

జిల్లాలో ప్రస్తుతం 18 ఏళ్ల పైబడిన వారు పట్టణ ప్రాంతాల్లో 5,79,599, గ్రామీణ ప్రాంతాలలో 2,14,258 మందిని గుర్తించారు. ప్రతి ఒక్కరినీ పరీక్షించేందుకు కార్యాచరణ రూపొందించారు. స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. శిబిరాల్లో అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించే బాధ్యతలను మున్సిపల్, పంచాయితీ, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. మరోవైపు శిబిరాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కంటి చూపు బాధితుల వివరాల నమోదు, అద్దాల పంపిణీలో కీలకంగా పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ట్యాబ్‌లు అందించి ఆధార్ కార్డు నమోదుపై రెండు రోజులుగా నమూనా సన్నద్ధత నిర్వహించారు.

గ్రామాల్లో 29.. పట్టణాల్లో 19..

జిల్లాలో కంటి పరీక్షలకు 48 బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో గ్రామాల్లో 29, పట్టణాల్లో 19 బృందాలు 100 రోజులపాటు పరీక్షలు నిర్వహించనున్నాయి. ఈ బృందాలకు అదనంగా 4, బఫర్ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ బృందంలో ఓ వైద్యాధికారి, ఒక ఆప్తోమెట్రిసియన్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఎన్‌ఎంలు, ఆశాలు, హెల్త్ సూపర్‌వైజర్ ఉంటారు. ఇప్పటికే వీరందరికీ శిక్షణ పూర్తిచేశారు. 48 బృందాలు పర్యవేక్షణ చేయడానికి 4 పారా మెడికల్ ఆప్థల్మిక్ ఆఫీసర్‌లను నియమించారు. ప్రతీ బృందానికి రెండు సిమ్ కార్డులు, రెండు ట్యాబ్‌లు, ఒక పవర్ బ్యాంక్ సమకూర్చారు. ఏ రోజుకు ఆ రోజే కంటి వెలుగు యాప్‌లో వివరాలు నమోదు చేయనున్నారు.

గుర్తింపు కార్డు, ఫోన్ నెంబర్ తప్పనిసరి

కంటి వెలుగు శిబిరాలకు వచ్చేవారు తప్పనిసరిగా ఓటరు, ఆధార్, రేషన్ కార్డుల్లో ఏదో ఒకటి వెంట తెచ్చుకోవాలి.

- ఫోన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి.
- 18 సంవత్సరాల పైబడిన వారందరూ శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవచ్చు.
- ప్రతీ శని, ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో శిబిరాలు ఉండవు.

శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలి

కంటివెలుగు శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో కంటివెలుగు కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. సిబ్బంది ఎవరైనా హాజరుకాకుంటే బఫర్ సిబ్బందిని ప్రోగ్రాం అధికారి సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కంటివెలుగు అబ్జర్వర్ డాక్టర్ రాజేశం మాట్లాడుతూ.. క్యాంపునకు వచ్చే వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించి వారికి కావలసిన సహకారం అందించాలని సూచించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో 100 రోజులపాటు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఐదు టేబుల్స్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తారని.. మొదటి టేబుల్ ద్వారా రిజిస్ట్రేషన్, రెండో టేబుల్ ద్వారా కంటి పరీక్ష, మూడో టేబుల్‌లో మెడికల్ ఆఫీసర్, ఏఎన్‌ఎం సిబ్బంది బీపీ, ఇతర మెడికల్ హిస్టరీ పరీక్షలు నిర్వహిస్తారని, నాలుగో టేబుల్ ద్వారా ఆటో రిఫ్రాక్టర్ మెషిన్ ద్వారా ఆప్తోమెట్రిస్ట్ కళ్ల పరీక్ష నిర్వహిస్తారని, ఐదో టేబుల్ వద్ద అవసరమైన వారికి రీడింగ్ గ్లాసెస్ ఇస్తారని, వెంటనే యాప్‌లో డేటా యాప్‌లో అప్‌డేట్ చేస్తారని తెలిపారు. ఇప్పటికి 44,700 రీడింగ్ గ్లాసెస్ జిల్లాకు చేరుకున్నాయని.. వాటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించామని చెప్పారు.

- గ్రామాల్లో ప్రతిరోజూ 300 మందికి, పట్టణాల్లో 400 మందికి నిర్ధారణ పరీక్షలు చేస్తారు.
- దగ్గర చూపు, దూరపుచూపు సమస్య ఉన్న వారికి శిబిరాల్లోనే కళ్లద్దాలు అందిస్తారు. ఇతరత్రా కంటి సమస్యలతో బాధపడే వారికి మందులు అందిస్తారు.

తమిళనాడులోనూ దళితబంధు!



లబ్ధిదారుడితో కలెక్టర్ కర్ణన్ (ఫైల్)

- రాష్ట్ర దళిత పథకాల అధ్యయనానికి తమిళనాడు బృందం
- ఎస్సీ సబ్ ప్లాన్, మూడెకరాల భూ పంపిణీ, దళితబంధు పరిశీలన
- మూడురోజులపాటు కరీంనగర్‌లో బృందం పర్యటన
- హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండిలో లబ్ధిదారులతో సమావేశాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో అమలవుతున్న దళిత సంక్షేమ కార్యక్రమాల అధ్యయనానికి తమిళనాడు నుంచి ప్రత్యేక బృందం రానుంది. మూడురోజులపాటు రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో పర్యటించే ఈ బృందం వివిధ పథకాలు అమలవుతున్న తీరును స్వయంగా పరిశీలించనుంది. బుధవారం సాయంత్రం రాష్ట్రానికి చేరుకుంది. ఈ బృందంలో మొత్తం ఆరుగురు సభ్యులు. వీరిలో ఎమ్మెల్యే సింథనై సెల్వాన్ (కట్టు మర్నార్ కోయిల్ నియోజకవర్గం), ఎమ్మెల్యే ఎస్ఎస్ బాలాజీ (త్రిపురూర్ నియోజవర్గం), అలాగే రిచర్డ్ దేవ్‌దాస్, మురుగప్పన్, కుమార్, రమేశ్ అనే నలుగురు ఎన్జీవోల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ వారి రాష్ట్రంలో దళితుల కోసం అమలు చేయనున్న పలు పథకాల కోసం ముందుగా.. తెలంగాణలో అమలవుతున్న దళిత సంక్షేమ పథకాలను పరిశీలించనున్నారు. ఆయా పథకాల వల్ల దళితుల స్థితిగతుల్లో వచ్చిన మార్పులు, సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేయనున్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో తమిళనాడు బృందం కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి, కరీంనగర్, జమ్మికుంట, హుజూరాబాద్‌లో పర్యటించనుంది. తొలుత కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌తో భేటీ కానుంది. అనంతరం జిల్లాలో దళితులకు మూడెకరాల చొప్పున పంపిణీ చేసిన భూమిని పరిశీలిస్తారు. తరువాత లబ్ధిదారులతో మాట్లాడతారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం వాటి విడుదల తరువాత దళితులవాడల్లో వచ్చిన మార్పులు, దళితబంధు పథకం అమలు, యూనిట్ల పరిశీలన, మారిన స్థితిగతులపై లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పరిశీలించి అధ్యయనం చేయనున్నారు.

తమిళనాడులోనూ దళితబంధు..?

రాష్ట్రంలో 2021 ఆగస్టు 16వ తేదీన హుజూరాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రకటించిన దళితబంధు పథకంపై తమిళనాడు బృందం ప్రత్యేక ఆసక్తి కనబరుస్తోంది. రూ.10 లక్షల ఆర్థిక సాయం, వారికి ప్రభుత్వ భరోసా, బీమా, యూనిట్ల మంజూరు, అధికారుల పాత్ర, బ్యాంకుల ప్రమేయం, డేటా సేకరణ, లబ్ధిదారుల సర్వే- గుర్తింపు, సాఫ్ట్‌వేర్ రూపకల్పన, యాప్ ద్వారా యూనిట్ల మంజూరు, పారదర్శకంగా నిధుల మంజూరు తదితర విషయాలపై ఈ బృందం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలో దళితుల సంక్షేమానికి, జీవనోపాధికి దళితబంధును పోలిన పథకాన్ని అమలు చేయనున్నారు. అందుకే.. వీరు హుజూరాబాద్ నియోజకవర్గంలో అమలవుతున్న పథకాన్ని, యూనిట్ల ద్వారా పారిశ్రామికవేత్తలుగా మారిన లబ్ధిదారులను స్వయంగా కలవనున్నారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ కూడా తమిళుడే కావడంతో వచ్చే బృందానికి పథకాలను సమగ్రంగా వివరించే బాధ్యతను కలెక్టర్ స్వయంగా తీసుకున్నారు.

త్వరలో కలెక్టర్‌కు కీలక బాధ్యతలు

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో సీఎం తలపెట్టిన దళితబంధు పథకం అమలును వేగవంతంగా పూర్తి చేసిన కలెక్టర్ కర్ణన్‌కు త్వరలోనే కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దళితబంధు పైలెట్ ప్రాజెక్టును వేగంగా అమలు చేసినందుకు ఆయనకు త్వరలోనే సీఎం పేషీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారని తెలిసింది. ఏడాదిన్నరలో మొత్తం 18,021 దళిత కుటుంబాలకు యూనిట్లను పంపిణీ చేశారు. ఇందులో 8,851 వాహనాలు, 3,810 సేవారంగం, 2,624 రిటైల్, 409 మానుఫ్యాక్చరింగ్, 2,327 డెయిరీ యూనిట్లు ఉన్నాయి. పథకాన్ని వేగంగా పూర్తి చేసినందుకు ఈయనకు సీఎం మరో బాధ్యతలు అప్పజెప్పనున్నారు. ప్రస్తుతం సీఎం పేషీలో సెక్రటరీగా ఉన్న ఉన్న మరో సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జాతో కలిసి రాష్ట్రస్థాయిలో దళితబంధు పథకం, విస్తరణ, పర్యవేక్షణ మరింత వేగంగా అమలు పరిచే బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

కర్షకులకు కిసాన్ కార్డులు

- భూ విస్తీర్ణాన్ని బట్టి బ్యాంకు రుణం
- విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల కొనుగోలుకు సాయం
- పావలా వడ్డీకే రుణాలు మంజూరు
- రైతులకు బహుళ ప్రయోజనం

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా పథకాలు తీసుకొస్తే కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి వంటి అనేక సంక్షేమ పథకాలు రైతుల ప్రయోజనార్థం ప్రవేశపెట్టాయి. ఈ పథకాలకు కర్షకులకు ఆర్థిక భరోసాతోపాటు పంటలు పండించేందుకు తోడ్పాటునందిస్తున్నాయి. సాగు కోసం సన్న, చిన్నకారు రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేస్తూ అవి తీర్చడానికి ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. అటువంటి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం వినియోగంలోకి వచ్చి రెండేళ్లు దాటినా జిల్లాలో పూర్తిస్థాయిలో రైతులు పొందలేకపోయారు. ప్రస్తుతం జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డు పొందలేదని రైతులు ముందుకు వస్తున్నారు. దీనిపై దృష్టిసారించిన జిల్లా యంత్రాంగం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టింది.

జిల్లాలో లక్ష మందికి క్రెడిట్ కార్డు

బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు వారి స్వల్పకాలిక ఉత్పత్తులను సాధించడం కోసం అవసరమయ్యే పనిముట్లు, తదితర అవసరాలకు కావాల్సిన మొత్తాన్ని సరైన సమయాల్లో అందించడమే కిసాన్ క్రెడిట్ కార్డు ముఖ్య ఉద్దేశం. జిల్లాలో 1.40 లక్షల మంది రైతులున్నారు. సుమారు లక్ష మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయి. మిగతా 40 వేల మంది రైతులు కూడా కిసాన్ క్రెడిట్ కార్డు పొంది వినియోగించుకోవాలని బ్యాంకర్లు కోరుతున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ఉంటే భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వం రూపే కార్డులను అందించే అవకాశాలున్నాయి. దీంతో అదనంగా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం పొందడమే కాకుండా కార్డుతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయ పనిముట్లు, పరికరాలు, తదితర కొనుగోలు చేయడానికి వీలుంటుంది. తీసుకున్న రుణం 45 రోజుల్లోపు చెల్లిస్తే వడ్డీ కూడా తీసుకోరని, కార్డు ఉన్నవాళ్లందరికీ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన అమలు చేసే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.

క్రెడిట్ కార్డుతో ప్రయోజనాలు

రైతులు సాగు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్రం కిసాన్ క్రెడిట్ కార్డు పథకం ప్రవేశపెట్టింది. పీఎం కిసాన్ స్కీమ్ కింద



ప్రయోజనం పొందే ప్రతీ రైతుకు ఈ కార్డు ఇవ్వాలని కేంద్రం యోచిస్తోంది. వ్యవసాయ భూమి ఉండి 18 నుంచి 70 ఏళ్లలోపు వయస్సు ఉన్న రైతులు ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులను సంప్రదించి కార్డు పొందే అవకాశముంది. కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న రైతులు ఎలాంటి తనఖా లేకుండానే రూ.1.60 లక్షల వరకు రుణం పొందే అవకాశాలు ఉన్నాయి. ఈ స్కీమ్ కింద అర్హులైన రైతులకు 4 శాతం వడ్డీకే రుణాలు అందజేస్తారు. మొత్తం పావలా వడ్డీ పడుతుంది. అయితే తీసుకున్న రుణం తిరిగి గడువులోగా చెల్లిస్తే అప్పుడు రైతులకు 4 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయి. లేదంటే 7 శాతం వడ్డీ పడుతుంది. రైతులు గతంలో తీసుకున్న రుణం సకాలంలో చెల్లిస్తే మళ్లీ రుణం మంజూరు చేస్తారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రుణాలు ఇస్తారు.

జిల్లాలో సాగు విస్తీర్ణం 3.30 లక్షల ఎకరాలు
ధరణిలో నమోదైన రైతులు 1,72,877
పీఎం కిసాన్ సాయం పొందిన రైతులు 1,64,197
సన్న, చిన్నకారు రైతులు 1,40,018
సెమీ, మీడియం 15,404
పెద్ద రైతులు 219

కిసాన్ క్రెడిట్ కార్డుతో లాభాలు

సరళీకృతమైన రుణాల పంపిణీ విధానం, డబ్బు గురించి రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. ప్రతీ పంటకు రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎరువులు, విత్తనాలు రైతులకు ఇష్టమొచ్చినప్పుడు ఎంచుకున్న వాటినే కొనుగోలు చేసే వెసులుబాటు.
- మూడేళ్లపాటు రుణం సౌకర్యం, వ్యవసాయ ఆదాయాన్ని బట్టి గరిష్ఠ రుణపరిమితితో పాటు పంటకోత అయ్యాకే రుణాన్ని తిరిగి చెల్లించే సదుపాయం ఉంది.
- వ్యవసాయ అడ్వాన్సుకు వర్తించే వడ్డీ రేటే దీనికి వర్తిస్తుంది.

దరఖాస్తు చేసే విధానం

జాతీయ బ్యాంకులో కిసాన్ క్రెడిట్ కార్డు కోసం రైతు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా www.pmkisan.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని దానిని పూర్తి చేయాలి. పూర్తి చేసిన దరఖాస్తుతోపాటు చిరునామా, ఇతర గుర్తింపు కార్డు నకళ్లను బ్యాంకు అధికారులకు అందజేయాలి.
- ఇందుకోసం పంట రుణం పొందే బ్యాంకు పాసుపుస్తకం/పీఎం కిసాన్ డబ్బులు పడిన పాస్‌బుక్, వ్యవసాయ భూమి పాసుపుస్తకం, ఆధార్ కార్డు తప్పనిసరి.
- సమీప పబ్లిక్ సెక్టార్ బ్యాంకు నుంచి కూడా కార్డు పొందవచ్చు.
- అర్హత గల ప్రతీ రైతుకు కిసాన్ క్రెడిట్ కార్డు అందజేస్తారు.

క్లుప్తంగా

కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులు పరిశీలన

కరీంనగర్: కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్అండ్బీ అధికారులతో కలిసి అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్స్‌ను తొలగించి విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఎస్ఈ గంగాధర్, డీఈ రాజన్, ఆర్అండ్బీ ఈఈ సాంబశివరావు, డీఈ రవీందర్, ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడిలో గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి


సునీత (ఫైల్)

మంథని: మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తన్నీరు సునీత(37) పాఠశాలలో బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. ఫిజికల్ సైన్స్ బోధించే సునీత పాఠశాలలోని కార్యాలయగదిలో తోటి ఉపాధ్యాయులతో కలిసి కుర్చీలో కూర్చుంది. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అపస్మారకస్థితికి వెళ్లిపోయింది. తోటిసిబ్బంది పరీక్షించి వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరీక్షించగా.. అప్పటికే చనిపోయిందని తెలిపారు. అప్పటివరకు తమతో ఉన్న ఉపాధ్యాయురాలు ఒక్కక్షణంలో చనిపోవడాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోతున్నారు. సునీతది మంచిర్యాల జిల్లాకేంద్రంలోని గౌతమేశ్వర కాలనీ. ఈమె భర్త కూడా అంతర్గాం మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

ఒకరి ఆత్మహత్య

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపరపల్లె గ్రామానికి చెందిన కాశవేని కొమురయ్య(50) మానసికస్థితి సరిగా లేక పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. ఎప్పటిలాగే బుధవారం వ్యవసాయ పనులకు వెళ్లిన కొమురయ్య పొలంవద్ద పురుగులమందు తాగి పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే చికిత్సకోసం సుల్తానాబాద్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. కొమురయ్య భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి కారు బోల్తా


ధ్వంసమైన కారు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సెయింట్ మేరీస్ పాఠశాల వద్ద, రాజీవ్‌రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై ఉపేందర్‌రావు వివరాల ప్రకారం.. ఎన్టీపీసీకి చెందిన డ్రైవర్ శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, ఇందిరా, అయాన్స్ పనినిమిత్తం కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఎన్టీపీసీకి వస్తున్న క్రమంలో అదుపుతప్పి పక్కన ఉన్న సిమెంట్ దిమ్మలను ఢీకొట్టింది. కారు బోల్తాపడగా డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మిగితావారు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్సై వివరించారు.

మధ్యాహ్న భోజనం.. ఇక రుచికరం


పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- భోజన పథకంలో స్లాబ్ ధరలు పెంచిన సర్కారు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2,03,004 మంది విద్యార్థులకు ప్రయోజనం

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇకనుంచి రుచికర భోజనం అందనుంది. ప్రస్తుతం అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో స్లాబ్ ధరలు పెంచుతూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాల ధరల కారణంగా వంట నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేకపోతున్నారు. రోజురోజుకూ రేట్లు అధికమవుతుండటంతో భోజనం తయారీపై వంట ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన సర్కారు ధరలు పెంచింది. మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన సన్న బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. కూరగాయలు, కోడిగుడ్లను మాత్రం వంట ఏజెన్సీల నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మెనూ ప్రకారం పాఠశాలలు పనిచేసే వారానికి ఆరు రోజుల్లో మూడు రోజులపాటు గుడ్డు ఇవ్వాల్సి ఉంటుంది. రోజు పప్పు, ఒక కూర తప్పనిసరిగా ఉండాలి. గుడ్డు ధర పెరగడం నిర్వాహకులకు భారంగా మారింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో మధ్యాహ్న భోజన పథకం పటిష్టం కానుంది. పోషకాలతో కూడిన రుచికర భోజనం విద్యార్థులకు అందనుంది.

అక్టోబరు 2022 నుంచి అమలు..

మధ్యాహ్న భోజన పథకం ధరలు పెంచుతూ ఈ నెల 12న ఉత్తర్వులు జారీ అయినప్పటికీ 2022 అక్టోబర్ 1 నుంచి వాటిని అమలు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. వంట ఏజెన్సీలు అక్టోబర్, నవంబరు, డిసెంబర్ నెలలకు సంబంధించిన బిల్లులు గతంలోనే సమర్పించినప్పటికీ.. పెంచిన ధరల ప్రకారం మళ్లీ అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 2,03,004 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలు, విద్యార్థులు, కుకింగ్ కం హెల్పర్లు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	హెల్పర్లు
కరీంనగర్	662	49,754	1,134
జగిత్యాల	781	71,909	1,564
పెద్దపల్లి	545	38,428	1,123
రాజన్నసిరిసిల్ల	496	42,913	863

పెరిగిన ధరలు (ఒక్కో విద్యార్థికి రూ.లలో)...

తరగతి	గతంలో	ప్రస్తుతం
1–5	4.97	5.46
6–8	7.45	8.17
9–10	9.95	10.67

ఉత్తర్వులు అందాయి



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా ధరలు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. వంట ఏజెన్సీలు మెనూ ప్రకారం భోజనం అందించాలి. ధరల పెంపుతో విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందుతుంది. భోజనం తయారీలో నాణ్యతను నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

– సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

సీఎం కేసీఆర్‌వి అనాలోచిత నిర్ణయాలు

- హామీలను విస్మరించి, బీఆర్‌ఎస్ అంటూ కొత్త నాటకం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

హుజూరాబాద్: సీఎం కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ ప్రజలు ఆగమవుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని శక్తి ఇన్‌చార్జి, పోలింగ్ బూత్ కమిటీల సమావేశం హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సరిగ్గా ఏడాది మాత్రమే ఉందని, బీజేపీ సత్తా చాటాలన్నారు. శక్తి కేంద్రాల వారీగా త్వరలో కార్యక్రమాలు జరుగుతాయని, అయా కేంద్రాల యూనిట్‌గా కార్నర్ మీటింగ్‌లు ఉంటాయని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఆగమైందని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. రైతులకు రుణమాఫీ, ఉచిత ఎరువులు, నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, కేజీ టు పీజీ, దళితులకు మూడెకరాల భూమి, అసెంబ్లీ నియోజకవర్గానికి వంద పడకల ఆసుపత్రి, జిల్లాకో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి వంటి అనేక హామీలు ఇచ్చి, విస్మరించారని మండిపడ్డారు. వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే బీఆర్‌ఎస్ అంటూ కొత్త నాటకం మొదలు పెట్టారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, అధికార ప్రతినిధులు మాసాడి ముత్యంరావు, జెల్ల సుధాకర్, తుమ్మ శోభన్‌బాబు, ప్రభారి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పుప్పాల రఘు, బీజేపీ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, మండల అధ్యక్షుడు రాముల కుమార్, నాయకులు జీడీ మల్లేశ్, సంపెల్లి సంపత్‌రావు, రామిడి ఆదిరెడ్డి, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

వైద్యసేవల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు కీలకం

- జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ


అధ్యక్షుడు రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

తిమ్మాపూర్(మానకొండూర్): గ్రామీణులకు వైద్య సేవలందించడంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు కీలకమని జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడు కాసం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నమనేని నర్సింహ రాజు, కోశాధికారి యాదగిరి సంపత్, ఇతర కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం అలుగునూర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీ, పీఎంపీలు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తారని, వారిపై ప్రజలకు నమ్మకం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. అందరూ ఐక్యంగా ఉంటే ప్రభుత్వ గుర్తింపునకు తనవంతు సహకారం అందిస్తానని, జిల్లాలో అసోసియేషన్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి బెజ్జంకి రవీందర్, జోనల్ అధ్యక్షులు దొంతుల మనోహర్, మిట్టపల్లి రాజమౌళి, కంకనాల ప్రభాకర్ రెడ్డి, కుసుమ శంకర్, కొల్ల సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన టీచర్ల అప్పీళ్లను పరిష్కరించాలి

కరీంనగర్: విద్యాశాఖలో పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదలకు ముందే జీవో 317 ద్వారా నూతన జిల్లాలకు కేటాయించబడి, నష్టపోయిన టీచర్ల అప్పీళ్లను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, సమన్వయకర్త మహమ్మద్ ఫయాజ్ అలీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం కేటాయింపు జరగక ఉద్యోగులు నష్టపోయారన్నారు. బాధితులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు చెప్పినా బేఖాతరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాభర్తల కేటగిరీ టీచర్లు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- వృద్ధుడికి తీవ్ర గాయాలు


గాయపడిన ఎల్లయ్య


చెట్టును ఢీకొని ఆగిపోయిన కారు

మానకొండూరు: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లికి చెందిన ఆరెల్లి ఎల్లయ్య బుధవారం ఖాదర్‌గూడెం శివారులో ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి, ఢీకొట్టింది. అనంతరం చెట్టును ఢీకొని, ఆగిపోయింది. ప్రమాదంలో ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి, బాధితుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డబ్బుల వివాదం.. వ్యక్తి కిడ్నాప్


రాజయ్య

మెట్‌పల్లి(కోరుట్ల): డబ్బుల వివాదంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన మెట్‌పల్లి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కోట రాజయ్యకు అదే కాలనీకి చెందిన ద్యావనమైన ఎల్లమ్మ కుటుంబానికి మధ్య డబ్బుల విషయమై కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత మంగళవారం ఎల్లమ్మ.. సమ్మయ్య, కోట దుర్గయ్య, ఇస్తారిలతో కలిసి రాజయ్య ఇంటికి వెళ్లింది. అందరూ కలిసి రాజయ్య, అతని భార్య రామక్కలపై దాడి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేశారు. అనంతరం రాజయ్యను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించుకొని, వెళ్లిపోయారు. తన భర్తను ఎక్కడికో తీసుకుపోయారని రామక్క బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ పేర్కొన్నారు.

సీఎం కుటుంబసభ్యులే నేరచరితులు

- హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి


మాట్లాడుతున్న శ్రీరాం చక్రవర్తి

సైదాపూర్(హుస్నాబాద్): రాష్ట్రాన్ని పాలించే సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులే నేరచరిత్ర కలిగి ఉన్నారని ఉమ్మడి ఏపీ హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్, బీజేపీ నాయకుడు బొమ్మ శ్రీరాం చక్రవర్తి విమర్శించారు. బుధవారం సైదాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ కేసులో మంత్రి కేటీఆర్, లిక్కర్ కేసులో కవిత ఉన్నారని ఆరోపించారు. టెస్టుకు రావాలని తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఎన్నిసార్లు సవాల్ విసిరినా రాలేదన్నారు. మచ్చలేని నాయకుడిగా రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్న ఆయన కుమారుడిపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. కొట్లాడుకున్న విద్యార్థులు ఇప్పుడు తాము కలిసే ఉన్నామని, పాత వీడియోలు వైరల్ చేస్తున్నారని చెబుతున్నారని పేర్కొన్నారు. సంజయ్‌కుమార్ ఎదిగిన తీరు, ఆయన కుటుంబ చరిత్ర జిల్లా ప్రజలకు తెలుసని అన్నారు. అసత్య ప్రచారాలతో ప్రజల్లో పలుచనైపోతారని, అధికార పార్టీ నాయకులు వాస్తవాలు మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. అనంతరం రాములపల్లిలో వెన్కెపల్లి సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి తండ్రి మాధవరెడ్డి మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. పెరుకపల్లి ఎంపీటీసీ సభ్యుడు జెల్ల మల్లేశ్, నాయకులు మునిగంటి సంతోష్, కొండ మల్లయ్య, కత్తుల నివాస్, తిరుపతి, రాహుల్, రాజమౌళి తదితరులున్నారు.

బీసీలను కులాల వారీగా లెక్కించండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

కరీంనగర్: దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా లెక్కల్లో బీసీలను కులాల వారీగా లెక్కించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఫిబ్రవరి 6, 7, 8వ తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన ‘హలో బీసీ–చలో ఢిల్లీ’ కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రం బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. బీసీ కులాల లెక్కలు లేకపోవడం వల్ల దేశంలో 52 శాతం ఉన్న బీసీ కులాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సామాజికంగా, రాజకీయంగా విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నాయకులు అజయ్, సంపత్, వేణు, అశ్విన్, రాజు, శ్రీనివాస్, చంద్రమౌళి, కోటేశ్వర్, ఓదెలు, మధు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి

- డీపీవో వీరబుచ్చయ్య
- జీపీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ


మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

కరీంనగర్‌రూరల్: అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని జీపీ కార్యదర్శులను డీపీవో వీరబుచ్చయ్య ఆదేశించారు. బుధవారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో కరీంనగర్, కొత్తపల్లి, తిమ్మాపూర్, చొప్పదండి, మానకొండూరు మండలాలకు చెందిన కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. జీపీ కార్యదర్శులు గ్రామాలకు సంబంధించిన సమగ్ర సమాచారం కోసం ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ, మండలస్థాయి అధికారులతో వాట్సప్ గ్రూప్ తయారు చేయాలని సూచించారు. అనంతరం శిక్షకుడు సురేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సూచించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 9 ప్రధాన లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. ప్రతీ ఆర్థిక సంవత్సరంలో రెండు ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పంచాయతీ నిధుల వినియోగం, ఆదాయ, వ్యయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో హరికిషన్, ఎంపీడీవో జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి నీటిని రక్షించాలి

- ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేశ్
- ఎస్సారార్‌లో జాతీయ సెమినార్ ప్రారంభం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ మల్లేశ్

శాతవాహన యూనివర్సిటీ(కరీంనగర్): ప్రాణకోటి మనుగడకు నీరే జీవనాధారమని, దాన్ని కాలుష్యం నుంచి రక్షించుకోవాలని ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేశ్ అన్నారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో హైడ్రో బయాలజీలో అవకాశాలు–పరిశోధనలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. జీవపరిణామం, మానవ నాగరికత అంతా నదులు, సరస్సుల తీరాల వెంట విలసిల్లిందని తెలిపారు. భూమి మీద మూడొంతుల నీరు, ఒక భాగం భూమి ఉందని, నీటిపై పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఆచార్య లక్ష్మణ్, సెమినార్ కన్వీనర్ మహేశ్, పి.రాజు, సీహెచ్.తిరుపతి, బి.సురేష్‌కుమార్, ప్రొఫెసర్ వెంకయ్య, ప్రొఫెసర్ ఇస్తారి, డాక్టర్ ఎ.శ్రీనివాస్, డాక్టర్ పి.ముత్తన్న, డాక్టర్ జి.కిశోర్ కుమార్, డాక్టర్ టి.శంకర్, సురేందర్‌రెడ్డి, సంజీవయ్య, వివిధ కళాశాలల అధ్యాపకులు, పీజీ, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా పాఠశాల నిధుల లెక్క

- ఖర్చు వివరాలు పీఎఫ్‌ఎంఎస్‌లో నమోదు చేయాల్సిందే
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు అమలులోకి కొత్త విధానం
- జిల్లాలో 651 ప్రభుత్వ పాఠశాలలు



సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తోంది. పిల్లల సంఖ్య ఆధారంగా కేటాయింపులు జరుగుతున్న విషయం తెలిసిందే. గతంలో పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్‌ల ఉమ్మడి ఖాతాలో నిధులు జమయ్యేవి. ఎస్‌ఎంసీ తీర్మానాల మేరకు ఖర్చు చేసేవారు. ఈ ఏడాది నుంచి నిధుల ఖర్చుకు సంబంధించి కొత్త విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది.

మార్గదర్శకాలు ఇవీ..

పాఠశాల నిధుల వినియోగానికి ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేసింది. ఏదైనా వస్తువు కొనుగోలు చేసినా లేదంటే నగదు చెల్లించినా వారి పేరు, ఖాతా నంబర్, చేసిన ఖర్చు వివరాలను పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పీఎఫ్‌ఎంఎస్)లో నమోదు చేయాలి. దీన్ని పరిశీలించాక నిర్వహణ నిధుల నుంచి ఆన్‌లైన్‌లో వారి ఖాతాకు ఆ మొత్తం జమవుతుంది. పాత పద్ధతిలో డబ్బు చెల్లించి, బిల్లు తీసుకొని, ఆడిట్ సమయంలో వాటిని అందజేసేవారు. కొందరు తప్పుడు బిల్లులు సమర్పించి, దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలతో సర్కారు పీఎఫ్‌ఎంఎస్ విధానం అమల్లోకి తీసుకువచ్చింది. అలాగే నిధుల వినియోగానికి తీర్మానాలు చేసి, అడ్వైస్ పద్ధతిలో ఖర్చుకు సంబంధించిన చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. నగదు ఇచ్చిన వారి వద్ద అప్పు తీసుకున్నట్లు నమోదు చేయాలి. వివరాలు క్యాష్ పుస్తకంలో ఎవరి వద్ద నుంచి ఎంతెంత అప్పు తీసుకున్నారన్నది పొందుపర్చాలి. స్టేషనరీతోపాటు ఇతర సామగ్రి కొనుగోలుకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌లో రాయాలి.

మొదటి విడత రూ.1.40 కోట్లు విడుదల

పీఎఫ్‌ఎంఎస్ ద్వారా నిధుల వినియోగంలో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని సర్కారు భావిస్తోంది. విద్యాశాఖ, ఆర్థిక, ట్రెజరీ అధికారులు ఈ కొత్త విధానం అమలుపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాలల నిర్వహణకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల ప్రభుత్వం కరీంనగర్ జిల్లాలోని 651 ప్రభుత్వ పాఠశాలలకు మొదటి విడతగా రూ.1.40 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూన్ నుంచి ఇప్పటివరకు పాఠశాలల్లో వివిధ అవసరాలకు హెచ్‌ఎంలు పెట్టిన ఖర్చులకు సంబంధించిన మొత్తాన్ని ఇందులో నుంచి తీసుకునేందుకు అవకాశం కల్పించారు.

పాఠశాలలకు కేటాయింపులు ఇలా..

విద్యార్థులు	నిధులు(రూ.లో)
01–30	10,000
31–100	25,000
101–250	50,000
251–1000	75,000

లావాదేవీలు సులభం..

పీఎఫ్‌ఎంఎస్ విధానంలో పాఠశాలల నిధుల వినియోగం పూర్తి పారదర్శకంగా ఉంటుంది. లావాదేవీలు సులభంగా చేయవచ్చు. జిల్లాలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్‌ఎంసీలకు శిక్షణనిచ్చాం. ఇప్పటికే నిధుల వినియోగం ప్రారంభమైంది.

– జనార్దన్‌రావు, డీఈవో

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

1 ఎకరం భూమి ఉన్న రైతులకు డైలీ లేబర్‌కు 5 లక్షల వరకు గృహ రుణం ఇవ్వబడును. సంప్రదించండి ఫోన్ : 9014653011. [H-786787]

TO-LET

కరీంనగర్ మంకమ్మతోటలో ఇండిపెండెంట్ 2 BHK HOUSE రెంట్‌కు ఇవ్వబడును. with 2 Cars Parking. Contact: 9491323987, 9490285818. [K- 1141934]

FINANCE

హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL. 9618767116 [W-775801]

WANTED

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్.9848571888, 7569955551. [H-786819]

స్టార్ హోంకేర్ HYD లో వృద్ధులకు పేషెంట్లకు సేవ చేయుటకు, బేబీ కేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం:16000–30K ఫ్రీ వసతి+ భోజనం (బిలి కాల్స్ కావలెను) 8639132775, 8639828228 [H-793255]

షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-10046]

అంజన్న హోంకేర్ పెద్దవారికి పేషెంట్ కేర్/ఇంటి/వంటపని చేయుటకు ఆయాలు, వార్డ్‌బాయ్స్, Exp. స్త్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో Hyd. Ph: 9966568882, 9963489661 [HA-900]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776049]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824

క్లుప్తంగా

హుండీల లెక్కింపు



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల శ్రీవేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల హుండీలను బుధవారం లెక్కించారు. రూ.2,69,991 నగదు, 450 గ్రాముల మిశ్రమ వెండి, 6 గ్రాముల మిశ్రమ బంగారం సమకూరినట్లు ఈవో కొస్న కాంతారెడ్డి తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో అర్చకులు రాజేశ్వరశర్మ, డింగరి చాణిక్య, సిబ్బంది మధు తదితరులు పాల్గొన్నారు.

38వ సారి రక్తదానం



కొత్తపల్లి: కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంచిర్యాలకు చెందిన రమాదేవి అనారోగ్యంతో చికిత్స పొందుతూ అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో రోగి బంధువులు కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికి చెందిన జీకే యూత్ సభ్యుడు గోదల రంజిత్‌కుమార్‌ను బుధవారం సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన రక్తదానం చేశారు. 38వ సారి రక్తదానం చేసిన రంజిత్‌ను వైద్యులు, రోగి బంధువులు అభినందించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు మంత్రి కమలాకర్ అభిమానులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. రక్తం అవసరమైన రోగులు జీకే యూత్ సభ్యులను సంప్రదించాలని కోరారు.

ఎన్టీఆర్‌కు నివాళి



విద్యానగర్(కరీంనగర్): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు 27వ వర్ధంతిని బుధవారం కరీంనగర్‌లో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు వంచ శ్రీనివాసరెడ్డి, కళ్యాడపు ఆగయ్య, ఎడ్ల వెంకటయ్య, దామెర సత్యం, నాగుల బాలాగౌడ్, ఎర్రవెల్లి రవీందర్, రొడ్డ శ్రీధర్, నందాల శివ, ఎలిమెళ్ల కిషన్, సందబోయిన రాజేశం, తాటికొండ శేఖర్, లంక భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

విద్యానగర్(కరీంనగర్): వరి పంటకు తెగుళ్లు సోకుతున్న వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వాతావరణ పరిస్థితుల వల్ల పది రోజులుగా కాండం తొలుచు పురుగు, రెక్కల పురుగులు, తెగుళ్లు వరిపంటకు సోకడంతో నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటి వరకు జరిగిన నష్టానికి పరిహారం అందించి. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పారిశుధ్యం.. అధ్వానం

- జిల్లా ప్రధాన ఆస్పత్రిలో పొంగిపొర్లుతున్న మురుగు కాలువలు
- దుర్గంధం వెదజల్లుతున్న పరిసరాలు
- ఇబ్బంది పడుతున్న రోగులు

కరీంనగర్‌టౌన్: ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టు సంస్థ ఇష్టారాజ్యం వెరసి జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఆసుపత్రి ఆవరణలో మురుగునీరు చేరడంతో దుర్గంధభరితంగా తయారైంది. ఆసుపత్రికి వచ్చే రోగులు, పనిచేసే సిబ్బంది దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 500 పడకల ఆసుపత్రి, మెడికల్ కళాశాలగా రూపాంతరం చెందుతున్న అతి పెద్ద వైద్య వ్యవస్థలో మురుగు నీరు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. మురుగు నిలిచిన ప్రతిసారీ హడావిడి చేయడం తప్ప శాశ్వత పరిష్కారం వైపు ఆలోచన చేయడం లేదు. మురుగునీటి చాంబర్లు సీల్టుతో నిండి పొంగిపొర్లుతున్నాయి. చాంబర్లలో సిల్టు తీయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంటోంది. రోగం నయం చేసుకోవడానికి వస్తే కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. రోగులు, వారి బంధువులు వార్డుల్లో భోజనాలు చేయలేని దుస్థితి నెలకొనడంతో జిల్లా ఆసుపత్రికి, ఎంసీహెచ్‌కు మధ్య ఉన్న చెట్ల కిందకు వెళ్లి భోజనాలు చేస్తున్నారు. అదేవిధంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో బయో వ్యర్థాలు వేస్తుండడం ప్రమాదకరంగా తయారైంది. బయోవ్యర్థాలు వేసే ప్రాంతంలోనే ఆసుపత్రి వంటశాల, నర్సింగ్ కళాశాల, విద్యార్థుల హాస్టల్ ఉండడంతో ఆ ప్రాంతం నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.



మురుగునీరు బయటకు వస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతున్న మురుగు కాలువ

నిర్వహణ నిర్లక్ష్యం..

ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ కోసం ఓ సంస్థకు కాంట్రాక్టు అప్పగించారు. పారిశుధ్య పనులు, పేషెంట్‌కేర్ తదితర పనులు నిర్వహించేందుకు సుమారు 200 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి అప్‌గ్రేడ్ అయినప్పటికీ సరిపడా సిబ్బందిని నియమించలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పారిశుధ్యం పడకేస్తోంది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. అత్యవసరమైన టాయిలెట్ల శుభ్రత విషయం అధికారులు పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యం పనులు పక్కాగా చేయించాలని రోగులు కోరుతున్నారు.

టాయిలెట్లు..



మూసివేసిన టాయిలెట్

జిల్లా ఆసుపత్రిలో మురుగు కాలువల వ్యవస్థ అధ్వానంగా తయారైంది. ప్రతిరోజూ 500 మంది పేషెంట్లు చికిత్స పొందుతుంటారు. వీరికి సంబంధించి టాయిలెట్ల వాడకం ద్వారా వెలువడే మురుగు నీరు వెళ్లేందుకు డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో మురుగనీరు కదలడం లేదు. పైపులైన్‌ల చాంబర్ల నుంచి లీకేజీ అవుతుండడంతో వార్డుల్లో ఉన్న పేషెంట్లు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. వార్డుల్లో చాలా టాయిలెట్లు పనిచేయడం లేదు. టాయిలెట్లలో నీరు మురుగు కాలువల్లోకి వెళ్లకపోవడంతో టాయిలెట్లను తాత్కాలికంగా మూసివేశారు. పనిచేసే టాయిలెట్ల వద్ద కూడా నీరు నిలుస్తుండడంతో పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్



నడిరోడ్డుపై వ్యాపారం

నగరంలోని సుభాష్‌నగర్ వద్ద నడిరోడ్డుపై ఓ వ్యాపారి పండ్ల అమ్మకాలతో వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షాప్‌లను త్వరగా కేటాయిస్తే రోడ్లపై ఈ సమస్య ఉండదని నగరవాసులు పేర్కొంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఇస్లావత్ సేవా, మున్సిపల్ కమిషనర్
సెల్ నంబర్ : 98499 05876

దొంగతనాలపై ప్రత్యేక నిఘా

- నెల రోజుల్లో ఏడుగురు దొంగల అరెస్టు
- కరీంనగర్ వన్‌టౌన్ సీఐ సీహెచ్. నటేశ్



సీఐ నటేశ్

కరీంనగర్‌క్రైం:కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నెల రోజుల వ్యవధిలో ఏడుగురు దొంగలను అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ సీఐ సీహెచ్. నటేశ్ తెలిపారు. ఇటీవల గణేశ్‌నగర్‌లోని రామేశ్వరాలయంలో జరిగిన దొంగతనంలో నిందితుడు రౌతు పవన్ కోసం నాందేడుకు ప్రత్యేక బృందాలు పంపించి, కేవలం మూడు రోజుల్లోనే పట్టుకున్నామన్నారు. గుడిలో చోరీ చేసిన నిందితుడే ఒక వైన్స్ షాపులో నగదు దొంగలించినట్లు వెల్లడించారు. సుమారు 150 సీసీ కెమెరా పుటేజీలు చూసి నిందితుడి ఆచూకి కనిపెట్టి పట్టుకున్నామన్నారు. దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితులను వేగంగా పట్టుకొని అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. అనుమానంగా ఎవరైనా తిరిగినా వెంటనే పోలీసులకు సమాచారమందించాలని సూచించారు. బైకులు, సెల్ ఫోన్లు దొంగతనాలు వరుసగా చేసిన వారిని గుర్తించి వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించామని తెలిపారు. పోచమ్మవాడలో ఒక ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారని అక్కడ ప్రాంతవాసులు తెలుపడంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నామని అన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజల భద్రతకు ఎల్లవేళలా కృషిచేస్తున్నామని తెలిపారు.

'కంటివెలుగు' ఆహ్వాన పత్రికలు పంపిణీ



ఆహ్వాన పత్రికలు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది



కొత్తపల్లిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైద్యాధికారి

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేసేందుకు వైద్యసిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కరీంనగర్ మండలం చామన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బొమ్మకల్ మినహా మిగితా 16 గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగును నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. బుధవారం చామన్‌పల్లిలో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి కంటివెలుగు ఆహ్వాన పత్రికలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే కంటివెలుగు శిబిరానికి సంబంధించిన వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని పీహెచ్‌సీ వైద్యులు ఇందు, అరుణ పరిశీలించారు. చామన్‌పల్లిలో ఈనెల 19 నుంచి ఫిబ్రవరి 3 వరకు, బహదూరూర్‌ఖాన్‌పేటలో ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు, దుబ్బపల్లిలో ఫిబ్రవరి9 నుంచి 13 వరకు, ఎలబోతారంలో 14 నుంచి 22వరకు, చెర్లభూత్కూర్‌లో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 13వరకు, మొగ్దుంపూర్‌లో మార్చి 14 నుంచి 31వరకు, తాహెర్‌కొండాపూర్‌లో ఏప్రిల్ 3 నుంచి 4 వరకు, చేగుర్తిలో ఏప్రిల్ 6 నుంచి 17 వరకు, దుర్శేడ్‌లో ఏప్రిల్ 18 నుంచి 3 మే వరకు, మందులపల్లిలో మే 4 నుంచి 8వరకు, నల్లగుంటపల్లిలో మే 9 నుంచి 10 వరకు, ఇరుకుల్లలో మే 11 నుంచి 18 వరకు, ఫకీర్‌పేటలో ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు, జూబ్లీనగర్‌లో ఫిబ్రవరి 16 నుంచి 22 వరకు, గోపాల్‌పూర్‌లో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 13 వరకు, నగునూరులో మార్చి 14నుంచి ఏప్రిల్ 19 వరకు వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. చామన్‌పల్లిలో గురువారం ఉదయం 9గంటలకు జెడ్పీటీసీ పురుమల్ల లలిత, సర్పంచ్ బోగొండ లక్ష్మి కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తులు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: రెండో విడత కంటి వెలుగుకు కొత్తపల్లి పట్టణం, కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. కొత్తపల్లిలోని పాత పీహెచ్‌సీ భవనం, ఆసిఫ్‌నగర్‌లోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కొత్తపల్లిలో 36 రోజులు, ఆసిఫ్‌నగర్‌లో 22 రోజుల పాటు శిబిరం ఉంటుందని తెలిపారు. కంటి పరీక్షలకు వచ్చే వారి కోసం ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మున్సిపల్, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

గణిత ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్'కు పతకాలు



విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: ఎస్ఓఎఫ్ నిర్వహించిన అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్ ప్రథమ దశలో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రెండవ దశకు ఎంపిక కావడమే కాకుండా అత్యధికంగా బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ విద్యార్థులను ప్రాథమిక దశ నుంచే గణితంపై ఆసక్తి రేకెత్తించే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల క్రీడా వార్షికోత్సవం



కరీంనగర్: కరీంనగర్‌లోని వాణినికేతన్ బాల విహార్ పాఠశాలలో బుధవారం పాఠశాల క్రీడా వార్షికోత్సవం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పి.రేణుక క్రీడా జ్యోతి వెలిగించి, శాంతి పావురాలను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యతో పాటు ఆటలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు టి.నీలకంఠం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భాగవతం జీవితాలను బాగుపరుస్తుంది



ప్రవచనం చేస్తున్న వేణుగోపాలాచార్య కౌశిక స్వామి



గోపూజ చేస్తున్న భక్తులు

కరీంనగర్‌కల్చరల్: భాగవతం మానవ జీవితాలను బాగుపరుస్తుందని, అందుకే భాగవతాన్ని చదవాలని, వినాలని నంబి వేణుగోపాలాచార్య కౌశిక స్వామి అన్నారు. బుధవారం సప్తగిరి కోదండ రామాలయంలో జరుగుతున్న భాగవత సప్తాహ ప్రవచనంలో భాగంగా రెండో రోజు భాగవతంలోని పలు కథలను వివరించారు. మానవ జీవన మూల్యాలను ఈ గ్రంథంలో గ్రహించవచ్చని అన్నారు. ఉదయం, సాయంత్రం ప్రవచనం కొనసాగగా గోపూజలు, ప్రత్యేక హవనాలు జరిగాయి. ఈ ప్రవచనంలో ఆలయ చైర్మన్ కె.గౌతమ్‌రావు, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

22 నుంచి శైశిర నవరాత్రులు



దుర్గాభవానీ అమ్మవారు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూరులోని దుర్గాభవానీ ఆలయంలో ఆదివారం నుంచి శైశిర నవరాత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్ తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా శనివారం ఉదయం దుర్గాభవాని అమ్మ వారికి ఫలపంచామృతాభిషేకం. విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు, మహాహారతి, ధ్వజారోహణం కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ఆదివారం ప్రారంభోత్సవంలో భాగంగా కలశస్థాపన, విశేష హారతులు, విశేషపూజలు జరుగుతాయని తెలిపారు. 25న దుండిచతుర్థి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి స్వామి వారికి విశేష అభిషేకం, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. 26న వసంత పంచమి సందర్భంగా అమ్మవారికి సరస్వతి అలంకరణ, విశేషపూజలు, 28న రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు, 30న చండీహోమం, కలశ ఉద్వాసన పూజలు జరుగుతాయని, ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్‌వైకే ప్రోగ్రాం అధికారి

కరీంనగర్‌స్పోర్ట్స్: స్వామి వివేకానంద వారోత్సవాల్లో భాగంగా శాంతి దినోత్సవం పురస్కరించుకొని బుధవారం కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వావిలాలపల్లి గుండు హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో టి.స్వర్ణలత (ప్రథమ), వి.అమిత(ద్వితీయ), సీహెచ్.రజిత(తృతీయ) బహుమతులు సాధించారు. వీరికి ఎన్‌వైకే ప్రోగ్రాం అధికారి బసవపత్రి రవీందర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మధూకర్‌రెడ్డి, సభ్యులు సంజీవరావు, కిషన్‌రావు, పృథ్వీధర్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గ్రామ నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో ప్రియాంక

రామడుగు: మండలకేంద్రంలోని గ్రామ నర్సరీని బుధవారం జెడ్పీ సీఈవో ప్రియాంక పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో నాటిన మొక్కలు, వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రామడుగులో గ్రామనర్సరీ బాగుందని సంతోషించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర, ఎంపీవో రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీల, మాజీ సర్పంచ్ జగన్‌మోహన్ గౌడ్, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో కేబుల్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కేవీ భగత్‌నగర్, ఉజ్వలపార్కు, పద్మనగర్, సప్తగిరికాలనీ, వాటర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలతో పాటు 11కేవీ ఎల్లమ్మ బ్రిడ్జి ఫీడర్ పరిధిలోని ఆటోనగర్, కోతిరాంపూర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2,1 ఏడీఈలు ఎం.సుధీర్‌కుమార్, ఎస్.నరేందర్ తెలిపారు.

విద్యుత్ శాఖకు బకాయిల షాక్

- రూ.1.1 కోట్లు పెండింగ్ బిల్లులు
- పేరుకుపోతున్న కస్టమర్ చార్జీలు
- అవగాహనలోపంతో చెల్లించని రైతులు



కరీంనగర్‌రూరల్: విద్యుత్‌శాఖకు కస్టమర్ చార్జీల బకాయిలు భారంగా మారాయి. వీటిని రాబట్టుకునేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది రైతుల వద్ద నుంచి బకాయిలు వసూలు చేస్తున్నారు.

కస్టమర్ చార్జీల పేరిట వసూలు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. ప్రతీ విద్యుత్ మోటారుకు రైతుల నుంచి కస్టమర్ చార్జీల పేరిట నెలకు రూ.30 చొప్పున ఏడాదికి రూ.360 వసూలు చేస్తోంది. కొంతమంది రైతులకు ప్రతినెలా వ్యవసాయ కనెక్షన్‌కు రూ.30 చొప్పున బిల్లు వస్తుందనే విషయం తెలియకపోగా మరికొందరు ఏడాదికి ఒకేసారి చెల్లిస్తామనే నిర్లక్ష్యంతో బిల్లులు చెల్లించకపోవడంతో పేరుకపోతున్నాయి. కరీంనగర్ డివిజన్ పరిధిలో మొత్తం 5,040 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. డిసెంబరు వరకు రూ.1.1 కోట్లు బిల్లులు బకాయిలున్నాయి. విద్యుత్ సంస్థ సైతం గృహావసర విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి నెలవారీగా ఇంటికి వెళ్లి బిల్లులను ఇస్తున్న తరహాలో వ్యవసాయ కనెక్షన్ల బిల్లు నెలనెలా రైతులకు ఇవ్వడం లేదు. ఏటా డిసెంబరులో బిల్లులు అందించి రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. గ్రామాల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించి వసూళ్లు చేపడుతున్నారు. బిల్లులు చెల్లించకుంటే రైతుల విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే పలువురు రైతులు కస్టమర్ చార్జీలను చెల్లించకపోవడంతో బకాయిలు రూ.లక్షల్లో పేరుకపోతున్నాయి. కొందరు బడా రైతుల బిల్లులు రూ.వేలల్లో ఉన్నప్పటికీ విద్యుత్‌సిబ్బంది వసూలు చేయలేని పరిస్థితి నెలకొంది.

చార్జీలు చెల్లించి సహకరించాలి

రైతులు కస్టమర్ చార్జీలు చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకపోయాయి. వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి గతేడాది నుంచి బకాయిలున్నాయి. గతనెల 31వరకు బకాయిల్లో 50శాతం వసూలు చేశాం. ఫిబ్రవరి నెలాఖరు వరకు మిగితా బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాం. బకాయిలు చెల్లించి సహకరించాలి.

– కొల్బుల రాజు, ఏడీఈ, కరీంనగర్‌రూరల్

'దళితబంధు'ను రాష్ట్రమంతా అమలు చేయాలి



మాట్లాడుతున్న జాడి బాల్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: దళిత బంధును రాష్ట్రమంతా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రేకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోని దళితులందరికీ అమలు చేస్తానని చెప్పి ఇప్పటివరకు హుజూరాబాద్ మినహా ఎక్కడా పూర్తిగా అమలు చేయలేదని అన్నారు. తెలంగాణాలోనే పూర్తిగా ఇవ్వలేని బీఆర్ఎస్ నాయకులు దేశవ్యాప్తంగా అమలు చేస్తానని చెప్పడం సిగ్గుచేటన్నారు. దళితులకు ఇచ్చిన హామీల్లో మూడెకరాలు, దళితబంధు కార్పొరేషన్ నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఎనిమిదేళ్ల నుంచి కార్పొరేషన్ నిధులు మంజూరు చేయకపోవడం వల్ల నిరుద్యోగ యువకులు కూలీ పనులు చేసుకుంటూ బతుకు వెళ్లదీస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రగల్బాలు మాని దళితులందరికీ దళిత బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రశాంత్, రావుల భాస్కరాచారి, దుర్గం ఆంజనేయులు, గోల బాలకృష్ణ, నాగుల వెంకటేశ్‌గౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

21న 'చలో రవీంద్రభారతి'



మాట్లాడుతున్న ఉద్యమకారులు

విద్యానగర్(కరీంనగర్): 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21న చలో రవీంద్రభారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బంగారు తెలంగాణ సాధనలో ముఖ్యపాత్ర వహించిన నిజమైన ఉద్యమకారులకు తెలంగాణ వచ్చాక గుర్తింపు లేకుండా పోయిందన్నారు. తమ గుర్తింపు కోసం నిర్వహిస్తున్న చలో రవీంద్రభారతి కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొని ఐక్యత చాటాలని కోరారు. ఈ సమావేశంలో 1969 తెలంగాణ ఉద్యమకారులు బి.ప్రభాకర్‌రావు, కత్తురోజు రాజమణి, డి.విద్యాసాగర్‌రావు, కంకటి కనకయ్య, హసనుద్దీన్, లక్ష్మయ్య, సూర్యప్రకాశ్, ఫకీర్ మహమ్మద్, సిరికొండ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సచివాలయం కింద చెరువు

కొత్త సెక్రటేరియట్ భూగర్భంలో మినీ రిజర్వాయర్ నిర్మాణం

రెండున్నర లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం.. వాన నీరు పునర్వినియోగం కోసం ఏర్పాట్లు

లైట్ల కోసం సౌర విద్యుత్తు.. రూఫ్ టాప్‌లో త్వరలో సోలార్ ప్యానెల్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కొత్త సచివాలయం సకల హంగులతో సిద్ధమవుతోంది. భవనం భూగర్భంలో ఏకంగా ఓ మినీ రిజర్వాయర్‌ను నిర్మించారు. రెండున్నర లక్షల లీటర్ల సామర్థ్యంతో ఈ స్టోరేజీ ట్యాంకును సిద్ధం చేశారు. మరోవైపు సచివాలయంలో వినియోగించే దీపాలకు అవసరమైన విద్యుత్తును సోలార్ పద్ధతిలో ఉత్పత్తి చేయబోతున్నారు. ఇందుకోసం భవనం రూఫ్ టాప్‌లో భారీ సౌర ఫలకాలను ఏర్పాటు చేయబోతున్నారు. అలాగే సచివాలయం ప్రధాన ద్వారం ముందు వంద అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారు. వేయి అడుగుల పొడవుండే ఈ రోడ్డు చివరలో రెండు వరసల్లో ఏకంగా 300 కార్లను నిలిపి ఉంచేలా పార్కింగ్ వసతి అందుబాటులోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కొత్త సచివాలయ భవనం వచ్చే నెల 17న ప్రారంభం కాబోతున్న విషయం తెలిసిందే. నిర్మాణంలో ఎన్నో ప్రత్యేకతలుండగా, ప్రాంగణంలోనూ మరిన్ని ప్రత్యేకతలు జోడించారు. వెరసి ఇదో ప్రత్యేక నిర్మాణంగా నిలవనుంది.

వాన నీటిని ఒడిసిపట్టేలా..

వాన నీటిని ఒడిసి పట్టేందుకు వీలుగా సచివాలయం కింద రిజర్వాయర్ నిర్మించారు. భవనం నలువైపుల నుంచి వాన నీటిని ఇందులోకి తరలించేందుకు ప్రత్యేక పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. సచివాలయంలో దాదాపు 9 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో పచ్చిక బయళ్లుంటాయి. భవనం ముందు వైపు రెండు వైపులా మూడెకరాల చొప్పున రెండు, మధ్య కోర్ట్‌యార్డు, ఇతర ప్రాంతాల్లో కలిపి మరో మూడెకరాల మేర లాన్‌లుంటాయి. వాటి నిర్వహణకు భారీగా నీటి వినియోగం అవసరమవుతుంది. భూగర్భ నీటిని పొదుపు చేసే క్రమంలో పచ్చికబయళ్లకు వాననీటిని వాడే ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేశారు. బయట రోడ్డు లెవల్ కంటే సచివాలయం ప్రాంగణం బేస్ ఐదడుగుల ఎత్తున ఉంటుంది. దాని మీద భవన నిర్మాణం జరిగింది. దీంతో ఎక్కడా వాననీరు నిలిచిపోయే పరిస్థితి ఉండదు.



పార్కింగ్‌కు వీలుగా రోడ్డు విస్తరణ

సచివాలయ ప్రధాన ద్వారం ముందున్న రోడ్డును వంద అడుగులకు విస్తరించేందుకు వీలుగా ఫుట్‌పాత్‌పై ఉన్న దాదాపు 40 చెట్లను తొలగించనున్నారు. ఈ మేరకు సంబంధిత కమిటీ అనుమతి ఇచ్చింది. ఆ చెట్లను సంజీవయ్య పార్కులో (ట్రాన్స్‌లోకేట్) తిరిగి నాటనున్నారు. కాగా సచివాలయానికి వివిధ పనులపై వచ్చే వారి వాహనాలు నిలిపేందుకు లోపల విశాలమైన పార్కింగ్ యార్డులున్నాయి. అవి సరిపోని పక్షంలో, ఈ వంద అడుగుల రోడ్డు చివరలో నిలిపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు. ఇక సాయంత్రం వేళ సాగర తీరానికి వచ్చే పర్యాటకులకు ప్రస్తుతం పార్కింగ్ ఇబ్బందులున్నాయి. దీన్ని కూడా దృష్టిలో ఉంచుకుని ఆ కొత్త రోడ్డులో రెండు వరుసల్లో 300 కార్లు నిలిపేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.



సౌర వెలుగులు

పది లక్షల చదరపు అడుగుల సువిశాల భవనంలో వేల సంఖ్యలో విద్యుత్ దీపాల వినియోగం ఉంటుంది. దీంతో కరెంటు ఖర్చు ఎక్కువే అవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొంతమేర పొదుపు చేసేందుకు సౌర విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. భవనం రూఫ్‌టాప్‌లో సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భవనాన్ని ప్రారంభించిన తర్వాత వీటి ఏర్పాటు మొదలు పెడతారు. ఇందుకోసం ఓ కన్సల్టెంటును కూడా నియమిస్తున్నారు.

సగం కాలిన కాలే 'క్లూ'

కారులో వ్యక్తి దహనం కేసును వారంలోనే ఛేదించిన మెదక్ పోలీసులు

- రూ.85 లక్షల అప్పు తీర్చేందుకు ధర్మానాయక్ అడ్డదారి
- రూ. 7.4 కోట్ల బీమా సొమ్ము కోసం తనలాంటి మరొకరి హత్య
- ధర్మానాయక్ సహా ఐదుగురు కుటుంబ సభ్యులంతా నిందితులే
- మీడియాకు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ జోన్/మెదక్ మున్సిపాలిటీ/ఖలీల్‌వాడి (నిజామాబాద్): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కారుతో సహా వ్యక్తి దహనం కేసులో పోలీసులకు లభించిన సగం కాలిన కాలే 'క్లూ'గా పనికొచ్చింది. ప్రధాన నిందితుడైన ధర్మానాయక్ సహా ఇతర నిందితులను పట్టించింది. మెదక్ జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని వెల్లడించిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెంకటాపూర్ పరిధిలోని బీమ్లా తండాకు చెందిన ధర్మానాయక్ హైదరాబాద్‌లోని సచివాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. బెట్టింగ్‌లు, షేర్ల కొనుగోళ్ల కోసం దాదాపు రూ. 85 లక్షల వరకు అప్పులు చేసిన ధర్మ... వాటి నుంచి బయటపడేందుకు తన కుటుంబ సభ్యులతో చర్చించాడు. తన పేరిట భారీ మొత్తానికి బీమా చేయించి ఆపై తన లాంటి వ్యక్తిని చంపి బీమా సొమ్ము కొట్టేయాలని స్కెచ్ వేశాడు. ఇందుకోసం రూ. 7.4 కోట్లు వచ్చేలా 25 ఎల్ఐసీ పాలసీలను తీసుకొని ప్రీమియం చెల్లించాడు. తన లాంటి వ్యక్తి కోసం గతేడాది నవంబర్ నుంచి నాంపల్లి మెట్రో రైల్వేస్టేషన్ పరిసరాల్లో వెతకడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో తనంత ఎత్తున్న అంజయ్య అనే కూలీని పరిచయం చేసుకున్నాడు. నిజామాబాద్‌లో తన కున్న మామిడి తోటలో పనిచేస్తే నెలకు రూ. 15–20 వేలు ఇస్తానని నమ్మబలికాడు.

హత్య కోసమే కారు కొనుగోలు...

గతేడాది డిసెంబర్‌లో హోండా అమేజ్ కారు కొనుగోలు చేసిన ధర్మానాయక్... అంజయ్యను కారులో చంపి తానే చనిపోయినట్లు అందరినీ నమ్మించాలనుకున్నాడు. డిసెంబర్ 6న ధర్మ తన భార్య నీల, పిల్లలను తండాలో వదిలి అక్క కొడుకైన శ్రీనివాస్ తోపాటు అంజయ్యను తీసుకొని నిజామాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో ముగ్గురూ మద్యం సేవించారు. మద్యం తాగిన వ్యక్తి ప్రమాదంలో చనిపోతే బీమా రాదన్న ఉద్దేశంతో అంజయ్యను ఆ రోజు రాత్రి చంపకుండా వదిలేశారు. ఆ మర్నాడు చంపాలనుకోగా అంజయ్య తప్పించుకొని పారిపోయాడు.

నిజామాబాద్‌లో బాబుతో మాట్లాడి...

అంజయ్య స్థానంలో మరొకరిని ఉంచి తన ప్లాన్ అమలు చేసేందుకు నిజామాబాద్‌లోని రైల్వేస్టేషన్ సమీపంలో అడ్డా కూలీ బాబును ధర్మానాయక్ ఎంచుకున్నాడు. తోటలో పనిచేయాలంటూ నమ్మించి శ్రీనివాస్‌తో కలిసి బాబును బాసరకు తీసుకెళ్లాడు. అక్కడ బాబుకు గుండు గీయించి తన దుస్తులు వేయించాడు. ఈ నెల 8న రాత్రి బాసర నుంచి బయలుదేరి వెంకటాపూర్ చెరువుకట్ట వద్ద కారు నిలిపాడు. బాబుకు కల్లు తాగించి డ్రైవింగ్ సీట్లు కూర్చోమని అడగ్గా అందుకు అతను నిరాకరించడంతో గొడ్డలితో నరికి చంపాడు. అనంతరం ధర్మ, శ్రీనివాస్‌లు వారి వెంట తెచ్చిన పెట్రోల్‌ను బాబుతోపాటు కారుపై పోసి తగలబెట్టారు. అనంతరం పాపన్నపేట వరకు కాలినడకన వెళ్లి ఆపై ఓ లారీ ఎక్కి పారిపోయారు.



బాబును తన వెంట తీసుకువెళుతున్న ధర్మానాయక్ (సీసీ ఫుటేజీ)

ధర్మానాయక్ కాదన్న అనుమానంతో...

ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులకు చనిపోయింది ధర్మానాయక్ కాదన్న అనుమానం వచ్చింది. ఆఫీసులో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగి అరికాలు సాధారణంగా పగుళ్లేవీ లేకుండా నున్నగా ఉంటుందని, కానీ సగం కాలిన కాలు మాత్రం అడ్డా మీద పనిచేసే కూలీకి చెందినదిగా ఉందని భావించి ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. అలాగే ధర్మానాయక్ కుటుంబ సభ్యులపై నిఘా ఉంచారు. ఈ క్రమంలోనే నిజామాబాద్‌లోని ఓ లాడ్జిలో ధర్మానాయక్ ఉన్నట్లు సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించి ఈ నెల 17న అదుపులోకి తీసుకున్నారు. అతన్ని ప్రశ్నించగా నేరం అంగీకరించాడు.



కారు దహనమైన చోట సగం కాలిన కాలు

ఐదుగురూ నిందితులే...

బాబును చంపిన కేసులో ధర్మానాయక్ కుటుంబ సభ్యులంతా నిందితులేనని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. ఈ కేసులో ఏ1గా ధర్మానాయక్, ఏ2గా అతని మేనల్లుడు శ్రీనివాస్, ఏ3గా ధర్మ భార్య నీల, ఏ4గా ధర్మ సోదరి సునంద, ఏ5గా ఓ విద్యార్థి (17) పేరును చేర్చినట్లు చెప్పారు. ఈ కేసును వారం రోజుల్లోనే ఛేదించిన మెదక్ అదనపు ఎస్పీ బాలస్వామి, డీఎస్పీ సైదులు, సీఐలు జార్జ్, మధు, గోపీనాథ్, షేక్‌లాల్ మదర్, ఎస్సైలు లింగం, బాల్‌రాజ్, సత్యనారాయణలను ఎస్పీ అభినందించారు. మరోవైపు చనిపోయిన నిజామాబాద్‌కు చెందిన బాబు ఎవరన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అలాగే మొదటగా తప్పించుకొని పారిపోయిన అంజయ్య వివరాలను కూడా ఆరా తీస్తున్నారు.

ఇక ప్రతి నెలా సర్దుబాదుడు!

▶ మొదటి పేజీ తరువాయి

ఇంధన సర్దుబాటు చార్జీలు వసూలు చేసేందుకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు విజ్ఞప్తి చేయగా, ఈఆర్సీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంధన సర్దుబాటు చార్జీలను లెక్కించేందుకు ప్రత్యేక ఫార్ములాను ప్రకటించింది. 2023 ఏప్రిల్ 1 నుంచి ఇంధన సర్దుబాటు చార్జీలు అమల్లోకి రానున్నాయి.

రుణాత్మకంగా తేలితే రిఫండ్

తెలంగాణ ఈఆర్సీ నిబంధనల ప్రకారం.. ఎన్ (ఒక నెల) నెలకు సంబంధించిన ఇంధన సర్దుబాటు చార్జీలను ఎన్+2 (మూడవ నెల)కు సంబంధించిన బిల్లుతో కలిపి ఎన్+3 (4వ నెల) నెలలో డిస్కంలు జారీ చేస్తాయి. ఉదాహరణకు జనవరి నెల ఇంధన సర్దుబాటు చార్జీలను డిస్కంలు మార్చి నెల బిల్లుతో కలిపి ఏప్రిల్ నెలలో వినియోగదారులపై విధించాల్సి ఉంటుంది. ఒక వేళ ఎఫ్ఎస్ఏ చార్జీలను లెక్కించిన తర్వాత రుణాత్మకంగా తేలితే ఆ మేరకు వినియోగదారులకు రిఫండ్ చేయాల్సి ఉంటుంది. యూనిట్ విద్యుత్‌పై గరిష్ఠంగా 30 పైసల వరకు ఎఫ్ఎస్ఏ చార్జీలను ఈఆర్సీ ముందస్తు అనుమతి లేకుండా విధించవచ్చు.

వ్యవసాయం మినహా అందరిపై వడ్డన..

ఎల్టీ–5 కేటగిరీలోని వ్యవసాయ వినియోగదారులు మినహా అన్ని కేటగిరీల వినియోగదారులపై ఇంధన సర్దుబాటు చార్జీలు విధించడానికి ఈఆర్సీ అనుమతినిచ్చింది. వ్యవసాయ వినియోగదారుల ఇంధన సర్దుబాటు చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి వసూలు చేయాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించని పక్షంలో ఆ మొత్తాలను తర్వాతి కాలంలో ఇతర వినియోగదారుల నుంచి ట్రూఅప్ చార్జీల రూపంలో వసూలు చేసేందుకు అనుమతించబోమని ఈఆర్సీ స్పష్టం చేసింది. ఎఫ్ఎస్ఏ చార్జీలను లెక్కించే సమయంలో ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

గడువులోగా వసూలు చేసుకోవాల్సిందే..

నిర్ణీత కాల వ్యవధిలోపు ఎఫ్ఎస్ఏ చార్జీలను విధించడంలో డిస్కంలు విఫలమైతే తర్వాత వసూలు చేసేందుకు అనుమతి ఉండదు. నెలవారీ ఇంధన సర్దుబాటు చార్జీలను నిబంధనల ప్రకారం డిస్కంలు లెక్కించి సంబంధిత నెల ముగిసిన 45 రోజుల్లోగా పత్రికల్లో ప్రచురించాల్సి ఉంటుంది. 45 రోజులు దాటితే ఆ నెలకు సంబంధించిన ఎఫ్ఎస్ఏ చార్జీలను అనుమతించరు. ప్రతి త్రైమాసికం ముగిసిన తర్వాత 60 రోజుల్లోగా ఆ త్రైమాసికంలోని నెలలకు సంబంధించిన ఎఫ్ఎస్ఏ చార్జీల వివరాలను ఈఆర్సీకి అందజేయాలి.

ట్రూఅప్ ప్రతిపాదనలు కీలకం..

ప్రతి ఏటా నవంబర్ ముగిసేలోగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ఆదాయ అవసరాల నివేదికతో పాటు వినియోగదారుల నుంచి వసూలు చేసిన ఎఫ్ఎస్ఏ చార్జీల వివరాలు, ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలను ఈఆర్సీకి డిస్కంలు సమర్పించాల్సి ఉంటుంది. ముందే వసూలు చేసిన ఎఫ్ఎస్ఏ చార్జీలను పరిగణనలోకి తీసుకుని ట్రూఅప్ చార్జీల రూపంలో వినియోగదారులకు పంచాల్సిన లాభ, నష్టాలపై ఈఆర్సీ నిర్ణయం తీసుకుంటుంది. ట్రూఅప్ ప్రతిపాదనలు సమర్పించడంలో విఫలమైన పక్షంలో వీటిని సమర్పించే వరకు ఎఫ్ఎస్ఏ చార్జీల వసూళ్లకు ఈఆర్సీ అనుమతించదు. ఈఆర్సీ అనుమతించిన చార్జీలకు, విద్యుత్ సరఫరాకు జరిగిన వాస్తవ వ్యయానికి మధ్య ఉండే వ్యత్యాసాన్ని ట్రూఅప్ చార్జీల పేరిట వసూలు చేసుకునేందుకు ఈఆర్సీ అనుమతిస్తుంది.

వైద్య కళాశాలల్లో 201 ట్యూటర్ పోస్టులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 12 వైద్య కళాశాలల్లో నాన్ మెడికల్ విభాగంలో 201 ట్యూటర్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు వైద్య ఆరోగ్య శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెస్సీ సంబంధిత విభాగంలో ఉత్తీర్ణతతోపాటు 45 ఏళ్లలోపు వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెలవారీ వీరికి జీతం రూ. 57,700గా నిర్ణయించారు. జిల్లా ఎంపిక కమిటీల ద్వారా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ట్యూటర్‌లను భర్తీ చేయాలని వైద్య కళాశాలల సంబంధిత ప్రిన్సిపాల్‌లను ఆదేశించింది. నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 16, మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో 10, సిద్దిపేటలో 8, నల్లగొండలో 18, సూర్యాపేటలో 18, సంగారెడ్డిలో 13, నాగర్ కర్నూలులో 14, వనపర్తిలో 16, భద్రాద్రి కొత్తగూడెంలో 15, జగిత్యాలలో 14, మంచిర్యాలలో 13, మహబూబాబాద్‌లో 14, రామగుండం వైద్యకళాశాలలో 16 పోస్టులను భర్తీ చేయనున్నారు.

గ్రూప్-2 దరఖాస్తుకు గడువు ఫిబ్రవరి 16

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 783 గ్రూప్–2 కొలువుల దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. ఈనెల 18వతేదీ నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ప్రక్రియ వచ్చే నెల 16వ తేదీ సాయంత్రం 5గంటల వరకు కొనసాగనున్నట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి అర్హతలను పరిశీలించుకోవాలని, పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించింది.

గ్రూప్-1 మెయిన్స్ మోడల్ ప్రశ్నపత్రం ఖరారు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ ప్రిలిమినరీ పరీక్ష ద్వారా 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసిన టీఎస్‌పీఎస్సీ... తాజాగా మెయిన్స్ పరీక్షలకు సంబంధించి మోడల్‌ప్రశ్నపత్రాన్ని ఖరారు చేసింది. బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఇందులో భాగంగా గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రం వారీగా మార్కులు, ప్రశ్నల తీరుపై ఇప్పటికే నిపుణుల కమిటీ సూచించిన అంశాలను సమీక్షించింది. సబ్జెక్టుల వారీగా పేపర్–1 నుంచి పేపర్–6 వరకు, అదేవిధంగా జనరల్ ఇంగ్లీష్ క్వశ్చన్ పేపర్ తీరు, మార్కుల వివరాలు, ప్రశ్నలు, ఐచ్ఛికాలు తదితర పూర్తి సమాచారంతో కూడిన సమాచారాన్ని కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

రూ. 2,000 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

రూ. 2వేల కోట్లను పెట్టుబడిగా పెడుతామని ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఫ్రాన్స్‌కు చెందిన ఆహారం, పర్యావరణం, ఔషధాలు, కాస్మోటిక్స్ పరీక్షల సంస్థ యూరోఫిన్స్.. జీనోమ్ వ్యాలీలో అధునాతన ప్రయోగశాల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది.

- దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవీలియన్‌లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావుతో భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్, వైస్ చైర్మన్, ఎండీ రాజన్ భారతీ మిట్టల్, యూరోఫిన్స్ సీఈవో డాక్టర్ గిల్లెస్ మార్టిన్‌లు విడివిడిగా సమావేశమయ్యారు. సమావేశానంతరం 60 మెగావాట్ల సామర్థ్యంతో ఈ హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. డేటా భద్రతలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే ఈ డేటాసెంటర్ రాబోయే 5 నుంచి 7 సంవత్సరాల కాలంలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కె.రామారావు మాట్లాడుతూ ఎయిర్‌టెల్–నెక్స్‌ట్రా తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా డిజిటల్ మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎయిర్ టెల్– నెక్స్ట్రాతో తెలంగాణ ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని తెలిపారు.
- భారతీ ఎయిర్‌టెల్ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ మాట్లాడుతూ హైదరాబాద్ లో ఏర్పాటు చేయబోయే హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఇండియాలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులలో ఒకటిగా పేర్కొన్నారు. 2022 మే లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల్లో ప్రారంభమైన డేటా సెంటర్ ఏర్పాటు చర్చలు నెలల వ్యవధిలోనే కార్యరూపం దాల్చడానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన కృషి కారణమన్నారు.

జీనోమ్ వ్యాలీలో.. యూరోఫిన్స్ ప్రయోగశాల...

హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిజ్ఞానంతో ప్రయోగశాల (టెస్టింగ్ ల్యాబ్) ఏర్పాటు చేయనున్నట్లు ఫ్రాన్స్‌కు చెందిన యూరోఫిన్స్ ప్రకటించింది. ఆహారం, పర్యావరణం, ఫార్మా, కాస్మెటిక్ ఉత్పత్తుల పరీక్షలతో పాటు బయో అనలిటికల్ టెస్టింగ్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న యూరోఫిన్స్ హైదరాబాద్‌లో అధునాతన ప్రయోగశాలను నెలకొల్పాలని నిర్ణయించింది. తద్వారా భారతీయ ఔషధ మార్కెట్‌లోకి విస్తరించాలని ప్రణాళిక రూపొందించింది. 90,000 అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే ఈ అత్యాధునిక ప్రయోగశాలలో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ ఆర్ అండ్ డీ, బయో అనలిటికల్ సర్వీసెస్, ఇన్–వివో ఫార్మకాలజీ, సేఫ్టీ టాక్సికాలజీ రంగాలకు చెందిన దేశ, విదేశ ఫార్మాస్యూటికల్ కంపెనీలతో పాటు చిన్న బయోటెక్ కంపెనీలకు అవసరమైన సేవలు అందించేలా ప్రణాళిక రూపొందించింది. తన అనుబంధ సంస్థ 'యూరోఫిన్స్ అడ్వినస్' ద్వారా హైదరాబాద్‌లో ఈ ప్రయోగశాలను యూరోఫిన్స్ ఏర్పాటు చేయనుంది. ఫార్ములేషన్ డెవలప్‌మెంట్‌తో పాటు ఇన్–విట్రో, ఇన్–వివో బయాలజీ విభాగాల్లో తన సేవలను విస్తరించేందుకు 2023 వ సంవత్సరం ప్రారంభం నుంచే యూరోఫిన్స్ అడ్వినస్‌కు ఈ ల్యాబ్‌తో అవకాశం కలుగుతుంది.

ఔషధాల తయారీలో భారత్ ప్రాధాన్యతను గుర్తించే...: గిల్లెస్ మార్టిన్

ఈ సందర్భంగా యూరోఫిన్స్ సీఈఓ డాక్టర్ గిల్లెస్ మార్టిన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించడంతో పాటు లేబొరేటరీ నెట్‌వర్క్‌ను మరింత సుస్థిరం చేసుకునే దీర్ఘకాలిక పెట్టుబడి ప్రణాళికలు తమ దగ్గర ఉన్నాయన్నారు. ఔషధాల పరిశోధన, తయారీలో ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ క్యాంపస్ ద్వారా ఔషధాల అభివృద్ధి, ఆవిష్కరణల్లో కీలకం కానున్నట్లు చెప్పారు. కాగా హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలోకి యూరోఫిన్స్ ప్రవేశించడం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. తమ విస్తరణ–వృద్ధి ప్రణాళికల కోసం హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా యూరోఫిన్స్ పరిగణిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి ఎం నాగప్పన్ పాల్గొన్నారు.

ముకరంజా అంత్యక్రియలు పూర్తి



ముకరంజా భౌతికకాయం వద్ద గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

- నిజాంకు నివాళులర్పించిన పలువురు అధికార, అనధికార ప్రముఖులు
- చౌమహల్లా ప్యాలెస్‌లో పోలీసుల గౌరవ వందనం.. అంతిమ యాత్రలో పాల్గొన్న హోంమంత్రి, ఎంఐఎం నేతలు

దూద్‌బౌలి (హైదరాబాద్): టర్కీలోని ఇస్తాంబుల్‌లో మృతి చెందిన 8వ నిజాం నవాబ్ మీర్ బర్కత్ అలీఖాన్ ముకరంజా అంత్యక్రియలు బుధవారం మక్కా మసీదులో ముగిశాయి. చౌమహల్లా ప్యాలెస్‌లో ఉంచిన ఆయన పార్థివదేహానికి వేలాది మంది నివాళులర్పించారు. చౌమహల్లా ప్యాలెస్‌లోనే ప్రభుత్వ లాంఛనాలతో ఆయనకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం నవాబ్ అంతిమయాత్ర ప్యాలెస్ నుంచి ప్రారంభమై మక్కా మసీదు వరకు కొనసాగింది. పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఆయన అంతిమయాత్రలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. సాయంత్రం 5 గంటలకు మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పార్థివదేహాన్ని సమాధి చేశారు. గతంలో ఆయన కోరిక మేరకు తన తండ్రి సమాధి పక్కనే అంత్యక్రియలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతిమయాత్రలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్ ఖాన్, సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, మేరాజ్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జారియా జుల్ హసన్ హఫందీతో పాటు అనేక మంది ముస్లిం మత ప్రముఖులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిజాం మృతికి సంతాపంగా చార్మినార్, లాడ్‌బజార్, ముర్గీచౌక్, ఖిల్వత్, మూసాబౌలి, గుల్జార్‌హౌజ్, శాలిబండ తదితర ప్రాంతాల్లో దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి...

ముకరంజా పార్థివదేహానికి బుధవారం చౌమహల్లా ప్యాలెస్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, వి.హనుమంతరావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం నిజాం ఆస్తులను కాపాడాలని, నిజాంకు ప్రత్యేక గుర్తింపుగా చిహ్నం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సీబీఐ దర్యాప్తు బీజేపీ కోరడం సరికాదు

మొదట సిట్ దర్యాప్తును ఆ పార్టీ స్వాగతించింది

- ఎమ్మెల్యేలకు ఎర కేసులో ప్రభుత్వ న్యాయవాది దవే
- ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత కోర్టులదే..
- పోలీస్ ఎఫ్ఐఆర్ రద్దును ఎవరూ కోరలేదు
- సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టివేయాలని వాదనలు
- ఈ కేసులో వాదనలను ముగించిన సీజే ధర్మాసనం
- ఈ నెల 30వ తేదీలోగా లిఖితపూర్వక వాదనలు సమర్పించాలని వాయిదా, తీర్పు రిజర్వ్



సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలకు ఎర కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) దర్యాప్తుపై తొలుత సింగిల్ జడ్జి స్టే విధించారు. ద్వి సభ్య ధర్మాసనం ఆ స్టేను ఎత్తివేస్తూ సింగిల్ జడ్జి పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలని ఆదేశించింది. దీనికి అప్పుడు బీజేపీ నేతలు అంగీకరించమే కాదు.. పలు పత్రికలు, మీడియాల్లో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అంటే సిట్ దర్యాప్తునకు వారు ఒప్పుకున్నట్లే కదా. ఇప్పుడు సిట్ వద్దు.. సీబీఐకి కేసును అప్పగించాలని కోరడం సరికాదు' అని సిట్ తరఫు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేలకు ఎర కేసులో బుధవారం వాదనలు కొనసాగాయి. కేసును సింగిల్ జడ్జి సీబీఐ దర్యాప్తునకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ సిట్, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ద్వి సభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించాయి. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ముందు దవే వాదనలు వినిపించారు. ఈ కేసులో ధర్మాసనం వాదనలు ముగించింది. లిఖిత పూర్వక వాదనల కోసం దవే సమయం కోరగా.. ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాలని వాయిదా వేశారు. తీర్పును రిజర్వ్ చేశారు.

"బీఎల్ సంతోష్ బెదిరిస్తున్నారు.."

'ఈ కేసులో ప్రతిపాదిత నిందితుడైన బీఎల్ సంతోష్ తొలుత సిట్ అరెస్టు నుంచి రక్షణ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు ఏకంగా సిట్‌లోని అధికారులను బెదిరిస్తున్నారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులకు ముందు.. తర్వాత అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఈ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉన్న ఇలాంటి వారి చర్యలను కోర్టులు అనుమతించకూడదు. పోలీసుల ఎఫ్ఐఆర్ రద్దును నిందితులు సహా ఎవరూ కోరలేదు. అలాంటప్పుడు సింగిల్ జడ్జి సిట్ దర్యాప్తును ఎలా బదిలీ చేస్తారు? వీడియోల్లో ఎమ్మెల్యేలను నిందితులు ప్రలోభపెడుతున్న వ్యాఖ్యలు ఉన్నాయి. నిందితులే తాము బీజేపీ తరఫున వచ్చామని, ఆ పార్టీలో చేరితే ఎమ్మెల్యేలపై ఐటీ, ఈడీ దాడులు జరగకుండా చూసుకుంటామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని, ఇతర లబ్ధి చేకూరుస్తామని చెబుతున్న వీడియోలున్నా.. వాటిని సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోకపోవడం సరైంది కాదు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోర్టు బాధ్యత. హైకోర్టులు, సుప్రీంకోర్టు దాన్ని విస్మరించవద్దు' అని దవే వాదించారు.

"అది పోలీసుల మనోధైర్యాన్నే దెబ్బతీస్తుంది"

'సిట్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులంతా సీనియర్లు. గతంలో అత్యంత క్లిష్టమైన కేసులను వారు దర్యాప్తు చేశారు. అలాంటి ఘనత ఉన్న అధికారుల దర్యాప్తు తీరును.. ఒక్క సీఎం ప్రెస్‌మీట్‌ను పరిగణనలోకి తీసుకుని తప్పుబట్టడం సరైంది కాదు. సరైన కారణంగా చూపకుండా, అనుమానాలతో కేసును సీబీఐకి అప్పగిస్తే.. అది పూర్తిగా పోలీసుల మనోధైర్యాన్నే దెబ్బతీస్తుంది. దర్యాప్తు పారదర్శకంగా సాగడం లేదు అనడానికి ఒక్క ఆధారాన్ని కూడా నిందితులు చూపలేదు. గతంలో ఇతర రాష్ట్రాల్లో పలు కేసులకు సంబంధించి ముఖ్యమంత్రులు ఒకలా ఆరోపణలు చేస్తే, పోలీసు దర్యాప్తు అనంతరం ఆ ఆరోపణలు తప్పు అని తేలింది(ఆ కేసుల వివరాలను వెల్లడించారు). ఆ కేసులను పరిశీలిస్తే.. సీఎం చెప్పినంత మాత్రాన అది పోలీస్ దర్యాప్తును ప్రభావితం చేస్తుంది అనడం ఔచిత్యం కాదు. ప్రతివాదుల తరఫు న్యాయవాదులు చెప్పిన కొన్ని కేసుల్లో మంత్రులు నిందితులుగా ఉన్న కారణంగానే అక్కడి కోర్టులు లేదా సుప్రీంకోర్టు కేసును సీబీఐకి అప్పగించింది. కానీ, ఇక్కడ నిందితులు, బాధితులు మంత్రులు కాదన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. కేసును సీబీఐకి అప్పగించడం సరికాదు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టివేయాలి. సిట్ దర్యాప్తు కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలి' అని సుప్రీంకోర్టు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. కాగా, ద్వి సభ్య ధర్మాసనం ఏ తీర్పు ఇచ్చినా 15 రోజులపాటు అమలును నిలుపుదల చేయాలని దవే కోరారు. తీర్పు అనుకూలంగా లేని వారు సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సమయం ఇవ్వాలన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
గురువారం ॥ 19-1-2023

చిందర వందరగా ఉన్న ఇల్లు
చిందర వందరగా ఉన్న
మనసుకు కారణం.
సర్దుకున్న ఇల్లు
సేదతీరిన మనసుకు సూచన.
ఎలా పడితే అలా ఉండి
పనికిమాలిన వస్తువులతో నిండి
కుదురుగా కనిపించని
ఇంట్లో నివాసం
స్త్రీల మానసిక ఆరోగ్యాన్ని
దెబ్బ తీస్తుంది.
ఎందుకంటే స్త్రీలు ఎక్కువ సమయం
గడిపే చోటు ఇల్లు గనుక.
స్త్రీలు తమ పరిసరాలను సర్దుకోవడం,
అందంగా మార్చుకోవడం వల్ల
మీ మానసిక ఆరోగ్యం బాగుంటుంది
అంటున్నారు నిపుణులు.

మానసిక ఆరోగ్యం

మీ గది మీ మది



రోడ్డు మీద వెళుతున్నప్పుడు చెత్త చెదారం కంట పడగానే మనసుకు ఒక రకమైన ఏహ్యభావం కలుగుతుంది. అలాగే మనం నివసించే ఇల్లు, గదులు కూడా చిందర వందరగా ఉంటే మనసుకు ఉల్లాసం పోతుంది. మనం నివాసం ఉండే ఇల్లుగాని, పని చేసే ఆఫీస్‌గాని సర్వకాల సర్వ వేళల్లో శుభ్రంగా ఉండాలని ఆశించడం కుదరదు. కాని వీలున్నంత మటుకు ఎప్పటికప్పుడు సర్దుకోవడం వల్ల వస్తువుల అపసవ్యత దృష్టికి రాకుండా చూసుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం బాగుంటుందని, సరైన కెమికల్స్ విడుదలయ్యి ఒక ప్రశాంతత ఉంటుందని, ఫోకస్డ్‌గా పని చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. కౌటుంబిక, ఆర్థిక సమస్యలు లేకపోయినా శుభ్రత లేని పరిసరాలు మీ నైపుణ్యాన్ని తగ్గిస్తాయి. మనసును చికాకు పెడతాయి. పరిసరాలు మనసును ఇబ్బంది పెట్టకుండా ఉండాలంటే ఇవి చేయాలి.

1. ఇల్లు మీ కార్యక్షేత్రంగా ఉందా లేదా చూసుకోవాలి. ప్రతి వస్తువుకు ఒక స్థలం ఉంటుంది. ఉండాలి. లేకపోతే కేటాయించుకోవాలి. చిన్న ఇల్లు అని వంక పెట్టవద్దు. చిన్న ఇల్లు కూడా చాలా నీట్‌గా సర్దుకోవచ్చు.
2. లాండ్రీ, గిన్నెలు, చెత్త పారేయడం... ఈ మూడు పనులు మీరు చేసుకున్నా పని మనిషి చేసినా పర్‌ఫెక్ట్‌గా ప్రతిరోజూ జరిగేలా చూసుకుంటే మనసుకు సగం ప్రశాంతత.
3. ఇల్లు శుభ్రంగా ఉంచుకోవాలంటే పాతవి, అక్కర్లేనివి, కంటికి ఇబ్బంది కలిగించేవి నిర్దాక్షిణ్యంగా పారేయాలి. అతి తక్కువ వస్తువులతో జీవించాలని దీని అర్థం కాదు. మీకు అవసరమైన వస్తువులు మాత్రమే ఉంటే బాగుంటుంది.
4. ఇల్లు సర్దుకోవడానికి రోజులో కొంత సమయం కేటాయించాలి. ఇంటి సభ్యులందరూ ఏదో ఒక టైమ్‌లో ఇల్లు సర్దడానికి పది నిమిషాలు ఇవ్వాలి. నెలకోసారి సర్వ ప్రక్షాళన అనేది తప్పు భావన. కొద్ది కొద్దిగా నీట్‌గా చేసుకుంటూ రావడమే మంచిది.
5. పొందిగ్గా సర్దబడి, చక్కటి మొక్కలు ఉండి, గాలి వెలుతురు తగినంతగా వస్తూ ఉన్న ఇల్లు మీదైతే మీ మానసిక ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉండటానికి పూర్తి అవకాశం ఉంది.

కేస్ స్టడీ 1:

సురేఖ వంటగదిలో ఎప్పుడూ చిరాగ్గా కోపంగా ఉంటుంది. పిల్లలు వెళితే కసురుతూ ఉంటుంది. ఆమె వంట చేస్తున్నప్పుడు ఆ సమయానికి పనిమనిషి ఇంకా రాకపోవడం వల్ల సింక్ నిండుగా ఉంటుంది. కావలిసిన వంట పాత్రలు వెంటనే దొరకవు. సరుకుల డబ్బాలను కుదురుగా పెట్టుకోవడాన్ని సురేఖ ఏనాడూ పట్టించుకోదు. కిచెన్ ప్లాట్‌ఫామ్ నీట్‌గా ఉండదు. తను శుభ్రంగా ఉన్నా, ఇంట్లో ఇతరత్రా ఏ సమస్యలు లేకపోయినా ఆ సమయంలో బయట వాతావరణం బాగున్నా వంట గదిలో సురేఖ మానసిక స్థితి మాత్రం ప్రశాంతంగా ఉండదు. అదే ఆమె వంట గదిని సరిగ్గా సర్దుకుని ఉంటే, వంట మొదలెట్టే సమయం కంటే ముందే వచ్చి పాత్రలు శుభ్రం చేసి వెళ్లే పని మనిషిని పెట్టుకుని ఉంటే, వంట గదిలో అనవసరమైన పాత గిన్నెలు, బూజు పట్టిన గంగాళాలు వదిలించుకుని ఉంటే ఆమె ప్రతి పూట హాయిగా వంట చేసుకుని ఉండేది.

కేస్ స్టడీ 2:

రాజేశ్వరి ఆఫీస్ నుంచి ఇల్లు చేరుకోగానే ఆమె చిరాకు నషాళానికి ఎక్కుతుంది. అప్పటికి పిల్లలిద్దరూ స్కూళ్ల నుంచి ఇంటికి వచ్చి ఉంటారు. చిప్స్ తిని రేపర్లు సోఫాలో పడేసి ఉంటారు. టవళ్లు కుర్చీలో పడేసి ఉంటారు. యూనిఫామ్ బట్టలు ఎలాగంటే అలా పడేసి ఉంటారు. పొద్దున చదివిన న్యూస్‌పేపర్లు చిందర వందరగా ఉంటాయి. తాళం కప్ప ఒక చోట, దాని తాళం ఇంకో చోట. పుస్తకాల సంచుల్ని టీవీ స్టాండ్ దగ్గర పడేసి ఉంటారు. వచ్చిన వెంటనే ఆమెకు ఇల్లు సర్దుకునే ఓపిక ఉండదు. హాల్లో కూచుందామంటే ఈ చిందర వందర అంతా ఆమెకు హాయినివ్వదు. పిల్లలు ఎన్నిసార్లు చెప్పినా వినరు. తాను ఇంటికి వచ్చే సరికి ఇల్లు శుభ్రంగా, కుదురుగా కనిపిస్తే వచ్చి హుషారుగా పలకరిద్దామని ఉంటుంది. కాని ఆ స్థితి లేకపోవడం వల్ల రోజూ రావడంతోటే పిల్లల్ని కసరడం, దాని వల్ల తాను బాధ పడటంతో మూడ్ ఆఫ్. ఇలా రోజు జరగడం అవసరమా?

కేస్ స్టడీ 3:

సంధ్య వాళ్ల ఇల్లు ఎప్పుడూ శుభ్రంగా ఉండదు. ఇంటికి వచ్చిన వాళ్లు ఈ ఇంట్లో వాళ్లకు ఇల్లు సర్దుకోవడం, ఇల్లు శుభ్రంగా ఉంచుకోవడం రాదు అని ఒక్క నిమిషంలో తెలిసిపోతుంది. వాళ్లు ఎక్కువ సేపు కూచోరు. సంధ్యకు ఇల్లు సర్దుకోవాలని ఉంటుందిగాని దానికి ఏదో ముహూర్తం కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఆదివారం సర్దుదామనుకుంటుంది... ఆ రోజు ఏదో పని పడుతుంది. హ్యాంగర్లకు మాసిన బట్టలు, కుర్చీల్లో ఉతికిన బట్టలు, వారం అయినా మంచాల మీద మారని దుప్పట్లు... సంధ్యకు ఏ పని చేయాలన్నా మనసు రాదు. ఐదు నిమిషాల పని పది నిమిషాలు పడుతుంటుంది. ఉండి ఉండి ఆందోళనగా అనిపిస్తుంటుంది. ఏదో ఇష్టం లేని ప్లేస్‌లో చిక్కుకుపోయినట్టుగా అనిపిస్తుంటుంది. శుభ్రమైన గదే శుభ్రమైన మదికి సాయం చేస్తుందని ఆమెకు ఎప్పటికి తెలుస్తుందో.

ఆన్‌లైన్‌లో మీరు పోస్ట్ చేసినదాని వాల్యూని లైక్స్, కామెంట్స్, రివ్యూస్ ద్వారా కొలుస్తారు. మిమ్మల్ని తప్పుదారి పట్టించే, హాని కలిగించే కంటెంట్, పుకార్లు, ఫొటోలు, రివ్యూలు లేదా సమస్యాత్మకమైన సైట్‌ల నుండి తెలియని పోస్ట్‌లు సోషల్ మీడియా సెర్చింగ్‌లో కనిపిస్తే ఏం జరుగుతుంది?!

మీ బ్రాండ్ కాపాడుకోండి..

సైబర్ టాక్



తమకు కావల్సిన వారి వివరాలను సేకరించడానికి సోషల్ మీడియా ప్రొఫైల్‌లను తనిఖీ చేయడం అనేది ఈ రోజుల్లో రొటీన్‌గా మారింది కాబట్టి ఎవరికి వారు జాగ్రత్తగా ఉండటం అవసరం. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఏదైనా బ్రాండ్ లేదా సెలబ్రిటీల విషయాలను బయటకు తీసుకు రావడానికి తప్పనిసరిగా కొంత టైమ్, కృషిని పెట్టుబడిగా పెడతారు. సోషల్ ప్లాట్‌ఫారమ్‌లను వినోదం లేదా సామాజిక నెట్‌వర్క్ కోసం ఉపయోగించడంలో తప్పు లేదు కానీ బ్రాండ్, సెలబ్రిటీల విషయాలను ఆన్‌లైన్‌లో సరిగ్గా నిర్వహించడంలో అవగాహన మాత్రం తప్పనిసరి.

నోటిఫికేషన్ నిర్వహణ

- సోషల్ మీడియా గెయిన్ గ్రూప్‌లు, కమ్యూనిటీలలో భాగం కావాలి. ఇన్‌ఫ్లుయెన్సర్లు /ఫ్యాన్స్/పోటీదారులు మిమ్మల్ని అనుసరిస్తున్నారో లేదో చెక్ చేస్తుండాలి. మీ ఫ్రెండ్స్ జాబితాలో ఎలాంటి వ్యక్తులు ఉన్నారో చెక్ చేసుకోవాలి. అలాగే, కంటెంట్ షేర్ చేయడంలో, పోస్ట్ చేయడంలో చురుగ్గా ఉండాలి.
- ప్రతికూల కంటెంట్‌ను సమర్థంగా అణిచివేయగలగాలి. విశ్లేషించడం, ప్రచారం చేయడం, ప్రతికూల పోస్ట్‌ల కారణంగా జరిగిన నష్టాన్ని సవరించుకోవాలి. ● కంటెంట్ నియంత్రణకు డూప్లికేట్, కాపీరైట్ ఉల్లంఘన, ఇతర విషయాల జాడలను తొలగించాలి. ● మీ డిజిటల్ బ్రాండ్ గుర్తింపు, విజిబిలిటీ, విశ్వసనీయతను సరిగ్గా నిర్వహించడం ద్వారా ఆన్‌లైన్‌లో బ్రాండ్ లేదా సెలబ్రిటీగా నిలబెడుతుంది. పోటీ నుండి వేరు చేస్తుంది. ● మీ ఆన్‌లైన్ బ్రాండ్‌ను సెట్ చేయడానికి అన్ని సోషల్ మీడియా ఛానెల్‌లలో స్థిరమైన, పాజిటివ్ కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్నారని నిర్ధారించుకోండి. ● మీ ఆన్‌లైన్ ప్రేక్షకులను పెంచడంలో మీకు సహాయపడే సానుకూల కంటెంట్‌ను పోస్ట్ చేయడానికి కొత్త సైట్‌లు, సమూహాలను కనుక్కోండి. ● ఇంటర్నెట్‌లో మీ ప్రతిష్ఠను దెబ్బతీయకుండా ఉండాలంటే ప్రతికూల వ్యాఖ్యలు, పోస్ట్‌లకు త్వరగా ప్రతిస్పందించాలి. ● మీ ఫోన్, ఇతర పరికరాల జీపీఎస్ నుండి మీకు అనుకూలమైన ప్రకటనల ప్రచారాలు, ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన సమాచారాన్ని అందించడానికి కంపెనీలు మీరున్న ప్లేస్‌ను ట్రాక్ చేస్తాయి. అందుకని, గోప్యతా సెట్టింగ్స్ చేసుకోండి.

ఆన్‌లైన్‌లో దాడి

- ఫాలోవర్స్ నుండి అనుచిత వ్యాఖ్యలు, తప్పుడు ఆరోపణలు, పరువు నష్టం కలిగించే తప్పుడు ప్రకటనలు, మీ బ్రాండ్ లేదా సెలబ్రిటీ ఆన్‌లైన్ ఇమేజ్ అవమానపరిచేలా వెబ్ పేజీలు సెటప్ చేసి ఉంటాయి.

మంచి మార్గం

- సోషల్ మీడియాలో మీ కంటెంట్‌ను పోస్ట్ చేయడానికి ముందు వార్తాపత్రికలు, వార్తా సైట్‌లు, పరిశోధన పత్రాలు, రేడియో, టెలివిజన్ ప్రకటనలు, పత్రికా ప్రకటనల నుంచి సమాచారం సేకరించుకోవాలి.

ఉనికికి చిట్కాలు

- మీ పోస్ట్‌లను షెడ్యూల్ చేయడానికి క్యాలెండర్‌ను సృష్టించండి.
- ప్రసిద్ధ హ్యాష్‌ట్యాగ్‌లను గుర్తించండి. ● ఇంటర్వ్యూల కోసం ప్రెస్, ఏజెన్సీల మద్దతు తీసుకోండి. ఇంటర్నెట్ ఎప్పటికీ మరచిపోదు, మీరు పోస్ట్ చేసిన వాటిని తిరిగి మీకు చూపుతుంది. Locobuzz, Reputology, Mention, Reputation Defender వంటి ప్రసిద్ధ ORM టూల్స్ ఉపయోగించండి. మీ బ్రాండ్ ఇమేజ్‌ని లోతుగా సెర్చ్ చేసి, మీ డిజిటల్ ఆస్తులతో పాటు నష్టాలు ఏమున్నాయో చెక్ చేయండి.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

సినిమా

ఆర్‌ఆర్‌ఆర్ ఫైట్స్‌కి అవార్డ్



● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ఈ జాబితాలో మరో అవార్డు చేరింది. సియాటెల్ ఫిలిం క్రిటిక్స్ సొసైటీ అవార్డ్స్‌లో బెస్ట్ యాక్షన్ కొరియోగ్రఫీ కేటగిరీలో అవార్డు దక్కించుకుంది. ఈ విషయాన్ని సదరు సొసైటీ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. విక్కీ ఆరోరా, ఇవాన్ కోస్టాడినోవ్, నిక్ పావెల్, రాయిచో వాసిలెవ్ స్టంట్స్ కో ఆర్డినేటర్లుగా చేయగా, ప్రేమ్ రక్షిత్, దినేశ్ కృష్ణన్ స్టంట్స్ కొరియోగ్రఫీ చేశారు. హాలీవుడ్ చిత్రాలు 'అవతార్: ది వే ఆఫ్ వాటర్, ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ అట్ ఒన్స్, ది నార్త్‌మేన్, టాప్ గన్: మ్యావరిక్'లతో పోటీపడి 'ఆర్‌ఆర్ ఆర్' అవార్డు దక్కించుకోవడం విశేషం.

ఫిబ్రవరిలో టీఎఫ్‌పీసీ ఎన్నికలు

- టీఎఫ్‌పీసీ నుంచి ఇద్దరు నిర్మాతల బహిష్కరణ - సి. కల్యాణ్



''తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి (టీఎఫ్‌పీసీ) ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని కొందరు సభ్యులు రాద్ధాంతం చేస్తున్నారు. దీనిపై టీఎఫ్‌పీసీ కమిటీ చర్చించి, ఫిబ్రవరి 19న ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నాం'' అని టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు సి. కల్యాణ్ అన్నారు. తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి బుధవారం సమావేశం అయింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను మీడియాకి సి. కల్యాణ్ వెల్లడించారు.

● కొద్దిరోజులుగా తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలిపై కొందరు బురద జల్లుతున్నారు. కొందరు నిర్మాతలు ఛాంబర్ వద్ద టెంట్ వేసి అపనిందలు వేశారు. టీఎఫ్‌పీసీలో 1200మంది సభ్యులున్నారు. వారిలో 10 శాతం మంది కూడా టెంట్ వేసి పోరాడుతున్న వారిలో లేరు. సంస్థకి చెడ్డపేరు తెచ్చేలా మాట్లాడిన నిర్మాత కె. సురేష్ కుమార్‌ని మూడేళ్లు 'టీఎఫ్‌పీసీ' నుంచి సస్పెండ్ చేశాం. అయితే ఆయన సినిమాలు తీసుకోవడానికి అభ్యంతరం లేదు. అలాగే మరో నిర్మాత యలమంచి రవికుమార్‌ని శాశ్వతంగా బహిష్కరిస్తున్నాం.

● టీఎఫ్‌పీసీలో నిధుల దుర్వినియోగం, వృథా జరగలేదు. ప్రస్తుతం 9 కోట్ల ఫండ్ ఉంది. ఇంత భారీ ఫండ్ రావడానికి కారణం దాసరి నారాయణరావుగారే. టీఎఫ్‌పీసీకి తిరుపతిలో బిల్డింగ్ ఉంది. మూవీ టవర్స్‌లో 2 కోట్ల 40 లక్షలు పెట్టుబడి పెడితే 10 కోట్లకు చేరింది. 2022 డిసెంబర్ 31 వరకు అకౌంట్స్ ఈసీలో పాస్ అయ్యాయి.. ఎవరికైనా అభ్యంతరాలుంటే ప్రశ్నించవచ్చు.

● నంది (ఆంధ్రప్రదేశ్), సింహ (తెలంగాణ) అవార్డుల గురించి ఇద్దరు ముఖ్యమంత్రులను (వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కేసీఆర్) కలిసి మాట్లాడనున్నాం. అలాగే ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా 'సౌత్ ఇండియా ఫిలిం ఛాంబర్' ఉంది. దానికి అనుబంధంగా తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఉన్నాయి. అంతేకానీ ఆంధ్ర ఫిలిం ఛాంబర్, ఆంధ్ర ఫిల్మ్ ఫెడరేషన్ వంటి సంస్థలకు మాకు సంబంధం లేదు.

● ఎన్నికలకు ఫిబ్రవరి 1 నుంచి 6వ తేదీ వరకు నామినేషన్స్ ప్రక్రియ కొనసాగుతుంది. కె. దుర్గా ప్రసాద్ ఎన్నికల అధికారిగా కొనసాగుతారు. నామినేషన్లు వేసిన వారు 13వ తేదీ వరకు విత్ డ్రా చేసుకోవచ్చు.. స్క్రూటినీ తర్వాత ఫైనల్ లిస్ట్‌ను నోటీస్ బోర్డ్‌లో ఉంచుతాం. 19నే విజేతలను ప్రకటిస్తాం'' అన్నారు. ఈ సమావేశంలో టీఎఫ్‌పీసీ సభ్యులు టి. ప్రసన్న కుమార్, వైవీఎస్ చౌదరి, రామసత్యనారాయణ పాల్గొన్నారు.



● మహేశ్‌బాబు

ఆన్ యాక్షన్

ఇటీవలే ఫ్యామిలీతో హాలిడే ట్రిప్‌కి వెళ్లి రిలాక్స్ అయిన మహేశ్‌బాబు ఇప్పుడు రిస్కీ ఫైట్స్ చేస్తున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా సూర్యదేవర నాగవంశీ ఓ సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. మహేశ్‌బాబు, కొందరు ఫైటర్స్ పాల్గొనగా స్టంట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ ఆధ్వర్యంలో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. మహేశ్ సరసన పూజా హెగ్డే, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతదర్శకుడు. ఆగస్ట్ 11న ఈ చిత్రం విడుదల కానుంది.

అంతకుమించి సాధించేది ఏముంటుంది

- వంశీ పైడిపల్లి



''వారసుడు' సినిమా క్లయిమాక్స్‌లో తండ్రీకొడుకుల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు మా మనసులను హత్తుకున్నాయి అంటూ ప్రతి రోజూ నాకు ఫోన్ కాల్స్ చేస్తున్నారు. మా నాన్న కూడా 'వారసుడు' చూసి భావోద్వేగానికి లోనై ఇన్నేళ్లలో తొలిసారి నన్ను హత్తుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతకుమించి నేను సాధించేది ఏముంటుంది?'' అని డైరెక్టర్ వంశీ పైడిపల్లి అన్నారు. విజయ్, రష్మికా మందన్న జంటగా నటించిన తమిళ చిత్రం 'వారీసు'. 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళంలో విడుదలైంది. ఈ చిత్రాన్ని 'వారసుడు' పేరుతో తెలుగులో డబ్ చేసి, ఈ నెల 14న రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వంశీ పైడిపల్లి పంచుకున్న విశేషాలు.

● 'ఊపిరి'ని తెలుగు, తమిళ భాషల్లో తీశాం. 'వారీసు'ని తమిళంలో తీసి, తెలుగులోకి డబ్ చేశాం. తమిళంలో నేను తీసిన తొలి సినిమా 'వారీసు' పెద్ద హిట్ కావడం హ్యాపీ. తెలుగులోనూ ఈ సినిమా త్వరలో 'మాస్టర్' (విజయ్ హీరోగా నటించారు) కలెక్షన్లను బీట్ చేయబోతోంది. 'దిల్' రాజుగారికి ఈ సినిమా డబ్బుతో పాటు గౌరవం తెచ్చి పెట్టింది. మౌత్ టాక్ వల్ల ఈ చిత్రానికి ఆదరణ పెరుగుతోంది. సినిమా చూసిన యువకులు తమ అవ్వ, తాతలు, ఇతర కుటుంబ సభ్యులకు ఈ చిత్రాన్ని చూడమని చెప్తున్నారు. హిందీలో కూడా మా సినిమాకి ఆదరణ పెరుగుతోంది. ● నేను ఓ లైన్ సిద్ధం చేసుకుని హీరోలకు వినిపిస్తాను.. వారు ఓకే అన్న తర్వాత వారి ఇమేజ్‌కి తగినట్లుగా సన్నివేశాలను రూపొందిస్తాను. ప్రతిసారీ మమ్మల్ని మేము నిరూపించుకోవాలి. అందుకే నా ప్రతి చిత్రాన్ని ఛాలెంజ్‌గా స్వీకరిస్తుంటాను. 2020లో మహేశ్‌బాబుగారితో ఓ సినిమా చేయాల్సింది. కొన్ని కారణాల వల్ల కుదరలేదు. పెద్ద స్టార్స్‌తో కమర్షియల్ సినిమాలు చేయడానికే నేను ఇండస్ట్రీకి వచ్చాను. నా తర్వాతి ప్రాజెక్ట్ కోసం ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి.

ఏడి నా ఏలిక



● సమంత

మహాకవి కాళిదాసు రచించిన సంస్కృత నాటకం అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా రూపొందిన చిత్రం 'శాకుంతలం'. శకుంతల పాత్రలో సమంత, దుష్యంతుడి పాత్రలో దేవ్ మోహన్ నటించారు. గుణశేఖర్ దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'మల్లికా మల్లికా మాలతీ మాలికా.. చూడవా చూడవా ఏడి నా ఏలిక' అంటూ సాగే పాటను బుధవారం విడుదల చేశారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ పాటను రమ్య బెహ్రా పాడారు. ఈ చిత్రం ఫిబ్రవరి 17న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది.

ఆనందరావు సాహసాలు



● సుహాస్

'సుహాస్ హీరోగా రామ్ పసుపులేటి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఆనంద రావు అడ్వెంచర్స్'. ఉదయ్ కోలా, విజయ్ శేఖర్ అన్నే, సురేష్ కోతింటి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభమైంది. 'ఆనందరావు అడ్వెంచర్స్' టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో రానా రిలీజ్ చేయగా, దర్శకుడు క్రిష్ స్క్రిప్ట్‌ను టీమ్‌కి అందించారు. ''చిల్డ్రన్ ఫ్యాంటసీ కథతో తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు రామ్ పసుపులేటి. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, కెమెరా: రాకేష్ ఎస్. నారాయణ్, సహ నిర్మాతలు: సుహాసిని రాహుల్, మురళీ జంపన.

కస్టడీలో రేవతి



● కృతీ శెట్టి

ఇక్కడున్న ఫొటో చూశారుగా... చెమర్చిన కళ్లతో, విషణ్ణ వదనంతో కనబడుతున్నారు కస్టడీలో ఉన్న కృతీ శెట్టి. నాగచైతన్య సరసన నటిస్తున్న 'కస్టడీ' చిత్రంలో కృతీ శెట్టి లుక్ ఇది. బుధవారం కృతీ లుక్ రిలీజ్ చేసి, ఆమె పోషిస్తున్న పాత్ర పేరు రేవతి అని ప్రకటించింది చిత్ర యూనిట్. వెంకట్ ప్రభు దర్శకత్వంలో పవనకుమార్ సమర్పణలో తెలుగు, తమిళ భాషల్లో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''ప్రస్తుతం చివరి దశ షూటింగ్ జరుగుతోంది. మే 12న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

అర్జునే పరిష్కరించాలి



● భరత్, శ్రీకాంత్, సుధీర్‌బాబు

సుధీర్‌బాబు హీరోగా మహేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హంట్'. వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో ప్రభాస్ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. 'ఏ కేసును అయితే అర్జున్ మొదలుపెట్టి సాల్వ్ చేయలేకపోయాడో.. అదే కేసును ఇప్పుడు ఈ అర్జున్ సాల్వ్ చేయాలి' అంటూ నటుడు శ్రీకాంత్ చెప్పే డైలాగుతో ట్రైలర్ స్టార్ట్ అయ్యింది. ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ– ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. టీజర్, ట్రైలర్‌లో యాక్షన్ సీక్వెన్సులు బావున్నాయని చెబుతుండటం హ్యాపీ'' అన్నారు. శ్రీకాంత్, భరత్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: అరుల్ విన్సెంట్, సంగీతం: జిబ్రాన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అన్నే రవి.

ఆమె సవాల్



● రుహాని, నాని

'చిలసౌ' చిత్రంతో తెలుగుకు పరిచయమైన రుహానీ శర్మ 'హిట్'లో ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా చేసి, ఆకట్టుకున్నారు. తాజాగా 'హర్' (ఆమె) అనే చిత్రంలో పోలీసాఫీసర్ పాత్ర చేశారామె. ఈ చిత్రం టీజర్‌ని హీరో నాని బుధవారం విడుదల చేశారు. సస్పెన్షన్ తర్వాత ఓ హత్య కేసును ఛేదించడానికి తిరిగి ఖాకీ డ్రెస్ ధరించిన రుహానీ శర్మ సీన్‌తో ఈ టీజర్ ఆరంభమవుతుంది. శ్రీధర్ స్వరగావ్ దర్శకత్వంలో రఘు సంకురాత్రి, దీపా సంకురాత్రి నిర్మించిన ఈ చిత్రాన్ని డబుల్ అప్ మీడియాస్ సంస్థ రిలీజ్ చేయనుంది. ''ఇందులో రుహానీది చాలెంజింగ్ రోల్'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

వాటివల్లే గుర్తింపు - అర్జున్ దాస్



''బుట్టబొమ్మ' తమిళ్ రీమేక్ అయినా తెలుగుకి తగ్గట్టు మార్పులు చేశారు. తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ సినిమా కొత్త అనుభూతిని ఇస్తుందని నాగవంశీగారు నమ్మారు'' అని నటుడు అర్జున్ దాస్ అన్నారు. అనికా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రల్లో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బుట్టబొమ్మ'. ఎస్.నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలకానుంది. అర్జున్ దాస్ మాట్లాడుతూ– ''ఖైదీ, అంధకారం, మాస్టర్' సినిమాల వల్లే నాకు ఇంత మంచి గుర్తింపు వచ్చింది. అందరూ నా వాయిస్ గురించి మాట్లాడుతుంటారు. 'బుట్టబొమ్మ' ఒప్పుకునే ముందు వంశీగారు కూడా డబ్బింగ్ చెప్పాలని షరతు పెట్టడంతో చెప్పాను'' అన్నారు.



5 వన్డేల్లో సచిన్, సెహ్వాగ్, రోహిత్ శర్మ (3 సార్లు), ఇషాన్ కిషన్ తర్వాత డబుల్ సెంచరీ సాధించిన ఐదో భారత ఆటగాడిగా గిల్ నిలిచాడు. మరో ముగ్గురు గేల్, గప్టిల్, ఫఖర్ జమాన్ మాత్రమే వన్డేల్లో డబుల్ సెంచరీలు చేశారు. ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా (23 ఏళ్ల 132 రోజులు) కూడా గిల్ గుర్తింపు పొందాడు.

1 న్యూజిలాండ్‌పై భారత బ్యాటర్ అత్యధిక స్కోరు ఇదే (208). గతంలో సచిన్ టెండూల్కర్ (1999లో ; హైదరాబాద్‌లోనే) ఎల్బీ స్టేడియంలో 186 పరుగులు సాధించాడు.

గిల్ హల్‌చల్

ఎవరన్నారు వన్డేలకు కాలం చెల్లిందని... ఎవరన్నారు 100 ఓవర్లు చూడటమంటే బోరింగ్, సమయం వృథా అని... హైదరాబాద్ స్టేడియంలో బుధవారం మ్యాచ్ చూసిన తర్వాత అలాంటి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాల్సిందే... భారీగా పరుగులు, సిక్సర్ల వరద, రికార్డులు, ఉత్కంఠ, ఉద్వేగం... ఒక్కటేమిటి అన్ని భావాలు ఉప్పల్ మైదానంలో కనిపించాయి. అతి సునాయాస విజయం అనుకున్నది కాస్తా ఆఖరి ఓవర్ వరకు వెళ్లింది.

శుబ్‌మన్ గిల్ సూపర్ బ్యాటింగ్‌తో డబుల్ సెంచరీ సాధించి అరుదైన ఆటగాళ్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకొని తొలి సగం ఆటలో హైలైట్‌గా నిలిచాడు. అయితే భారత్ భారీ స్కోరు చేయగానే గెలుపు ఖాయం కాలేదు. 21.2 ఓవర్లలో ఏకంగా 219 పరుగులు చేయాల్సిన సుదూర లక్ష్యం ముందుండగా... న్యూజిలాండ్ టి20 తరహాలో మెరుపు షాట్లతో పోరాడింది. మైకేల్ బ్రేస్‌వెల్ వీర బాదుడుకు భారత శిబిరంలో అలజడి రేగింది. ఒకదశలో టీమిండియా ఓటమి దిశగా కూడా వెళుతున్నట్లు అనిపించింది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా... రెండో బంతికి ఆఖరి వికెట్ తీసి భారత్ ఊపిరి పీల్చుకుంది. మొత్తంగా అభిమానులకు ఫుల్ వినోదం అందింది.

- భారత ఓపెనర్ డబుల్ సెంచరీ
- తొలి వన్డేలో 12 పరుగులతో టీమిండియా విజయం
- బ్రేస్‌వెల్ వీరోచిత శతకం వృథా
- పోరాడి ఓడిన న్యూజిలాండ్

సాక్షి, హైదరాబాద్: హోరాహోరీ సమరంలో పైచేయి సాధించిన భారత్ వన్డే సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. బుధవారం చివరి ఓవర్ వరకు ఉప్పల్ స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 12 పరుగుల స్వల్ప తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (149 బంతుల్లో 208; 19 ఫోర్లు, 9 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో చెలరేగాడు. అనంతరం న్యూజిలాండ్ 49.2 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. మైకేల్ బ్రేస్‌వెల్ (78 బంతుల్లో 140; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగగా, మిచెల్ సాన్‌ట్నర్ (45 బంతుల్లో 57; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 17 ఓవర్లలోనే 162 పరుగులు జోడించడం విశేషం. సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడిన పేసర్ మొహమ్మద్ సిరాజ్ 4 కీలక


బ్రేస్‌వెల్


సిరాజ్

వికెట్లు పడగొట్టాడు. సిరీస్‌లోని రెండో వన్డే ఈనెల 21న రాయ్‌పూర్‌లో జరుగుతుంది.

కోహ్లి విఫలం...

భారత్‌కు రోహిత్ శర్మ (38 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), గిల్ మరోసారి శుభారంభం అందించారు. వీరిద్దరు చక్కటి షాట్లతో పరుగులు సాధించడంతో తొలి 10 ఓవర్లలో భారత్ 52 పరుగులు చేసింది. అయితే తక్కువ వ్యవధిలో రోహిత్, కోహ్లి (8), ఇషాన్ కిషన్ (5)లను అవుట్ చేసి న్యూజిలాండ్ ఆధిక్యం ప్రదర్శించింది. మరోవైపు గిల్ మాత్రం పట్టుదలగా నిలబడ్డాడు. అతనికి సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 31; 4 ఫోర్లు), హార్దిక్ పాండ్యా (38 బంతుల్లో 28; 3 ఫోర్లు) తగిన సహకారం అందించారు. గిల్ నాలుగో వికెట్‌కు సూర్యతో 65 పరుగులు, ఐదో వికెట్‌కు హార్దిక్‌తో 74 పరుగులు జోడించాడు. కవర్స్‌లో సులువైన క్యాచ్ ఇచ్చి సూర్య వెనుదిరగ్గా... వివాదాస్పద రీతిలో హార్దిక్ అవుటయ్యాడు. బంతి హార్దిక్ బ్యాట్‌ను తాకకుండానే కీపర్ చేతుల్లోకి వెళ్లినట్లుగా, కీపర్ చేతులతోనే బెయిల్స్ కదిలినట్లుగా టీవీ రీప్లేలో కనిపించింది. అయితే దీనిపై స్పష్టత లేకపోగా, హార్దిక్‌ను అంపైర్ బౌల్డ్‌గా ప్రకటించాడు. 40 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 251 పరుగులకు చేరింది. అయితే కివీస్ బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు రావడం కష్టంగా మారింది. ఒక దశలో 40–47 ఓవర్ల మధ్య ఒక ఫోర్, ఒక సిక్స్ మాత్రమే వచ్చాయి. అయితే చివర్లో గిల్ సునామీ బ్యాటింగ్ ఒక్కసారిగా ఆటను మార్చేసింది. చివరి 10 ఓవర్లలో భారత్ 98 పరుగులు సాధించింది.

ఆ క్యాచ్‌లు పట్టి ఉంటే...

గిల్‌కు కాస్త అదృష్టం కూడా కలిసొచ్చింది. 45 పరుగుల వద్ద అతను ఇచ్చిన క్యాచ్‌ను వదిలేసిన కీపర్ లాథమ్, అదే బంతికి స్టంపింగ్ చేసే సునాయాస అవకాశాన్ని కూడా చేజార్చాడు. ఆ తర్వాత షిప్లీ తన బౌలింగ్‌లోనే రిటర్న్ క్యాచ్ వదిలేసినప్పుడు గిల్ స్కోరు 122 పరుగులు.

మెరుపు భాగస్వామ్యం....

భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ మొదటి నుంచీ తడబడింది. ఏ దశలోనూ టీమ్ గెలుపు దిశగా సాగుతున్నట్లు అనిపించలేదు. ఆరంభంలోనే ఒకదశలో వరుసగా 23 బంతుల పాటు కివీస్ పరుగు తీయలేకపోయింది. ఫిన్ అలెన్ (39 బంతుల్లో 40; 7 ఫోర్లు, 1 సిక్స్) మాత్రం స్వేచ్ఛగా ఆడుతూ హార్దిక్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు, సిక్స్ కొట్టడం విశేషం. అనంతరం మిడిలార్డర్‌లో 19 పరుగుల వ్యవధిలో జట్టు 3 కీలక వికెట్లు కోల్పోయింది. అనుభవజ్ఞుడైన కెప్టెన్ టామ్ లాథమ్ (24) కూడా ప్రభావం చూపలేకపోయాడు. స్కోరు 131/6కు చేరడంతో కివీస్ కుప్పకూలేందుకు ఎంతో సమయం లేదనిపించింది. అయితే ఈ దశలో బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్ భారత బౌలర్లను ఆడుకున్నారు. కొరకరాని కొయ్యలుగా మారిపోయిన వీరిద్దరు చక్కటి షాట్లతో, సమన్వయంతో దూసుకుపోయారు. ఈ జోడీని విడదీసేందుకు భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. సాన్‌ట్నర్ 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, 57 బంతుల్లోనే బ్రేస్‌వెల్ శతకం అందుకున్నాడు. ఎట్టకేలకు 17 ఓవర్ల భాగస్వామ్యం తర్వాత సాన్‌ట్నర్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో భారత్ ఊరట చెందింది. అయితే మరో ఎండ్‌లో పోరాటం కొనసాగించిన బ్రేస్‌వెల్ విజయానికి చేరువగా తీసుకు రాగలిగాడు.



శుబ్‌మన్ గిల్

'శుబ్' ఘడియలు వచ్చేశాయి....

'ప్రతీ షాట్ అంతకంటే ముందు ఆడిన షాట్‌కంటే అందంగా కనిపించింది'... శుబ్‌మన్ గిల్ ఇన్నింగ్స్ గురించి ఏక వాక్య ప్రశంస ఇది. అందమే కాదు అద్భుతం అనిపించే షాట్లు కూడా అతను ఆడాడు. లేదంటే 182 పరుగుల స్కోరు నుంచి వరుసగా మూడు సిక్సర్లతో 'డబుల్ సెంచరీ'కి చేరాలంటే ఎంత సాహసం ఉండాలి. బుధవారం హైదరాబాద్‌లో గిల్ దానిని చేసి చూపించాడు. శ్రీలంకతో సిరీస్ తొలి వన్డేలో గిల్ ఓపెనింగ్ చేస్తాడని... అంతకుముందు మ్యాచ్‌లో 'డబుల్ సెంచరీ' చేసిన ఇషాన్ కిషన్‌కు చోటు లేదని రోహిత్ చెప్పడంతో ఎన్నో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు శుబ్‌మన్ వాటన్నింటినీ పటాపంచలు చేశాడు. తన ఆటలో ఉండే వాడి ఏమిటో కూడా ప్రదర్శించి వన్డేల్లో తాను ఎందుకు సరైనవాడినో నిరూపించుకున్నాడు.

గత మ్యాచ్‌లో సెంచరీ సాధించిన అతను ఈసారి డబుల్ సెంచరీతో సత్తా చాటాడు. ఫెర్గూసన్ వేసిన రెండో ఓవర్లో అతను కవర్స్ దిశగా కొట్టిన మొదటి ఫోర్ నిజంగా సూపర్. అలా మొదలైన పరుగుల లెక్క ఆపై జోరు అందుకొని ప్రవాహంలా మారింది. ముఖ్యంగా ఈ మ్యాచ్‌లో అతని పుల్ షాట్‌లు, ఎక్స్‌ట్రా కవర్ మీదుగా డ్రైవ్‌లు, బ్యాక్ ఫుట్ పంచ్‌లు అత్యుత్తమ రీతిలో సాగాయి. బ్రేస్‌వెల్ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్ సిక్స్‌తో 52 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. కివీస్ బౌలర్లలో ఎవరినీ వదలకుండా అతను చితక్కొట్టాడు. 87 బంతుల్లో అతని సెంచరీ పూర్తయినప్పుడు ఆనందం కనిపించింది కానీ... ముున్ముందు మరింత విధ్వంసం సృష్టించబోతున్నట్లు తనూ ఊహించి ఉండడు. ఒకవైపు సహచరులు వెనుదిరుగుతున్నా, తను మాత్రం పట్టుదలగా నిలబడి స్వేచ్ఛగా పరుగులు సాధిస్తూ పోయాడు. 150 పరుగుల మైలురాయి కూడా సిక్సర్‌తోనే పూర్తయింది. చివరి ఓవర్లలో కివీస్ బౌలింగ్ అనూహ్యంగా మెరుగైంది. పరుగులు రావడం కష్టంగా మారింది. ఇలాంటి సమయంలో టిక్నర్ వేసిన ఇన్నింగ్స్ 48వ ఓవర్... రెండు సిక్స్‌లతో గిల్ చెలరేగిపోయాడు. ఫెర్గూసన్ వేసిన 49వ ఓవర్... తొలి మూడు బంతుల్లో ఫైన్ లెగ్, లాంగాఫ్, లాంగాఫ్...వరుసగా మూడు సిక్సర్లు... 145 బంతుల్లో డబుల్ సెంచరీ... అరుదైన మైలురాయిని దాటిన గిల్ గర్జిస్తూ విజయనాదం చేశాడు. 58 బంతుల్లోనే తర్వాతి వంద అతని ఖాతాలో చేరింది. తర్వాతి ఓవర్లోనూ మరో సిక్స్ కొట్టిన అనంతరం ఫిలిప్స్ క్యాచ్‌తో ఒక గొప్ప ఇన్నింగ్స్‌కు ముగింపు లభించింది. మైదానంలో 31,755 మంది ప్రేక్షకులు హర్షధ్వానాలతో హోరెత్తిస్తుండగా ఈ పంజాబీ స్టార్ మైదానం వీడాడు. జట్టులో తర్వాతి స్కోరు 34 మాత్రమే అంటే గిల్ జోరు ఎలా సాగిందో అర్థమవుతుంది.

పంజాబ్‌లో జిల్లా స్థాయి అండర్–16 పోటీల్లోనే 351 పరుగులు బాది అందరినీ ఆశ్చర్యపర్చిన గిల్, విజయ్ మర్చంట్ ట్రోఫీలో డబుల్ సెంచరీతో వెలుగులోకి రాగా... వరుసగా రెండేళ్లు బీసీసీఐ బెస్ట్ జూనియర్ క్రికెటర్ అవార్డు అందుకోవడంతో అందరి దృష్టిలో పడ్డాడు. ఆ తర్వాత రాహుల్ ద్రవిడ్ మార్గనిర్దేశనంలో అండర్–19 స్థాయిలో భారీ స్కోర్లు సాధిస్తూ 2018లో అండర్–19 వరల్డ్‌కప్ విజయంలో కీలకపాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాక గిల్‌కు ఎదురు లేకుండా పోయింది. టెస్టుల్లో ఇప్పటికే తన స్థానం సుస్థిరం చేసుకున్న గిల్‌కు సీనియర్ల గైర్హాజరులో వన్డేల్లో ఇటీవల అవకాశాలు వచ్చాయి. వాటిని సమర్థంగా అందిపుచ్చుకొని ఇప్పుడు తనను తప్పించే అవకాశం లేని స్థితికి వచ్చాడు. 23 ఏళ్లకే పలు ఘనతలు సాధించి గిల్ మున్ముందు మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయం.

–సాక్షి క్రీడా ప్రతినిధి

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మిచెల్ (బి) టిక్నర్ 34; గిల్ (సి) ఫిలిప్స్ (బి) షిప్లీ 208; కోహ్లి (బి) సాన్‌ట్నర్ 8; ఇషాన్ కిషన్ (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 5; సూర్యకుమార్ (సి) సాన్‌ట్నర్ (బి) మిచెల్ 31; హార్దిక్ (బి) మిచెల్ 28; సుందర్ (ఎల్బీ) (బి) షిప్లీ 12; శార్దుల్ (రనౌట్) 3; కుల్దీప్ (నాటౌట్) 5; షమీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 349.** **వికెట్ల పతనం:** 1–60; 2–88; 3–110; 4–175; 5–249; 6–292; 7–302; 8–345. **బౌలింగ్:** షిప్లీ 9–0–74–2, ఫెర్గూసన్ 10–0–77–1, టిక్నర్ 10–0–69–1, సాన్‌ట్నర్ 10–0–56–1, బ్రేస్‌వెల్ 6–0–43–0, మిచెల్ 5–0–30–2.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి) (సబ్) షహబాజ్ (బి) శార్దుల్ 40; కాన్వే (సి) కుల్దీప్ (బి) సిరాజ్ 10; నికోల్స్ (బి) కుల్దీప్ 18; మిచెల్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 9; లాథమ్ (సి) సుందర్ (బి) సిరాజ్ 24; ఫిలిప్స్ (బి) షమీ 11; బ్రేస్‌వెల్ (ఎల్బీ) (బి) శార్దుల్ 140; సాన్‌ట్నర్ (సి) కుల్దీప్ (బి) సిరాజ్ 57; షిప్లీ (బి) సిరాజ్ 0; ఫెర్గూసన్ (సి) గిల్ (బి) హార్దిక్ 8; టిక్నర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (49.2 ఓవర్లలో ఆలౌట్) 337** **వికెట్ల పతనం:** 1–28, 2–70, 3–78, 4–89, 5–110, 6–131, 7–293, 8–294, 9–328, 10–337. **బౌలింగ్:** షమీ 10–1–69–1, సిరాజ్ 10–2–46–4, హార్దిక్ 7–0–70–1, కుల్దీప్ 8–1–43–2, శార్దుల్ 7.2–0–54–2, సుందర్ 7–0–50–0.


నాదల్‌కు చుక్కెదురు

- అమెరికా ప్లేయర్ మెకంజీ సంచలనం
- సిట్సిపాస్, మెద్వెదెవ్ ముందంజ

మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బుధవారం పెను సంచలనం నమోదైంది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్, టాప్ సీడ్ రాఫెల్ నాదల్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. అమెరికాకు చెందిన ప్రపంచ 65వ ర్యాంకర్ మెకంజీ మెక్‌డొనాల్డ్ 6–4, 6–4, 7–5తో నాదల్‌ను ఓడించి తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని సాధించాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన నాదల్ ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌లోనే వెనుదిరగడం గత ఏడేళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2 గంటల 32 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మెకంజీ 14 ఏస్‌లు సంధించడంతోపాటు నాదల్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 31 అనవసర తప్పిదాలు చేసిన నాదల్ రెండో సెట్‌లో 3–5తో వెనుకబడిన దశలో ఎడమ తుంటి భాగంలో నొప్పి కలగడంతో మెడికల్ టైమ్ అవుట్ తీసుకున్నాడు. ప్రాథమిక చికిత్స తీసుకున్న తర్వాత ఆట కొనసాగించిన నాదల్ సహజశైలిలో ఆడలేకపోయాడు. నాదల్ సరిగ్గా కదలలేకపోతుండటంతో మెకంజీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యూహాత్మకంగా ఆడి సంచలనం నమోదు చేయడంతోపాటు

ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) 6–3, 6–0, 6–2తో రింకీ హిజికాటా (ఆస్ట్రేలియా)పై, ఆరో సీడ్ ఫీలిక్స్ అలియాసిమ్ (కెనడా) 3–6, 3–6, 6–3, 6–2, 6–2తో అలెక్స్ మొల్కాన్ (స్లొవేకియా)పై, ఏడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 7–5, 6–2, 6–2తో మిల్‌మన్ (ఆస్ట్రేలియా)పై, పదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్) 3–6, 7–6 (7/3), 2–6, 6–3, 6–3తో సొనెగో (ఇటలీ)పై, 16వ సీడ్ టియాఫో (అమెరికా) 6–4, 6–4, 6–1తో జున్‌చెంగ్ షాంగ్ (చైనా)పై గెలిచి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.


నాదల్


మెకంజీ

స్వియాటెక్ జోరు

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. రెండో రౌండ్‌లో స్వియాటెక్ 6–2, 6–3తో కామిలా ఒసోరియో (కొలంబియా)పై గెలిచింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 6–2, 7–6 (7/5)తో సస్నోవిచ్ (రష్యా)పై, ఆరో సీడ్ మరియా సాకరి (గ్రీస్) 3–6, 7–5, 6–3తో డయానా ష్నైదర్ (రష్యా)పై, ఏడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–3, 7–6 (7/4)తో ఎమ్మా రాడుకానూ (బ్రిటన్)పై విజయం సాధించారు. ఇతర మ్యాచ్‌ల్లో 8వ సీడ్ కసత్‌కినా (రష్యా) 1–6, 1–6తో వర్వరా గ్రచేవా (రష్యా) చేతిలో, 15వ సీడ్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) 5–7, 4–6తో అనెలినా కలినినా (ఉక్రెయిన్) చేతిలో, 2019 యూఎస్ ఓపెన్ చాంపియన్ బియాంక ఆండ్రెస్కూ (కెనడా) 6–2, 6–7 (7/9), 4–6తో క్రిస్టినా బుక్సా (స్పెయిన్) చేతిలో ఓడిపోయారు.

అశ్విన్ హెబ్బర్ సెంచరీ

ఆంధ్ర 415 ఆలౌట్



రాజ్‌కోట్: సౌరాష్ట్రతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ అశ్విన్ హెబ్బర్ (109; 12 ఫోర్లు, 1) సెంచరీ సాధించాడు. ఓవర్‌నైట్ స్కోరు 256/5తో బుధవారం ఆట ప్రారంభించిన ఆంధ్ర 415 పరుగుల వద్ద ఆలౌటైంది. లలిత్ మోహన్ (32; 4 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (28; 3 ఫోర్లు) అండతో అశ్విన్ సెంచరీ చేశాడు. సౌరాష్ట్ర బౌలర్లలో యువరాజ్ సింగ్, ధర్మేంద్రసింగ్ జడేజాలు చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట నిలిచే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. షెల్డన్ జాక్సన్ (63 బ్యాటింగ్; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఆంధ్ర బౌలర్ నితీశ్ కుమార్ (2/26)... హర్విక్ (8), చతేశ్వర్ పుజారా (5)లను వరుస ఓవర్లలో అవుట్ చేశాడు.

కార్తికేయకు 7 వికెట్లు

- మహారాష్ట్ర 385 ఆలౌట్
- హైదరాబాద్ 176/5



పుణే: హైదరాబాద్ మీడియం పేసర్ కార్తికేయ కక్ (7/91) నిప్పులు చెరిగే బంతులతో మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌ను కూల్చేశాడు. ఓవర్‌నైట్ స్కోరు 353/5తో రెండో రోజు ఆట ప్రారంభించిన మహారాష్ట్ర అనూహ్యంగా కార్తికేయ విజృంభణకు 32 పరుగులకే మిగతా వికెట్లను కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 385 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్స్ ఆశయ్ పాల్కర్ (61; 9 ఫోర్లు), నౌషాద్ షేక్ (152; 20 ఫోర్లు)లతో పాటు టెయిలెండర్లు తరణ్‌జీత్‌సింగ్ (5), సత్యజీత్ బచవ్ (4)లను కార్తికేయ పెవిలియన్‌కు చేర్చాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ ఆట నిలిచే సమయానికి 75 ఓవర్లలో 5 వికెట్లకు 176 పరుగులు చేసింది. రోహిత్ రాయుడు (68; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), రాహుల్ రాదేశ్ (55; 10 ఫోర్లు) రాణించారు. సంతోష్ గౌడ్ (18 బ్యాటింగ్), రవితేజ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు లైంగికంగా వేధిస్తున్నాడు


ధర్నాకు దిగిన రెజ్లర్లు అన్షు, వినేశ్, సాక్షి, సోనమ్, సరితా మోర్, సంగీత, బజరంగ్ తదితరులు

- బ్రిజ్‌భూషణ్‌ను తప్పిస్తేనే బరిలోకి...
- ధర్నాకు దిగిన భారత మహిళా రెజ్లర్లు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ భారత స్టార్ మహిళా రెజ్లర్లు రోడ్డెక్కారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ అయిన బ్రిజ్‌భూషణ్ సుదీర్ఘకాలంగా తమని లైంగికంగా వేధిస్తున్నారని స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్, సాక్షి మలిక్ సహా 30 మంది రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు దిగారు. ఆయన నియంతృత్వాన్ని, ఆగడాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి, హోం మంత్రి జోక్యం చేసుకోవాలని... అధ్యక్ష పదవి నుంచి ఆయన్ని తప్పించేదాకా ధర్నా విరమించబోమని, పోటీల్లో పాల్గొనబోమని స్పష్టం చేశారు. రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్, ప్రపంచ చాంపియన్‌షిప్ పతక విజేత సరిత మోర్, సంగీతా ఫొగాట్, సత్యవర్త్ కడియాన్, జితేందర్, సుమిత్ మలిక్ తదితర రెజ్లర్లు ధర్నా చేశారు. దేశానికి పతకాలు తెచ్చిన మేటి రెజ్లర్లు రోడ్డెక్కి నినదిస్తుంటే అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ మాత్రం ఈ ఆరోపణల్లో నిజం లేదని తేలిగ్గా కొట్టిపారేశారు. ఏ ఒక్కరినైనా తాను లైంగికంగా వేధించానని నిరూపిస్తే ఉరేసుకొంటానని బ్రిజ్‌భూషణ్ అన్నారు. ఓ పారిశ్రామికవేత్త ప్రోద్బలంతో ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికైన 66 ఏళ్ల బ్రిజ్‌భూషణ్ 2011 డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.


బ్రిజ్‌భూషణ్

చంపుతామని బెదిరింపులు: వినేశ్

కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్, ఒలింపియన్ వినేశ్ ఫొగాట్ మాట్లాడుతూ 'పలువురు కోచ్‌లు అదే పనిగా లక్నోలో నిర్వహించే జాతీయ శిక్షణ శిబిరంలో మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నారు. 10, 12 మంది అమ్మాయిలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి పేర్లను ఇప్పుడే చెప్పను. ప్రధానిని కలిసే అవకాశమిస్తే ఆయనకే వివరిస్తా. నేను ఇదివరకు ఒకసారి బ్రిజ్‌భూషణ్‌పై ఫిర్యాదు చేస్తే చంపుతామని బెదిరించారు' అని విలేకర్ల ముందు విలపించారు. సంగీతా ఫొగాట్ భర్త, టోక్యో ఒలింపిక్స్ కాంస్య విజేత బజరంగ్ పూనియా, అతని కోచ్ సుజిత్ మాన్, ఫిజియో ఆనంద్ దూబే వారికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. బజరంగ్ మాట్లాడుతూ తమ పోరాటం ప్రభుత్వం, కేంద్ర క్రీడా శాఖ, భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్)పై కాదని... కేవలం బ్రిజ్‌భూషణ్ నియంతృత్వంపైనే అని స్పష్టం చేశారు.

'సూపర్ సిక్స్' దశకు భారత్ అర్హత

- స్కాట్లాండ్‌పై 85 పరుగులతో విజయం
- రాణించిన త్రిష, మన్నత్
- అండర్–19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ

బెనోని (దక్షిణాఫ్రికా): తొలిసారి నిర్వహిస్తున్న అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. గ్రూప్ 'డి'లో భాగంగా బుధవారం స్కాట్లాండ్ జట్టుతో జరిగిన చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో భారత్ 85 పరుగుల తేడాతో నెగ్గింది. తద్వారా ఆరు పాయింట్లతో గ్రూప్ 'డి' టాపర్‌గా నిలిచి సూపర్ సిక్స్ దశకు అర్హత సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. టీమిండియాకు ఆడుతున్న తెలంగాణ అమ్మాయి, గొంగడి త్రిష (51 బంతుల్లో 59; 6 ఫోర్లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకుంది. రిచా ఘోష్ (35 బంతుల్లో 33; 3 ఫోర్లు) కూడా రాణించింది. అనంతరం 152 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ 13.1 ఓవర్లలో 66 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. భారత బౌలర్లు మన్నత్ కశ్యప్ (4/12), అర్చన దేవి (3/14), సోనమ్ యాదవ్ (2/1) స్కాట్లాండ్‌ను దెబ్బ తీశారు.


త్రిష

శ్రీకాంత్‌కు మళ్లీ నిరాశ



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో బుధవారం భారత క్రీడాకారులకు నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ప్రపంచ నంబర్ వన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 14–21, 19–21తో ఓడిపోయాడు. అక్సెల్‌సన్ చేతిలో శ్రీకాంత్‌కిది పదో పరాజయం కావడం గమనార్హం. 2017లో డెన్మార్క్ ఓపెన్‌లో చివరిసారి అక్సెల్‌సన్‌ను ఓడించిన శ్రీకాంత్ ఆ తర్వాత ఈ డెన్మార్క్ ప్లేయర్ చేతిలో వరుసగా ఏడోసారి ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మాళవిక (భారత్) 17–21, 12–21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో... ఆకర్షి 15–21, 12–21తో బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని–శిఖా (భారత్) 8–21, 11–21తో పియర్లీ తాన్–థినా (మలేసియా) చేతిలో ఓటమి చవిచూశారు.

ద్యుతీచంద్‌పై నిషేధం

న్యూఢిల్లీ: భారత స్టార్ స్ప్రింటర్ ద్యుతీచంద్ డోపింగ్‌లో పట్టుబడింది. దీంతో ఆమెపై తాత్కాలిక నిషేధం విధించారు. గత డిసెంబర్ 5న ఆమె నుంచి సేకరించిన నమూనాలను పరీక్షించగా నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు 'ఎ' శాంపిల్ పరీక్షల్లో తేలింది. మరోసారి 'బి' శాంపిల్‌ను పరీక్షించాక అందులోనూ ఉత్ప్రేరకాలు నిజమని తేలితే కచ్చితమైన నిషేధం విధిస్తారు. ఆమె మూత్ర నమూనాల్లో నిషిద్ధ అనబాలిక్ స్టెరాయిడ్స్ ఉన్నట్లు తేలింది. ఇది ప్రదర్శన మెరుగుకు ఉపయోగపడే స్టెరాయిడ్. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిషేధిత జాబితాలో ఉంది. ఒడిశాకు చెందిన 26 ఏళ్ల ద్యుతీ 2018 జకార్తా ఆసియా క్రీడల్లో మహిళల 100, 200 మీటర్లలో రజత పతకాలు గెలిచింది.



సాక్షి **బిజినెస్**
గురువారం 19-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	390	61,046
నిఫ్టీ ▲	112	18,165

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,034	▽ 65
డోజోన్స్	33,545	▽ 365
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,831	▽ 20
డాక్స్	15,182	▽ 5
షాంఘై	3,224	▽ 1
నికాయ్	26,791	▲ 652

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,755 ▲	3
బంగారం (99.5 స్వచ్ఛత)	56,528 ▲	3
వెండి (కిలో)	68,993 ▲	332

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.00	82.67
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.73	102.08
€	యూరో	ఎస్‌బీఐ	86.62	89.72
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.40	63.41
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.00	58.42
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.80	62.81
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.67	22.34
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.22	23.02
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.91	12.98

మైక్రోసాఫ్ట్‌లో 10 వేల ఉద్యోగాల కోత

కంపెనీ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడి

న్యూయార్క్: టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. తాజాగా మైక్రోసాఫ్ట్ 10,000 మంది సిబ్బందిని తొలగించనుంది. ఇది కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిబ్బందిలో సుమారు అయిదు శాతం. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల బుధవారం ఈ విషయం వెల్లడించారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న నేపథ్యంలో కంపెనీ ముందుకు సాగాలంటే ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని ఆయన పేర్కొన్నారు. 'ప్రస్తుతం చేపడుతున్న మార్పుల కారణంగా 2023 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ఆఖరు నాటికి మొత్తం మీద 10,000 ఉద్యోగాలు తగ్గనున్నాయి. ఇది మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 5 శాతం లోపే ఉంటుంది' అని సిబ్బందికి పంపిన ఈమెయిల్‌లో సత్య నాదెళ్ల వివరించారు. తొలగించే ఉద్యోగులకు చెల్లించే పరిహారాలు మొదలైన వాటికి సంబంధించి 1.2 బిలియన్ డాలర్ల వ్యయాలను రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో మైక్రోసాఫ్ట్ చూపనుంది. ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు పరిహారం, ఆరు నెలల పాటు ఆరోగ్య సంరక్షణ కవరేజీ మొదలైనవి ప్రయోజనాలు దక్కుతాయి. ప్రస్తుతం పరిస్థితులు గణనీయంగా మారిపోతున్నాయని నాదెళ్ల పేర్కొన్నారు. కొన్ని దేశాల్లో ఇప్పటికే మాంద్యం నెలకొనగా, మరికొన్నింటిలో మాంద్యం తలెత్తవచ్చన్న అంచనాలుండటంతో కంపెనీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయని వివరించారు. ఇప్పటికే ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సంస్థలు 11,000 పైచిలుకు ఉద్యోగాల్లో కోత విధించాయి. అమెజాన్ కూడా 18,000 మంది ఉద్యోగులను తొలగిస్తోంది.



రూ. 407 కోట్లతో సీసీఎల్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్‌స్టంట్ కాఫీ దిగ్గజం సీసీఎల్ ప్రొడక్ట్స్ వియత్నాం తయారీ కేంద్రంలో కొత్త యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 6,000 టన్నుల వార్షిక సామర్థ్యంతో ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ ఫెసిలిటీని నెలకొల్పనున్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.407 కోట్లు. కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను మధ్యంతర డివిడెండ్ రూ.3 చెల్లించాలని బోర్డు నిర్ణయించింది. డిసెంబర్ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 24.9 శాతం ఎగసి రూ.73 కోట్లు సాధించింది. ఎబిటా 9 శాతం పెరిగి రూ.101 కోట్లుగా ఉంది. టర్నోవర్ 26.5 శాతం అధికమై రూ.535 కోట్లు నమోదు చేసింది.



ఎఫ్‌పీవోకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ సై

- ధరల శ్రేణి రూ. 3,112–3,276
- రిటైలర్లకు షేరుకి రూ. 64 తగ్గింపు
- రూ. 20,000 కోట్ల సమీకరణ లక్ష్యం
- ఈ నెల 27–31 మధ్య పబ్లిక్ ఆఫర్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఏఈఎల్) ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పీవో)కు రంగం సిద్ధం చేసింది. ఇందుకు రూ. 3,112 నుంచి రూ. 3,276 ధరల శ్రేణిని నిర్ణయించింది. ఇది తాజా ధరతో పోలిస్తే 10–15 శాతం తక్కువ. రిటైల్ ఇన్వెస్టర్లకు షేరుకి రూ. 64 డిస్కౌంట్ ప్రకటించింది. రిటైలర్లు కనీసం 4 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఆపై ఇదే గుణిజాల్లో దరఖాస్తు చేయవచ్చు. ఇష్యూ ద్వారా రూ. 20,000 కోట్లు సమకూర్చుకోవాలని కంపెనీ భావిస్తోంది. వెరసి దేశీయంగా అతిపెద్ద ఎఫ్‌పీవోగా నిలవనుంది. ఆఫర్ ఈ నెల 27న ప్రారంభమై 31న ముగియనుంది.



నిధుల వినియోగమిలా: ఎఫ్‌పీవో నిధుల్లో రూ. 10,869 కోట్లను గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, ప్రస్తుత విమానాశ్రయాలు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణాలపై అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెచ్చించనుంది. మరో రూ.4,165 కోట్లను ఎయిర్‌పోర్టులు, రోడ్, సోలార్ ప్రాజెక్టు సంబంధ అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు వినియోగించనుంది. గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీ ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్ ఎకోసిస్టమ్, డేటా సెంటర్లు, ఎయిర్‌పోర్టులు, రహదారుల అభివృద్ధి, ఫుడ్, ఎఫ్‌ఎంసీజీ, డిజిటల్, మైనింగ్ డిఫెన్స్, తదితర విభాగాలలో కార్యకలాపాలు విస్తరించిన సంగతి తెలిసిందే.

7 విమానాశ్రయాలు

ఏఈఎల్ ప్రస్తుతం నవీముంబైలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుసహా ముంబై, అహ్మదాబాద్, లక్నో, మంగళూరు, జైపూర్, గువాహటి, తిరువనంతపురంలలో ఎయిర్‌పోర్టులను నిర్వహిస్తోంది. రహదారులు తదితర మౌలిక ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. రానున్న దశాబ్ద కాలంలో గ్రీన్ హైడ్రోజన్ ఎకోసిస్టమ్‌పై 50 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలు ప్రకటించింది. 2022 సెప్టెంబర్ 30కల్లా కంపెనీ రూ. 40,023 కోట్లకుపైగా రుణ భారాన్ని కలిగి ఉంది.

ఎఫ్‌పీవో వార్తల నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 1.5% నీరసించి రూ. 3,585 వద్ద ముగిసింది.

కెనరా బ్యాంక్ 400 రోజుల డిపాజిట్

హైదరాబాద్: కెనరా బ్యాంక్ నూతనంగా 400 రోజుల ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రకటించింది. దీనిపై 7.75 శాతం వరకు వార్షిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది. ఇందులో నాన్ కాలబుల్ డిపాజిట్ (గడువుకు ముందు ఉపసంహరించుకోలేనివి)పై 7.25 శాతం రేటును ఆఫర్ చేస్తుండగా, కాలబుల్ డిపాజిట్‌పై (గడువుకు ముందు రద్దు, పాక్షిక ఉపసంహరణకు వీలైనవి) 7.15 శాతం వార్షిక వడ్డీ రేటును ఇస్తున్నట్టు కెనరా బ్యాంక్ తెలిపింది. 60 ఏళ్లు నిండిన వారికి 0.50 శాతం అదనపు రేటును ఇస్తోంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-1-2023	
విశాఖ	575–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	84.00
18-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563–00
వరంగల్	565–00
రిటైల్ ధర	6.20

రెండో రోజూ మార్కెట్ల జోరు

- సెన్సెక్స్ 390 పాయింట్లు అప్
- నిఫ్టీ 112 పాయింట్లు ప్లస్

ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు జోరు చూపాయి. సెన్సెక్స్ 390 పాయింట్లు జంప్ చేసి 61,046 వద్ద నిలిచింది. వెరసి మళ్లీ 61,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. నిఫ్టీ 112 పాయింట్లు జమ చేసుకుని 18,165 వద్ద ముగిసింది. అయితే తొలుత మార్కెట్లు కొంతమేర డీలా పడ్డాయి. వెనువెంటనే ఊపందుకుని చివరివరకూ పటిష్టంగా కదిలాయి. ఇటీవల అమ్మకాలకే ప్రాధాన్యమిస్తున్న విదేశీ ఇన్వెస్టర్లు మంగళవారం స్వల్ప కొనుగోళ్లు చేపట్టడంతో సెంటిమెంటు బలపడినట్లు నిపుణులు పేర్కొన్నారు. దీనికితోడు ఆసియా, యూరోపియన్ మార్కెట్ల సానుకూలతలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు తెలియజేశారు. మంగళవారం(17న) సైతం సెన్సెక్స్ 563 పాయింట్లు ఎగసిన విషయం విదితమే. కాగా.. తొలుత సెన్సెక్స్ 60,569 వద్ద కనిష్టాన్ని తాకినప్పటికీ ఆపై 61,110 వరకూ దూసుకెళ్లింది. ఈ బాటలో నిఫ్టీ 18,184– 18,032 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. డాలరుతో మారకంలో రూపాయి బౌన్స్‌బ్యాక్ కావడం మార్కెట్లకు జోష్‌నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు.

మెటల్స్ జూమ్

ఎన్‌ఎస్‌ఈలో మెటల్ ఇండెక్స్ 1.7 శాతం పుంజుకోగా, ఫార్మా, ప్రయివేట్ బ్యాంకింగ్ 0.6 శాతం చొప్పున లాభపడ్డాయి. పీఎస్‌యూ బ్యాంక్స్ 1.25 శాతం వెనకడుగు వేశాయి. నిఫ్టీ దిగ్గజాలలో హిందాల్కో, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, యూపీఎల్, విప్రో, కోల్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఎయిర్‌టెల్, జేఎస్‌డబ్ల్యూ, దివీస్, గ్రాసిమ్ 3–1 శాతం మధ్య లాభపడ్డాయి.



రూపాయి స్పీడ్...

డాలరుతో మారకంలో వరుసగా మూడు రోజుల నష్టాలకు దేశీ కరెన్సీ చెక్ పెట్టింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 28 పైసలు లాభపడి 81.41 వద్ద ముగిసింది. అయితే రూపాయి తొలుత 81.80 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. తదుపరి డాలరు ఇండెక్స్ వెనకడుగు వేయడం, దేశీ ఈక్విటీలు ఊపందుకోవడంతో 81.25 వరకూ బలపడింది. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 0.5 శాతం క్షీణించి 101.93కు చేరడం రూపాయికి హుషారునిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

స్టాక్ హైలైట్స్

- ఈ ఏడాది తొలి 9 నెలల్లో ఆదాయం 41 శాతం ఎగసి రూ. 3,384 కోట్లను తాకడంతో ల్యాండ్‌మార్క్ కార్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 587 వద్ద ముగిసింది. తొలుత రూ. 599 వరకూ ఎగసింది. 2022 డిసెంబర్ 23న లిస్టయిన తదుపరి ఇదే గరిష్టం!
- క్యూ3 ఫలితాలపై అంచనాలతో ఉషా మార్టిన్ కౌంటర్ జోరందుకుంది. ఎన్‌ఎస్‌ఈలో 4 శాతం జంప్‌చేసి రూ. 191 వద్ద ముగిసింది. తొలుత రూ. 199 వద్ద 52 వారాల గరిష్టానికి చేరింది.
- గత మూడు వారాల్లో 20% ర్యాలీ చేసిన యురేకా ఫోర్బ్స్ షేరు బీఎస్‌ఈలో తొలుత 1.5 శాతం బలపడి రూ. 537 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని తాకింది. చివరికి అమ్మకాలు పెరిగి 1.6% నష్టంతో రూ. 521 వద్ద ముగిసింది.

ఇండస్ఇండ్ లాభం జూమ్

క్యూ3లో రూ. 1,964 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 58 శాతం జంప్‌చేసి రూ. 1,964 కోట్లను తాకింది. రుణాల నాణ్యత మెరుగుపడటం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం వృద్ధితో రూ. 4,495 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.17 శాతం మెరుగై 4.27 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం సైతం రూ. 1,877 కోట్ల నుంచి రూ. 2,076 కోట్లకు ఎగసింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 1,654 కోట్ల నుంచి రూ. 1,065 కోట్లకు క్షీణించాయి. క్యూ2 (జులై–సెప్టెంబర్)తో పోలిస్తే తాజా స్లిప్పేజీలు రూ. 1,572 కోట్ల నుంచి రూ. 1,467 కోట్లకు తగ్గాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.11 శాతం నుంచి 2.06 శాతానికి వెనకడుగు వేశాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 18.01 శాతానికి చేరింది. ఈ కాలంలో 1,800 మందికి ఉపాధి కల్పించినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో సుమంత్ కథ్‌పాలియా తెలియజేశారు. తొలి 9 నెలల్లో 8,500 మందిని జత చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో బ్యాంక్ మొత్తం సిబ్బంది సంఖ్య 37,870కు చేరింది.



ఫలితాల నేపథ్యంలో ఇండస్ఇండ్ షేరు బీఎస్‌ఈలో 0.7% క్షీణించి రూ. 1,222 వద్ద ముగిసింది.

కర్నూలులో కామినేని ఆసుపత్రి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల రంగ సంస్థ కామినేని హాస్పిటల్స్ తాజాగా కర్నూలులో కొత్తగా ఆసుపత్రిని ప్రారంభించింది. జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ పేరుతో రూ.150 కోట్ల వ్యయంతో 150 పడకలతో ఇది ఏర్పాటైంది. రూ.75 కోట్లతో 75 పడకల సామర్థ్యంతో క్యాన్సర్ చికిత్స కేంద్రం ఈ ఏడాదే స్థాపించనున్నారు. మెరుగైన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలతో వైద్య సేవలను ఈ కేంద్రం తదుపరి స్థాయికి మారుస్తుందని సంస్థ తెలిపింది. అందుబాటు ధరలో ప్రపంచస్థాయి వైద్య సేవలను అందించడం లక్ష్యంగా కర్నూలులో ఆసుపత్రిని నెలకొల్పినట్టు కామినేని హాస్పిటల్స్ వివరించింది. 30 ఏళ్లకుపైగా నాణ్యమైన వైద్య సేవలతో కోట్లాది మందికి చేరువైన కామినేని హాస్పిటల్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 3,000లకుపైగా పడకలతో హైదరాబాద్, నార్కట్‌పల్లి, విజయవాడలో ఆసుపత్రులను నిర్వహిస్తోంది. మెడికల్, డెంటల్ కళాశాలలు సైతం ఉన్నాయి.



భవిత

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

టీఎస్ సెట్‌కు సిద్ధమా..!

టీఎస్ సెట్-2023

తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్లుగా అర్హత సాధించేందుకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీఎస్ సెట్)కు ప్రకటన వెలువడింది. జనరల్ స్టడీస్‌తోపాటు మరో 29 సబ్జెక్టులతో టీఎస్ సెట్‌ను నిర్వహిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. అర్హతలు, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి...

ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్–సీబీటీ) విధానంలో నిర్వహించే ఈ పరీక్ష కోసం తెలంగాణలోని పాత పది జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ నుంచి వచ్చే దరఖాస్తులను రిజర్వేషన్లతో సంబంధం లేకుండా జనరల్ కేటగిరికి చెందినవిగా పరిగణిస్తారు.

సబ్జెక్టులు

జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, హిందీ, హిస్టరీ, లా, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.

అర్హత

కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ,ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం

కంప్యూటర్ ఆధారిత టెస్టు(సీబీటీ) పద్ధతిలో జరిగే పరీక్షకు రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1లో 50 ప్రశ్నలకు–100 మార్కులు, పేపర్–2లో 100 ప్రశ్నలకు–200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పేపర్–1: ఆబ్జెక్టివ్ తరహాలో 50 ప్రశ్నలకు పేపర్–1 ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కులు కేటాయిస్తారు. ఇందులో అభ్యర్థుల బోధన/పరిశోధన ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలుంటాయి. అలాగే తార్కిక సామర్థ్యం, గ్రాహణశక్తి, భిన్నమైన ఆలోచనల దృక్పథాన్ని పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు.

పేపర్–2:
- ఈ పేపర్‌లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్టు నుంచి ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కుల చొప్పున 100 ప్రశ్నలను అడుగుతారు.
- పేపర్–1 ప్రశ్నపత్రం అందరికి కామన్‌గా ఉంటుంది. ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో పరీక్ష రాసుకోవచ్చు. పేపర్–2లో మాత్రం కొన్ని సబ్జెక్టులకు సంబంధించి రెండు మాధ్యమాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 20.01.2023
- **ఎడిట్‌ఆప్షన్:** 2023 ఫిబ్రవరి 6,7 తేదీల వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడ్:** 2023 ఫిబ్రవరి చివరి వారంలో
- **పరీక్ష తేదీలు:** 2023 మార్చి మొదటి లేదా రెండో వారంలో
- **వెబ్‌సైట్:** www.telanganaset.org

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ హైకోర్టులో 17 ఎగ్జామినర్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఎగ్జామినర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. • **మొత్తం పోస్టుల సంఖ్య:** 17

- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/లా) లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు/బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ పరీక్ష(30 మార్కులు), ఇంటర్వ్యూ(10 మార్కులు), రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్షా విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)లో 90(జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్) ప్రశ్నలుంటాయి. ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష సమయం 120 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేదీ:** 21.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** 11.02.2023.
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ:** 20.02.2023.
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీ:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

జవహర్ నవోదయ విద్యాలయాలు.. నాణ్యమైన విద్యకు కేరాఫ్! ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ.. చదువు, వసతి, భోజనం అంతా ఉచితం. ఒత్తిడిలేని విద్య, ఆటపాటలతో వికాసానికి పెద్దపీట వేసే విద్యాలయాలు ఇవి. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా వీటిల్లో అడ్మిషన్ లభిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో..నవోదయ విద్యాలయాల ప్రత్యేకతలు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం గురించి తెలుసుకుందాం...

పల్లె విద్యార్థులకు 'నవోదయం'

» జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో అడ్మిషన్స్
» 2023-24 విద్యాసంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ ప్రారంభం
» జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా నిలుస్తున్న జేఎన్‌వీలు

స్కూల్ ఎడ్యుకేషన్



పాఠశాల చదువు విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైనది. ఈ దశలో వినూత్న విద్య, బోధన విధానాన్ని అమలు చేసి.. బాలల సంపూర్ణ వికాసానికి పునాదులు వేయాలనే లక్ష్యంతో ఏర్పాటైనవే జవహర్ నవోదయ విద్యాలయాలు. ఇందుకోసం కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో జవహర్ నవోదయ విద్యాలయ సమితి పేరిట ప్రత్యేక సంస్థను సైతం నెలకొల్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యంగా జేఎన్‌వీలు అడుగులు వేస్తున్నాయి.

లెర్నింగ్ బై డూయింగ్

నవోదయ విద్యాలయాల బోధనలో లెర్నింగ్ బై డూయింగ్ విధానం అమలవుతోంది. అంటే.. ఏదైనా ఒక అంశాన్ని బోధించేటప్పుడు దానికి సంబంధించి ప్రాక్టికల్స్, పజిల్స్, క్విజ్‌లు వంటి వాటి ద్వారా సదరు అంశంపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తారు. అంతేకాకుండా నవోదయ పాఠశాలల్లో మరో ప్రత్యేక విధానం..యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్. ముఖ్యంగా సైన్స్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్ట్‌లకు సంబంధించి విద్యార్థులకు వాస్తవ దృక్పథం, ఆలోచన పరిధి పెరిగేలా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేస్తున్నారు. ప్రాజెక్ట్ వర్క్స్, స్కూల్ స్థాయిలో ఎగ్జిబిషన్స్ వంటివి నిర్వహిస్తూ.. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలకు వాస్తవ రూపం ఇచ్చేలా బోధన ఉంటోంది.

పూర్తిగా రెసిడెన్షియల్

నవోదయ విద్యాలయాల్లో పూర్తిగా రెసిడెన్షియల్ విధానం అమలవుతోంది. వీటిలో ప్రవేశం పొందిన విద్యార్థులు సదరు పాఠశాలల వసతి గృహాల్లోనే ఉండి చదువుకోవాల్సి ఉంటుంది. క్లాస్ రూమ్ తరగతులతోపాటు.. అవి ముగిశాక హాస్టల్స్‌లో మెంటార్స్ సదుపాయం సైతం అందుబాటులో ఉంటుంది. తద్వారా విద్యార్థులు క్లాస్ రూమ్ వెలుపల అభ్యసనం సాగించే సమయంలో ఉపాధ్యాయుల సహకారం అందేలా చూస్తున్నారు.

ఎనిమిది నుంచి ఇంగ్లిష్ మీడియం

నవోదయ విద్యాలయాల్లో ఎనిమిదో తరగతి నుంచి ఇంగ్లిష్ మీడియం బోధన మొదలవుతుంది. ఎనిమిదో తరగతి నుంచి మ్యాథమెటిక్స్,సైన్స్ సబ్జెక్టులను ఇంగ్లిష్ మీడియంలో, సోషల్ సైన్స్ సబ్జెక్ట్‌ను హిందీ మీడియంలో చదవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.ఆరో తరగతి వరకు మాత్రం విద్యార్థులు తమ మాతృ భాష లేదా తమ ప్రాంతీయ భాషలో చదివే అవకాశం కల్పిస్తున్నారు.

ఫీజులు లేవు

జేఎన్‌వీల మరో ప్రత్యేకత..ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యను అందించడం. రెసిడెన్షియల్ విధానంలో వసతి, భోజన సదుపాయం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు.. ఇలా అన్నింటినీ ఉచితంగా అందిస్తారు. విద్యా వికాస్ నిధి పేరిట ఏర్పాటు చేసిన నిధికి నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఈ చెల్లింపు నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళా విద్యార్థులు, బీపీఎల్ వర్గాల(దారిద్య్ర రేఖ దిగువ ఉన్న) పిల్లలకు మినహాయింపునిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు మాత్రం నెలకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది.

ఏపీలో 15, తెలంగాణలో 9

- ప్రస్తుతం జవహర్ నవోదయ విద్యాలయ సమితి పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా 649 నవోదయ పాఠశాలలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 అందుబాటులో ఉన్నాయి. ఏపీలోని 15 పాఠశాల్లో 2 పాఠశాలలను ఎస్సీ/ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో అదనంగా ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.
- ప్రతి నవోదయలో ఆరో తరగతిలో గరిష్టంగా 80 సీట్లు అందుబాటులో ఉంటాయి. కనిష్టంగా 40 సీట్లు ఉంటాయి. గతేడాది వరకు గరిష్ట సీట్ల సంఖ్య ప్రతి పాఠశాలలో 60గా మాత్రమే ఉండేది. ఈ ఏడాది 80కి పెరగడంతో మరింతమంది విద్యార్థులకు నవోదయలో చదివే అవకాశం లభించనుంది.

అర్హతలు

- 2022–23లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. లేదా ఎన్ఐఓఎస్ నిర్వహించే 'బి' కాంపిటెన్సీ కోర్సు చదువుతుండాలి.
- విద్యార్థులు తాము దరఖాస్తులో పేర్కొన్న జేఎన్‌వీ నెలకొన్న జిల్లాలకు చెందిన వారై ఉండాలి.
- గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు కేటాయించిన 75 శాతం సీట్లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా..గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లోనే మూడు,నాలుగు,అయిదో తరగతి చదవాలి.
- **వయసు:** మే 1, 2011–ఏప్రిల్ 30, 2013 మధ్యలో జన్మించి ఉండాలి.

100 మార్కులకు పరీక్ష

- నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ)ను నిర్వహిస్తారు. 2023–24కు సంబంధించి ఈ పరీక్ష ఏప్రిల్ 29న జరుగనుంది.
- జేఎన్‌వీఎస్‌టీ మూడు విభాగాల్లో మొత్తం 80 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ 40 ప్రశ్నలు–50 మార్కులు, అర్థమెటిక్ టెస్ట్ 20 ప్రశ్నలు–25 మార్కులు, లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలు–25 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతోనే ఉంటుంది.
- ఆయా రాష్ట్రాల మాతృభాషల్లోనూ పరీక్ష నిర్వహిస్తారు. ▪ విద్యార్థులు దరఖాస్తు సమయంలోనే తాము పరీక్ష రాయదలచుకున్న మాధ్యమాన్ని పేర్కొనాలి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మరాఠీ, ఉర్దూ, కన్నడ భాషల్లో పరీక్ష రాసే అవకాశం ఉంది. ఏపీ విద్యార్థులు అదనంగా ఒరియా మాధ్యమంలోనూ పరీక్షకు హాజరయ్యే వీలుంది.

జిల్లా స్థాయిలో ఎంపిక

- ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా రాష్ట్రాల్లోని జిల్లాలో నెలకొల్పిన జేఎన్‌వీల్లో ప్రవేశం కల్పిస్తారు. అభ్యర్థులు సదరు జేఎన్‌వీ నెలకొన్న జిల్లాకు చెందిన వారై ఉండాలి.
- జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో సాధించిన మార్కులు, దరఖాస్తు చేసుకున్న జిల్లా.. సదరు జిల్లాలో ఉన్న జేఎన్‌వీలో ఉన్న సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని.. రిజర్వేషన్లకు అనుగుణంగా జిల్లా స్థాయిలో తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. ఈ జాబితాలో నిలిచిన విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది.

పల్లే విద్యార్థులకు ప్రాధాన్యం

జేఎన్‌వీలలోని సీట్లలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను పల్లే ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. అదే విధంగా మహిళా విద్యార్థులను ప్రోత్సహించేందుకు మొత్తం సీట్లలో 33 శాతం(1/3వంతు) సీట్లను బాలికలకు కేటాయిస్తారు.

పాఠ్య పుస్తకాలే ఆదరవుగా

జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు పాఠ్య పుస్తకాలనే ఆదరవుగా చేసుకోవాలి. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు అకాడమీ పుస్తకాలు, అలాగే ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్‌ను చదవడం ఉపయుక్తంగా ఉంటుంది. ప్రధానంగా నాలుగు, అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను చదవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 31,2023
- **జేఎన్‌వీఎస్‌టీ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 29.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://navodaya.gov.in

కో-కరిక్యులర్ యాక్టివిటీస్

జేఎన్‌వీల్లో కో–కరిక్యులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోంది. ఎస్సే రైటింగ్, డిబేట్స్, క్విజ్‌లు వంటివి నిర్వహించడం ద్వారా విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరగడమే కాకుండా.. నైపుణ్యాలు కూడా పెంపొందుతాయి.

–కె.వి.సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, జేఎన్‌వీ–హైదరాబాద్ రీజియన్

దేశంలో పెద్ద పులులు **4,500** పైచిలుకు..

దేశంలో చిరుతలు **2,300**

అడవులు కుంచించుకుపోతుండటంతో సమీప గ్రామాలు, పట్టణాల్లోకి పులులు..

మనుషులపై దాడులు పెరిగిపోతున్న వైనం.. పశువులపై దాడులకు లెక్కే లేదు..

తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో సమస్య

మనిషికి, మృగానికి మధ్య

పెరుగుతున్న ఘర్షణలు



అరణ్యకాండ!

పులులతో యుద్ధమే..

పులుల దాడుల నేపథ్యంలో వాటి నుంచి రక్షణ కోసం ఒకరకంగా యుద్ధమే చేయాల్సి వస్తోంది. గత ఏడాది మనుషులకు, వన్య మృగాలకు మధ్య ఘర్షణలకు సంబంధించిన ఘటనలు దాదాపు 500కు పైగా నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల సరిహద్దుల్లో 33,309 హెక్టార్లకు విస్తరించి ఉన్న అటవీ ప్రాంతం పెద్ద పులులకు ఆవాసంగా మారింది. ఆ ప్రమాదకరమైన ప్రదేశాలకు ప్రజలను దూరంగా ఉంచడంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఈ క్రమంలో మనిషి రక్తం మరిగిన ఓ పులి మహారాష్ట్ర నాసిక్ జిల్లాలో నెల వ్యవధిలోనే 8 మందిని చంపి తిని కనిపించకుండా పోయిన ఘటన ఆ రాష్ట్ర అధికార యంత్రాంగానికి నిద్ర లేకుండా చేసింది. మరో పులి చంద్రాపూర్ జిల్లాలో ఆరుగురిని బలితీసుకుంది. కర్ణాటకలోని కొడగు జిల్లాలో ఇటీవల పులి ఐదుగురిపై దాడి చేసి చంపింది. తాజాగా గురువారం కేరళలోని వయనాడ్ జిల్లాలో ఓ రైతుపై అతని ఇంటి వద్దనే దాడి చేసిన పులి తీవ్రంగా గాయపరచడం కలకలం రేపింది. ఆ తర్వాత అతను చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించాడు. గతేడాది మహారాష్ట్రలో 105 మంది పులుల చేతిలో హతమయ్యారని అటవీ శాఖ మంత్రి ఎం.సుధీర్ శాసనసభకు చెప్పారు. అంతకుముందు 2020–21లో 86 మంది, 2019–20లో 80 మంది, 2018–19లో 47 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన వివరించారు.



కంచర్ల యాదగిరిరెడ్డి

దేశంలో ఒక పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంటే.. మరోపక్క పోడు వ్యవసాయం, ఇతరత్రా కారణాలతో అటవీ ప్రాంతం కుంచించుకుపోవడం కొత్త సమస్య తెచ్చిపెడుతోంది. మనిషికీ, వన్య మృగానికీ మధ్య ఘర్షణకు దారితీస్తోంది. పులులు అడవులను దాటి సమీపంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రవేశించడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది.

పదేళ్లలో 100% పెరుగుదల

దేశంలో గత పదేళ్ల కాలంలో చిరుతలు, పెద్ద పులుల సంఖ్య అనూహ్యంగా 100 శాతం పెరిగిందని తాజాగా చేపట్టిన గణన ద్వారా వెల్లడైంది. దాదాపు నాలుగు వేల మంది అటవీ శాఖ సిబ్బంది 54 టైగర్ రిజర్వు ప్రాంతాల్లోని 14,500 చదరపు కి.మీ. మేర అడవుల్ని గాలించి మరీ 4,500 పైచిలుకు పెద్ద పులులు, 2,300 చిరుతలు ఉన్నాయని లెక్క తేల్చారు. దేశంలో మిజోరం మినహా అన్ని రాష్ట్రాల్లో పులుల జాడ కనిపించడం విశేషం. వన్యమృగ సంరక్షణ చరిత్రలో ఇది గుర్తుంచుకోదగిన విశేషమని కజిరంగ నేషనల్ పార్క్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి రమేశ్ గగోయ్ అన్నారు. ప్రస్తుతం అక్కడ అనేక రకాల వందల కొద్దీ జంతువులతో పాటు 125కు పైగా పులులు ఉన్నాయి. పులుల సంఖ్య పెరగడం శుభసూచకమే అయినా మనుషులకు, మృగాలకు మధ్య కొనసాగుతున్న ఘర్షణ దేశంలో కొన్నిచోట్ల రక్తసిక్తం కావడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

తెలంగాణలో వారం వ్యవధిలో ఇద్దరు

తెలంగాణ రాష్ట్రంలోని కుమ్రంభీం జిల్లా వాంకిడి ప్రాంతంలో సంచరిస్తున్న పులి వారం వ్యవధిలోనే ఇద్దరిని బలి తీసుకుంది. గతేడాది ఆ ప్రాంతంలో సంచరిస్తున్న పులులు 170 పశువులపై దాడి చేసి హతమార్చాయి. 'మేము అటవీ ప్రాంతాల పరిసరాలకు వెళ్లకుండా ఉండలేము. ఎందుకంటే అక్కడ పోడు భూముల్లో వ్యవసాయం చేస్తున్నాం. వెళితే ప్రమాదమని తెలిసినా వెళ్లక తప్పడం లేదు..' అని కుమ్రంభీం జిల్లా దిగడ గ్రామానికి చెందిన కళావతి వాపోయారు.

పులులు ఎక్కువ ఉన్న చోట్లే..

పులులు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయో ఆ ప్రాంతాల్లోనే ఘర్షణలు ఎక్కువగా జరుగుతున్నాయని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇటీవల ఓ నివేదికలో వెల్లడించింది. తగ్గిపోతున్న అడవుల్లో పులుల సంఖ్య పెరగడంతో అవి జనావాసాలకు రావడం అధికమైంది. ధ్వని కాలుష్యంతో పాటు దీపాల వెలుగులు, గ్రామీణ ప్రాంతాల్లోనూ పట్టణాల వాతావరణం వంటి అంశాల వల్ల ఏర్పడే గందరగోళంతోనే ఇతర జంతువుల లాగే పెద్ద పులులు భయాందోళనలతో దాడులు చేయడం, చంపడం వంటివి చేస్తున్నాయని ఆ నివేదిక వివరించింది. పులులు ఉన్నాయని తెలిసినా మనుషులు పోడు వ్యవసాయం, ఇతరత్రా అవసరాల కోసం అటవీ ప్రాంతాల పరిసరాలకు వెళ్లక తప్పడం లేదు. గత ఏడాది నవంబర్ 15న కుమ్రంభీం జిల్లా వాంకిడి సమీపంలో పత్తి చేనుకు కాపలా కాస్తున్న సీడాం భీము (69)ని పెద్ద పులి దాడి చేసి చంపేసింది. అదే జిల్లా దహెగం మండలం దిగిడ గ్రామానికి చెందిన 19 ఏళ్ల విఘ్నేష్‌పై దాడి చేసి చంపింది.



ఏటా 20 శాతం పెరుగుదల

పులుల సంఖ్య పెరుగుతున్న ప్రాంతాల్లో సాధారణంగా ఈ పెరుగుదల ఏడాదికి 20% కంటే ఎక్కువగా ఉందని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఇటీవల పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో తెలిపింది. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఇండియా 2020 వెల్లడించిన నివేదికను బట్టి చూస్తే 2016–20 మధ్య దేశవ్యాప్తంగా పులుల స్వాధీనంలో ఉన్న ప్రదేశం 10 వేల చ.కి.మీ. మేర కుంచించుకుపోయింది. ఒక్క యూపీలోనే గత పదేళ్లలో అటవీ ప్రాంతం వంద చ.కి.మీ. మేర హరించుకుపోయిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. పులులు పెరుగుతున్న చోట అటవీ భూములు కుంచించుకుపోకుండా చూడాలని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా గత అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. కాగా, పులులు, ఇతర వన్యప్రాణులు రోడ్లు, రైల్వే ట్రాక్‌లపైకి చేరి చనిపోతున్నాయని ఎఫ్ఎస్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. 2017–18 నుంచి 2020–21 మధ్య దేశవ్యాప్తంగా 63 వేల వన్యప్రాణులు రైళ్ల కింద పడి మరణించాయని, వాటిలో నాలుగు సింహాలు, 73 ఏనుగులు సహా 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద ఉన్న జంతువులు ఉన్నట్లు కాగ్ తెలిపింది.

తెలుగు రాష్ట్రాల్లో 100

దేశంలోని ఏ ఇతర రాష్ట్రాలకు తీసిపోని విధంగా తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పులుల సంఖ్య 100కు పెరిగింది. 2014లో వీటి సంఖ్య 46 మాత్రమే. తెలంగాణలోని నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, ఏపీలోని ఉభయగోదావరి, కర్నూలు, గుంటూరు, ప్రకాశం జిల్లాల అటవీ ప్రాంతాలే మొదటి నుంచి పెద్ద పులులకు ఆవాసాలుగా పేరొందాయి. పులుల సంఖ్య పెరుగుతున్న కారణంగానే కేంద్ర ప్రభుత్వం 1983లోనే ఉమ్మడి ఏపీ ఐదు జిల్లాల పరిధిలో పది వేల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతాల్లో నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసింది. అయితే అడవుల్లోకి నక్సలైట్ల ప్రవేశంతో 2005 వరకూ పులుల సంఖ్య క్రమేపీ తగ్గుతూ వచ్చింది. ఆ తర్వాత నక్సలైట్ల ఉద్యమం తగ్గుముఖం పట్టడంతో 2008 నుంచి పులుల సంఖ్య పెరగడం ప్రారంభమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలో కాగజ్‌నగర్, చెన్నూరు, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ఖానాపూర్ ఫారెస్ట్ డివిజన్లలో పులుల సంచారం అధికమైంది. ప్రస్తుతం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) పెద్ద పులుల అభయారణ్యంగా పేరుగాంచింది.

ఊపిరి నిలపరూ...

అరుదైన జన్యు వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల చిన్నారి

- వెన్నెముక కండరాల బలహీనతతో మంచానికే పరిమితం
- శ్వాస తీసుకోవడంలోనూ తీవ్ర ఇబ్బంది
- వెంటనే చికిత్స అందించకపోతే ప్రాణాపాయం
- తమ బిడ్డను కాపాడాలంటున్న గిరిజన దంపతులు

రూ.16 కోట్ల విదేశీ ఇంజెక్షనే సంజీవని అంటున్న వైద్యులు

మెదక్ జోన్: పేదింటి గిరిజన బిడ్డకు పెద్ద రోగమొచ్చింది. కోట్లాది మందిలో ఒకరికి పుట్టుకతో వచ్చే స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) అనే వెన్నెముకకు సంబంధించిన కండరాల బలహీనత వ్యాధితో ఓ చిన్నారి మూడేళ్లుగా మంచానికి పరిమితమైంది. ఆ చిన్నారి బతకాలంటే అమెరికా నుంచి అత్యంత ఖరీదైన ఇంజెక్షన్‌ను తీసుకురావాలి. దాని ఖరీదు రూ. 16 కోట్లపైనే ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. దీంతో ఆ బాలిక తల్లిదండ్రులు తమ బిడ్డను బతికించండి అంటూ కనిపించిన వారినల్లా వేడుకుంటున్నారు.



అమాయకపు చూపుల్లో ఎన్ని ప్రశ్నలో..

మృత్యువుతో పోరాడుతున్న రోజా అమాయకపు చూపులు అందరినీ కలచి వేస్తున్నాయి. అమ్మ ఒడిలో కూర్చొని ఆయాసంగా ఊపిరి తీసుకుంటోంది. నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లండి అంటూ సైగలు చేస్తోంది.

పుట్టిన 6 నెలల తర్వాత...

మెదక్ జిల్లా వాడి పంచాయతీ పరిధిలోని దూప్‌సింగ్ తండాకు చెందిన రేఖ–లక్ష్మణ్ దంపతులకు తొలి సంతానంగా రోజా పుట్టింది. ఆరు నెలల వరకు ఆ చిన్నారి ఆరోగ్యంగానే ఉండేది. ఆ తర్వాత బోర్లా పడే వయసు వచ్చినా పడుకోబెట్టిన చోటే కదలకుండా ఉండటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో తల్లిదండ్రులు ఆమెను తొలుత మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆ తర్వాత హైదరాబాద్‌లోని నిలోఫర్, నిమ్స్ సహా పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి చూపించారు. బాలికను పరీక్షించిన వైద్యులు దీన్ని ఎస్ఎంఏ అనే జన్యుపరమైన వ్యాధిగా తేల్చారు. దీనివల్ల కండరాలు రోజురోజుకూ బలహీనపడి మరణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వీలైనంత వెంటనే అమెరికా నుంచి జన్యు లోపాన్ని సరిదిద్దే ఇంజెక్షన్‌ను తీసుకొస్తేనే వ్యాధిని నయం చేయవచ్చని డాక్టర్లు తేల్చిచెప్పారు. కన్నబిడ్డ కళ్లముందే కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుంటే తట్టుకోలేని ఆ పేద తల్లిదండ్రులు నెలకు రూ. 10 వేలు ఖర్చు చేసి తాత్కాలిక చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే ఉన్నదంతా అమ్మి చికిత్స చేయించారు. తమ బిడ్డకు ఎప్పటికప్పుడు తాత్కాలిక చికిత్స అందించకపోతే ఊపిరి అందదని తల్లిదండ్రులు చెబుతున్నారు. కాగా, జీన్ థెరపీ ద్వారా ఎస్ఎంఏ రోగులకు కొత్త జీవితం ప్రసాదించవచ్చని మెదక్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీసీ శేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఇంజెక్షన్ (zolgensma-onasemnogene abeparvovec) అమెరికాలో దొరుకుతుందని, . దాని విలువ రూ. 16 కోట్ల నుంచి 18 కోట్ల మధ్య ఉంటుందని అన్నారు.

9 నెలల్లో.. రూ.10 వేల కోట్ల ఆదాయం

సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే సరికొత్త రికార్డు

సాక్షి, హైదరాబాద్: సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే వరుసగా ఆల్‌టైమ్ రికార్డులను నమోదు చేస్తోంది. ఇటీవలే ఒక నెలలో అత్యధిక ఆదాయం సాధించి పాత రికార్డులు బద్దలు కొట్టిన దక్షిణ మధ్య రైల్వే.. ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లోనే ఏకంగా రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని సాధించి కొత్త రికార్డు సృష్టించింది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 9 నెలల 16 రోజుల్లో రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని దాటేసింది. 2019లో 343 రోజుల వ్యవధిలో రూ. 10 వేల కోట్ల మార్కును సాధించటం ఇప్పటివరకు రికార్డు. ఇప్పుడు 290 రోజుల్లోనే ఆ ఘనతను సాధించింది. ఈ రికార్డు విషయంలో దేశంలో 18 రైల్వే జోన్లకుగాను తొలి మూడు జోన్లలో ఒకటిగా నిలవటం విశేషం. 100 మిలియన్ టన్నుల సరుకును వివిధ ప్రాంతాలకు తరలించటం ద్వారా ఈ భారీ ఆదాయాన్ని సాధించింది. తాను తరలించే మొత్తం సరుకులో బొగ్గు వాటా 50 శాతం కంటే ఎక్కువగా ఉంటోంది. ఆ తర్వాత 26 శాతం వాటాతో సిమెంటు రెండో స్థానంలో ఉంది. తక్కువ సమయంలో రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని సాధించినందుకు రైల్వే ఆపరేటింగ్, కమర్షియల్ విభాగాల అధికారులను దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.